ఆంధ్రపత్రిక

సచిత్ర వారపతి



4 అణాలు

18-11-'53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEK


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
(విష్ణుశర్మ:) "మయూర రాజుకు - మరాళ రాజుకు - గృధ్ర చక్రములు - సంధి చేసినవి."
"అది యెట్లో సెలవియ్యండి"
తన సేనావాహిని యంతయు సమరంలో నిహతులు కాగా హిరణ్యగర్భుడు దుర్గం చేరి దీనవదనుడై తిరుగుచుండెను.
"మన దుర్గానికి చిచ్చు పెట్టిన పరమ కిరాతుడు ఎవరోయీ? మారువేషమున లోనికి వచ్చిన శత్రు సైనికుడు చేసిన పనియే!"
"దేవర వారికి ప్రియబాంధవుడై వంచన చేసెను నీలవర్ణుడే! మీరి వింతను గమనించితిరా? సపరివారంగా అదృశ్యుండై ఎవరి కంటనూ పడకున్నాడు."
"ఇది యంతయు మా దురదృష్టమే. మంత్రుల దోషం లేశం లేదు. దైవ నిర్ణయము ప్రతికూలించగ మన ప్రయత్నములు నిష్ఫలమయ్యెను."
"స్వయం కృతాపరాధము ప్రభూ! దైవము నేటికి దూషించెదరు? హితమును కోరి ఉపదేశించిన నా మాటలనే సరకు సేయక ఘోర విపత్తును తెచ్చుకొంటిరి..."
"హితమును కోరే సచివుల మాటల సరకు సేయనీ ప్రభువులందరికి సహవాసి హితోపదేశం వినక చెడిన దీర్ఘసూత్రుని నాశము తప్పదు!"
"ఎవరా దీర్ఘసూత్రుడు? ఏమా కథ?"
ఒక్క యేటి మడుగులోన - దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు - దీర్ఘసూత్రుడను పేరుల బరిగే - మీనరాజములు మూడూ - గాఢ మైత్రిని మెలిగేవి.
దీర్ఘకాల మిట్లే గడవగ నిప్పులు చెరిగే వేడిగాడ్పులూ సలసల కాగే మండుటెండలూ ప్రారంభించెను ఆ వత్సరమూ.
(దీర్ఘదర్శి:) "మడుగులోని నీరంతయు దినదినమూ తగ్గుచుండె. మనమిప్పుడె వేగిర పడి వేరొక కొలనికి పోక పోతిమా మన ప్రాణాలకు ముప్పు తప్పదు!"
(ప్రాప్తకాలజ్ఞుడు): "ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో ఆ కార్య సాధనే మన కర్తవ్యం రానున్న ఆపద తలుచుకొని వగపు చెందుటది ఉచితము కాదు."
28

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 11
18.11-53

విజయ కార్తిక శుద్ధ ద్వాదశి బుధవారం



విజయవాడ సూపరింటెండింగు ఇంజనీరు, జి. ఏ. నరసింహారావుగారు తయారుచేసి కృష్ణానదిపై నిర్మించ నుద్దేశింపబడిన రోడ్డుబ్రిడ్జి రెగ్యులేటరు కొయ్య నమూనా.

విషయానుక్రమణిక:

అక్షర తూణీరం

"పదేళ్లలో మీ రాష్ట్రం
తప్పక నయమవుతుంది"
గ్రహబలాలు గుణించారు
త్రికాలవేది త్రివేది.

"ఆందోళన లేకుండా
వచ్చితీరు విశాలాంధ్ర"
కడప కోటిరెడ్డిగారి
కలలోపల పలవరింత.

అత్తా కోడళ్లలో
ఎవరిదింటి పెత్తనం?
మన ఆంధ్రాకే సరిలే
ఈ పేచీ కోరుతనం.

అసలే పౌరాణిక కథ,
వృద్ధ తార హీరోయిను,
ఇంక చెత్త తెలుగుఫిలిము
ఎవడు చూచి హర్షించును?

రంగుమార్చి రంగేయుట
రాంగేయుల మామూలు.
మంత్రివర్గ స్వర్గానికి
నిచ్చెనకద కర్నూలు.

రాయలశుద్ధాంతంలో
అష్టపట్ట మహిషులు,
తాత్కాలిక దేవేంద్రులు
అభినవాంధ్ర నహుషులు

ఈ ఆటకు పనికిరాదు
కళావారి మణేలా
అడ్డాటే వేస్తేనా
పట్టుటకిక పగ్గాలా?

ఆంధ్రా పీయస్పీ తె
న్నేటి జలకమాడింది.
'జైప్రకాశ' అనమంటే
'జై ప్రకాశ' మంటుంది.

—సవ్యసాచి

కాలక్షేపం

"కారణమైన కర్మములు
  కాక దిగంబడ వెన్ని గొందులం
దూరిన నెంత వారలకు;—
  దొల్లి పరీక్షిత్తు శాపభీతుడై
వారిధినొప్పు నుప్పరిగపై
  బదిలంబుగ డాకియుండినం
గ్రూరభుజంగ దంతహతి
  గూలడె లోకు లెరుంగ భాస్కరా!"

తా॥ భాస్కరా! ఎన్ని రహస్య ప్రదేశములలో దాగినప్పటికిన్ని, ఎంతటివారికైనా సరే, తమ కర్మఫలితంగా జరిగి తీరవలసినవి జరుగక మానవు. పూర్వము పరీక్షిత్తు మహారాజు ముని శాపమునకు భయపడి, సముద్రములో ఒక మేడ కట్టుకొని ఆ మేడమీద జాగ్రత్తగా దాగియుండినప్పటికిన్నీ భయంకరమగు పాము కాటువల్లనే జగద్విదితముగా మృతుడయ్యెను గదా!

పాండవుల తర్వాత హస్తినాపురంలో రాజ్యం చేసినవాడు పరీక్షిత్తు. ఇతని తండ్రి అభిమన్యుడు. తల్లి పేరు ఉత్తర. ఈ పరీక్షిత్తుయొక్క తాతగారే అర్జునుడు. పరీక్షిత్తు ఒకనాడు వేటకు వెళ్ళి, తనకు దప్పియగుటచేత అక్కడ తపస్సు చేసికొనుచున్నటువంటి శమీకుడనే మునీశ్వరుని దాహోదకం యివ్వవలసినదిగా అడిగెను. కాని తపస్సులో నిమగ్నుడైన ఆ ముని ఏమీ జవాబు చెప్పలేదు. అప్పుడు పరీక్షిత్తునకు ఆ ముని మీద కోపంవచ్చి అడవిలో చచ్చిపడియున్న ఒక పామును తెచ్చి ఆ మునీశ్వరుని మెడలో వేసెను కొంతసేపటికి శమీక మహర్షియొక్క కుమారుడైన శృంగి వచ్చి తన తండ్రి మెడలో ఉన్నటువంటి పామును చూచెను. దానిని చూడగానే అతనికి కోపంవచ్చి తన తండ్రి మెడలో పామును వేసినవాడు ఏడురోజులలో పాము కఱచుటవల్ల చచ్చిపోవునని శపించెను. ఈ శాపమునకు పరీక్షిత్తు భయపడి సముద్రమున ఏకాంతస్థుల మేడలో దాగి కాపురమున్నాడు. ఆ మేడమీదకు సర్పం రావడానికి వీలులేకుండా బందోబస్తు చేశాడు. కాని, ఏడవనాడు ఒక బ్రాహ్మణుడు రాజుగారి సందర్శనార్థం వచ్చి కానుకగా ఒక నిమ్మపండును యిచ్చాడు. ఆ నిమ్మపండును పరీక్షిత్తు వాసన చూచేసరికి అందులో యిమిడి ఉన్నటువంటి చిన్న పురుగు బయటకు వచ్చి అది పెద్ద పామై అతనిని కఱచెను. ఆ పురుగు మూలంగా పరీక్షిన్మహారాజు మరణించెను.

చావు అంటే భయంలేనివాడు ఉండడు. మనిషి అయినవానికి ఏదైనా భయం అనేది ఒకటి ఉంటే, దానికి మూలకారణం మరణభయం తప్ప మరొకటి లేదని గ్రహించాలి. పదిమందిలో అవమానం అవుతుందేమో అని భయపడేవాళ్లుకూడా కొందరు ఉంటారు. ఈ అవమానభయం ఎందుకు ఏర్పడింది? తాను నలుగురిలో తక్కువవాడు అయినట్లయితే, తనకంటె మిగిలినవాళ్లు ఎక్కువవాళ్ళు అయి తన్ను అణచివేస్తారనే భావం ఏర్పడుతుంది. మిగిలినవాళ్లు తనకంటె ప్రబలులైనప్పుడు తను అటువంటి ప్రబలులకు ప్రణామాలు చేస్తూ దోసిలొగ్గి దాసోహం అంటూ, లొంగి వంగి సలాములు చేసి గులాము కావలసివస్తుంది. అట్టి స్థితిలో ఉద్ధతుల మధ్య పేదల కుండదరమె!

ఒక సామ్రాట్టుకు లోబడిన సామంత రాజుగా ఉండేవాడు సుఖంగా కాలక్షేపం చేయలేడా? బ్రిటిష్ సామ్రాజ్యాధికారం క్రింద భారతీయులు సుఖంగా కాలక్షేపం చేయలేదా? బ్రిటిష్‌వారు ఈదేశానికి అధిపతులు కాకపూర్వం యీదేశంలో సహగమనాలు జరిగాయి. ఠగ్గులు అనే దొంగజాతివారు దారిమార్గంగా పోయే వారిని గొంతు పిసికి చంపి సొమ్ము దోచుకునేవారు. పిండారీలు గ్రామాలవెంట గ్రామాలను పట్టపగలే కొల్లగొట్టి పంటధాన్యం దోచుకొనిపోయేవారు. దేశంలో స్వదేశరాజులు ఒకరితో ఇంకొకరు యుద్ధాలు చేస్తూ ఉండేవారు, అందువల్ల దేశం అరాజకంగా ఉండేది. ఘోరమైన హత్యలుగాని నేరాలుగాని జరిగితే, న్యాయవిచారణ చేసే న్యాయసభలుగాని, నేరస్థులను పట్టుకొనెడి రక్షకభటుల సిబ్బందీగాని, సక్రమంగా లేకపోవడంవల్ల ప్రజలకు ప్రభుత్వాధికారుల భయం ఉండేది కాదు. కర్నూలు జిల్లాలో ఖూనీకేసులు ఎప్పుడూ జరుగుతూ ఉండేవి. బ్రిటిష్‌వారు వచ్చిన తర్వాతకూడా అక్కడ సెషన్సు కోర్టులో విచారణ అయిన్ని ఖూనీకేసులు ఇంకో జిల్లాలో కన్పించేవి కావు. ఈ విధంగా ఉంటూ ఉన్న దేశానికి చల్లని విక్టోరియా రాణీ ప్రభుత్వం వచ్చింది. దేశంలో ప్రజలు సుఖంగా శాంతంగా జీవించడానికి అవకాశాలు కల్పించగల్గిన బందోబస్తయిన ప్రభుత్వం వచ్చింది. దురాచారాలు పోయినాయి. ప్రజలలో విద్యావికాసం కలిగింది. రైళ్ళు వచ్చాయి. టెలిగ్రాఫ్‌లు వచ్చాయి. పోస్టాఫీసులు వచ్చాయి. ఎలెక్ట్రిక్కు దీపాలు వచ్చాయి. యింతకంటె సుఖంగా బ్రిటిష్ ఏలుబడికిపూర్వం మనదేశంలో మనము ఉన్నామా? ఈరోజున బ్రిటిష్‌వారు వెళ్ళిపోయినారుగనుక మనము వారిముఖప్రీతిగా ఏమీ చెప్పవలసిన అగత్యం లేదు. వారిక్రింద మనం లోబడిఉన్నందువల్ల బాగుపడినామా లేదా? దేశం అరాజక స్థితిలోనుండి ప్రశాంతిస్థితిలోకి వచ్చిందా లేదా?

నిజమే. వారివల్ల మనమూ బాగుపడ్డాము. అంతకంటె ఎక్కువగా మనవల్ల వారూ బాగుపడ్డారు. బ్రిటిష్‌రాజ కిరీటంలో భారతదేశం అనేది అత్యంత మహోజ్వలరత్నం అన్నారు. భారతదేశ సంపదను వారు పూర్తిగా అనుభవించారు.

"భరత ఖండంబు చక్కని
పాడియావు
హిందువులు లేగ దూడలై
ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి
గొల్లవారు
పితికియున్నారు మూతులు
బిగియగట్టి"

ఈ మాటకూడా వాస్తవమే. ఈ విధంగా కాలం గడిచేసరికి "మాకొద్దు యీ తెల్లదొరతనము" అనే పాట భారతీయులు ఆలాపించారు. "భారతదేశం వీడిపోండి" అనే మంత్రమును గాంధిమహాత్ముడు జపించాడు. దానినే కాంగ్రెసు నాయకులందరూ జపించారు.

ఒక్కమాట ఆలోచించాలి. నిజంగా బ్రిటిష్‌వారి ఏలుబడిక్రింద స్థిరంగా భారతదేశం ఉండడమే భారతదేశానికి క్షేమకరం అని బ్రిటిష్‌వారు త్రికరణశుద్ధిగా వాదించియుండినట్లయితే, వారిసిద్ధాంతమును వారే శిరసావహించాలి. ఇంగ్లండు దేశము

[illegible]

★ కాలక్షేపం ★

ఒకప్పుడు రోమను చక్రవర్తుల ఏలుబడి క్రింద ఉండేది. కాని అప్పుడు ఆ రోమను చక్రవర్తుల క్రింద పరాధీనులై యుండుటకు బ్రిటిష్‌వారు సహించలేదు. రోమను ప్రభుత్వముపై తిరుగుబాటు చేసి తమ దేశాన్ని తిరిగి స్వతంత్రరాజ్యంగా చేసికొన్నారు. భారతదేశం ఏవిధంగా బ్రిటిష్‌వారిక్రింద ఉన్నదో, అదేవిధంగా మరొక పరరాజ్యాధికారం క్రింద, ఇంగ్లాండు దేశం ఉండి, ఆ పరరాజ్యాధికారం క్రింద సుఖంగా చల్లగా కడుపులో నీళ్ళు కదలకుండా కాలక్షేపం చేయడానికి బ్రిటిష్‌వారు సమ్మతిస్తారా? ముమ్మాటికీ సమ్మతించరు. తమ దేశస్వాతంత్ర్యంకోసం ప్రాణాలైనా అర్పిస్తారు.

స్వాతంత్ర్యం అనేది ఎందుకు? దాని ప్రయోజనం ఏమిటి? సుఖం అనుభవించడానికి - శుభం పొందడానికి - కాని, అట్టి దేశస్వాతంత్ర్యంకోసం ప్రాణాలు అర్పిస్తారు. "బ్రతికియుండిన భాగ్యముల్ బడయవచ్చు" అనే ధోరణిలో ఉండక రణ ధోరణిలోనికి దిగడంవల్ల సుఖంగాని శాంతిగాని ఎట్లా లభిస్తుంది? స్వాతంత్ర్యంకోసం ప్రాణత్యాగ సంసిద్ధుడైనవానికి సుఖంమీద వాంఛ ఉంటుందా? సుఖంమీద వాంఛ లేనివానికి, సర్వ సుఖముల చేకూర్పు స్వాతంత్ర్య మెందుకు?

ఇదంతా ఎట్లా ఉన్నదంటే, సర్వసంగ పరిత్యాగం చేసినవానికే భోగంఅన్నట్లుంది. రాజ్యము వీరభోజ్యము. "ఆత్మసుఖభోగేచ్ఛల్ విసర్జింపుచున్" తపస్సు చేసినవానికే బ్రహ్మానంద పదవి లభిస్తుంది. "సుఖం", "భోగం" విసర్జించిన వానికే "ఆనందం" లభిస్తుంది అన్నారు. దీనినిబట్టి చూస్తే "సుఖం", "భోగం" యీ రెండింటికంటె ఎక్కువైనది "ఆనందం" అనేమాట తేటతెల్లమవుతోంది.

"స్వాతంత్ర్యం" అనేది పూర్తిగా అనుభవించవలెనంటే, దానికోసం తపస్సుచేసిన వాళ్లకే అది అనుభవసిద్ధమవుతుంది. జైళ్ళకు వెళ్ళి, లాఠీచార్జీలకు శరీరమర్పించి అష్టకష్టముల ననుభవించినప్పుడు, కాంగ్రెసునాయకులు స్వాతంత్ర్యం అంటే ఏమిటో కొంతవరకు రుచి చూచారు. జైలులో నిర్బంధింపబడి అస్వతంత్ర స్థితిలో ఉన్నవారికే స్వాతంత్ర్యంయొక్క రుచి తెలిసింది. ఐహికమైన భాగ్యభోగ్యములను విసర్జించినవానికే పారమార్థికమైన మోక్ష లక్ష్మి భోగపడుతుంది.

మోక్షం అంటేనే ఆత్మస్వాతంత్ర్యం - ఆత్మస్వాతంత్ర్యం అనుభవించడమే బ్రహ్మానందపదవి. అందుకనే గాంధిమహాత్ముడు దేశస్వాతంత్ర్యం, ప్రజాస్వాతంత్ర్యం, వ్యక్తిస్వాతంత్ర్యం, ఆత్మస్వాతంత్ర్యం - ఇవన్నీ మోక్షసాధనములన్నాడు. 'స్వాతంత్ర్యం' అంటేనే మోక్షసాధనవిధానం; "రాజకీయ స్వాతంత్ర్యం" కూడా అంతే. రాజకీయ వ్యవహారాలలో; అయిహికవిషయాలే చర్చించాలిగాని, ఆముష్మికవిషయాలు చర్చించడం అప్రస్తుతం, అప్రశస్తం, అసంగతం, అసంబద్ధం అని కొందరు పెద్దలు నాగపూరు కాంగ్రెసు మహాసభలో గాంధిమహాత్మునితో వాదించారు. ఆసందర్భంలో (*I have come to spiritualize politics*" (రాజకీయ రంగాన్ని ఆధ్యాత్మిక రంగంగా మార్చుటకే నేను వచ్చాను) అని గాంధిమహాత్ముడు అన్నాడు. మన భౌతిక జీవితానికీ ఆధ్యాత్మికజీవితానికీ సంబంధం లేదని మనలో పెద్దపెద్దవాళ్లు ఎప్పుడైతే వాదిస్తూఉంటారో, అప్పుడు అటువంటి యుగపరిస్థితులలోనే, ఇటువంటి మహాత్ములు అవతరించి లౌకిక ధర్మానికీ, పారలౌకికధర్మానికీ భేదంలేదని చెంపమీద కొట్టినట్లుగా చెప్పి, మనలను ఒప్పించి, మనలను తప్పుదారిలోనుంచి ఒప్పుదారిలోనికి రప్పించి, తమ జీవిత సందేశములను మనకు అప్పగించి అవతారం చాలిస్తారు.

గాంధిమహాత్ముడు పరీక్షిత్తు మహారాజువలె "చచ్చిపోతానేమో" అనే భయంతో గడగడలాడుతూ మేడమీద కెక్కి ఏడు రోజులూ ఏడుస్తూ కూర్చుండలేదు. నిర్భయంగా నవకాళీ దురంత సంక్షుభిత శ్మశానసమాన గ్రామసీముల పాదచారియై గ్రామైక రాత్రంబుగా సంచారంచేశాడు. అభిమన్యుడు కురుక్షేత్ర రంగంలో పద్మవ్యూహంలో అతి సాహసంగా ప్రవేశించి, చచ్చిపోతానేమోననే భయం లేకుండా చొచ్చుకొనిపోయినాడు. అటువంటి మహావీరుని కుమారుడైన పరీక్షిత్తును మరణభీతిఆవిధంగాఎందుకు వేటాడి వెంటాడి ఏడ్పించినదో తెలియదు. ఇతని తల్లి పేరు ఉత్తర. ఈమె సహోదరుడైన ఉత్తరుడు ఉత్తరగోగ్రహణసందర్భంలో యుద్ధరంగానికి వచ్చేవరకు చాలా ప్రగల్భాలుకొట్టి చిట్టచివరకు తోక ముడిచి పెట్టినసంగతి ఈరోజువరకూ ఆబాలగోపాలం వేళాకోళంగా చెప్పుకొని "ఉత్తరకుమార ప్రజ్ఞలు" అంటే ఆరంభంలో ఆడంబరం అనిన్నీ, ధైర్యంలేని శౌర్యం అనిన్నీ మాటికీ మాటికీ, సూటీపోటీగా వెక్కిరిస్తూనే ఉన్నారు. ఒకవేళ మేనమామ లక్షణాలు పరీక్షిత్తుకు సంక్రమిస్తే సంక్రమించియుండవచ్చు.

మొత్తంమీద పరీక్షిత్తు జీవితం మృత్యుభయపరీక్షాశోభితం అయింది. సువర్ణాబాయి అనే ఒక యిల్లాలు మంచి శ్రీమంతురాలు. ఆమెకు ఒంటినిండా నగలే. పుట్టింటివారు పెట్టిన సొమ్ములు అన్నీ పెట్టుకుంటేనే చాలు సువర్ణాబాయి బంగారు-చిలుక లాగున ఉండేది. పచ్చగా పూచిన బీరపాదులాగున ఉండేది. ఇవిగాక అత్తవారిచ్చిన ఆభరణాలు అసలుకు మించిన వడ్డీ అన్నట్టున్నాయి. చిన్నప్పటినుంచీకూడా బంగారు గాజులలో ఎన్నెన్ని కొత్త రకాలు వస్తున్నాయో శ్రద్ధగా పరిశీలిస్తూఉండేది. ఏ హరికథకు వెళ్ళినా, ఏ సినీమాకు వెళ్లినాన స్త్రీల ప్రత్యేక స్థలంలో కూర్చుండి తం ప్రక్కనున్న ఆడవాళ్లు ఏయే కొత్తరక,

ఒకమంత్రి ప్రారంభోత్సవం చేస్తూన్నసమయంలో అక్కడ హాజరైనవారిలో,

ఒకరు: మీరు ఏఏశాఖలకు మంత్రి అండీ?

రెండవఆయన: ప్రారంభోత్సవాలు, స్నాతకోత్సవాలు, శంకుస్థాపనలు.

—వి. వి. అప్పారావు-వాల్తేరు.

గాజులు చేయించుకొన్నారో పరీక్షిస్తూ ఉండేది. ఆమెకు పెళ్ళినాడు చేయించిన గజ్జెల వడ్డాణం యిప్పటికి ఎన్ని పర్యాయములు చెడగొట్టించి తిరిగీ తిరిగీ కొత్త ఫ్యాషను వడ్డాణంగా మార్పించినదో లెక్క వేస్తే, అన్ని పర్యాయములకు అయిన మజూరీ ఖర్చులను మొత్తం చేస్తే, ఆ మొత్తమునకు యించుమించు యింకొక కొత్త వడ్డాణం మరొక సాధారణ గృహిణికి లభించగలదు. సువర్ణాబాయి కాపురానికి వచ్చేనాటికిపదహారేళ్లది. కాపురానికివచ్చి పదహారేళ్లయింది. పొరుగూళ్లకు ప్రయాణం అయిందంటే, ఆమెచీరెలు ఒక పెట్టెలోనూ, ఆమె నగలు యింకో పెట్టెలోనూ అతిజాగ్రత్తగా సర్దుకొనేది. అహోరాత్రాలు తన బంగారు వస్తువులను సింగారించుకొనడం, పింఛం విప్పిన నెమలిలాగున త్రిప్పుకుంటూ తిరగడం, అద్దంలో చూచుకొనడం, అందరికి తన అలంకరణం చూపించి "వన్స్ మోర్" కోసం నిరీక్షిస్తున్న నటీమణివలె ప్రేక్షకులను పరీక్షిస్తూ ఉండడం, సువర్ణాబాయి స్వభావం అయిపోయింది. అహోరాత్రాలు ఆభరణసంస్మరణతప్ప మరొకటి లేదు. ఆభరణాలు అంటే అవి ఆమె శరీరంలోని భాగాలైనాయి. "పానీయంబులు ద్రావుచుక్ గుడుచుచుక్ హాసలీలా నిద్రాదులు సేయుచున్" ఆమెకు అదే ధ్యానం. ఒకపర్యాయం మట్టివాడలో జరిగిన పెళ్ళికి రెండెడ్ల బండీ ఒకటి కట్టుకొని పోతూ ఉంటే, త్రోవలో అర్ధరాత్రివేళ అడ్డగించారు. "ఆపు! ఆపు! బండీ!" అంటూ తుమ్మలడొంకవద్ద తుమ్మమొద్దులవలె నలుగురు యానాదివాళ్లు ఆమెనూ, ఆమె భర్తనూ బండీలోనుంచి దింపి ప్రక్కనొక చెట్టుకు కట్టి ఆమెకున్న ఆభరణాలుచక్కగా తీయించి, రెండు చెంపలూ వాయించి, దొంగలు నగలతో సహా ఉడాయించారు. అంతవరకూ సువర్ణాబాయి అదృష్టవంతురాలే. ప్రాణం దక్కింది. మానం దక్కింది. పెళ్లికి వెళ్ళకుండా బండీ వెనుకకు మళ్లించారు. అది మొదలు కొని ఆమెకు సొమ్ములు పెట్టుకొనడం అంటే శూలాలుపెట్టి గుచ్చినట్లుండేది. నగలసంగతి తల్చుకుంటే చాలు దొంగలు జ్ఞాపకం వచ్చేవారు. కొన్ని నగలు దొంగల పాలైన మాట నిజమే. కాని, యింకా పెట్టుకొని తిరగడానికి పెట్టెలో చాలా ఆభరణాలున్నాయి. ఉంటే ఏం? మెడలో కాసులపేరు పెట్టుకుంటే మెడకు ఉరి పెట్టుకొన్నట్లే అనేది. తనకు కుమార్తెలు కలిగితే వాళ్ళకు తన సొమ్ములన్నీ సమానంగా పంచియిస్తా ననేది.

ఇంతకూ ఆమె కాపురానికి వచ్చినప్పటి నుంచీ రెండు పర్యాయములు గర్భం రావడం పోవడంకూడా అయింది. అప్పుడు ఆమె భర్త నరసింహారావుగారు తన సంతానయోగ విషయంలో ఆమె జాతకం ఎట్లాఉన్నదో చూడవలెనని ఇద్దరు ముగ్గురు సిద్ధాంతులకు చూపించారు. ఆమె జాతకం ఎవరు చూచినా, ఒక్కటే మాట అన్నారు. ఆమె పసుపుకుంకంతో లక్షణంగా వెళ్ళిపోతుంది గాని, దొంగలమూలంగానే యీమెకు ప్రాణాపాయం సంభవిస్తుంది అన్నారు.

ఆమధ్య మట్టివాడ పెళ్లికి వెళ్ళడం, తుమ్మచెట్లడొంకవద్ద నలుగురు యానాదులు దారిలో నిర్బంధించడం, చెట్లకు బంధించడం, లెంపలు వాయించడం—ఇదంతా కండ్లకు కట్టినట్లుగా కన్పించేది భూత విషయమే. కాని, ఆ భూతవిషయంతో ఆప్రాణగండం అప్పుడే ఆమెకుతప్పిందని భర్తయైన నరసింహారావు నిర్ధారణ చేశాడు. జాతకంలో లెక్కలు సరిగ్గా వేయక సిద్ధాంతులు తికమకపడ్డారనిన్నీ, భూతాన్ని భవిష్యత్తుగా వివరిస్తున్నారనిన్నీ ఆత్మసందేహం నివరి చేసికొని మనస్సు దిట్టం చేసికొని సుఖంగా ఉంటున్న కాలంలో సువర్ణాబాయికి నెల తప్పిందన్నారు. నెలలు గడుస్తున్నాయి. కూతురో కొడుకో ఎవరికేం తెలుసునని అమ్మలక్కలంతా కాలగర్భంలో ఉన్న ఆంధ్రరాష్ట్ర అస్థిర స్థిర రాజధానివలెనే అంచనాలు వేస్తూ ఉన్నారు. కాని, యీరీతిగా కుతూహలాయత్తచిత్తులై సతీపతులు లహాన ముదంబున దినంబులు గడుపుచుండగా, ఒకనాటి రాత్రి, అర్ధరాత్రివేళ సువర్ణాబాయి "అమ్మో! బా! మా!" అని నిద్రలో పెద్దగా కలవరించడం సాగించింది. ఎవరో ఆమెను పట్టుకొని కొట్టితే, అరచినట్లుగా అరచింది. మేకవలె వణికిపోతున్న గొంతుతో కూతలు కూసింది. నరసింహారావు వెంటనే మేల్కొని "ఏమిటే అది!" అని ఆమెను నిద్రలేపినప్పటికీ, ఆమె గజగజలాడిపోయింది. ఒళ్ళంతా చెమ్మటలు పోసి మూర్ఛపోయిన మనిషిలాగున్నది. ఆమె దేహస్థితి ఏమీ బాగాలేదు. వెంటనే డాక్టరు కోసం కబురుచేసి పిలిపించారు. నర్సులు

(53-వ పేజీ చూడండి)

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.



శనిదేవత రథచక్రం

(పెద్ద కథ) మూలం: నికొలాయ్ వి. గొగోల్.

(గత సంచిక తరువాయి)

అకాకీ అకాకియెవిచ్ స్వప్నగతుడైన వ్యక్తిలాగ నడుస్తూ వీధిని పడ్డాడు. "బాగాలేదు," అనుకున్నాడు. "ఇలా జరుగుతుందని అనుకోలేదే –" అని కొంత ఆగి, "పోతు, అంతే. చివరికేమైందో – నేననుకోలేదు సుమా–" మళ్లీ చాలసేపు మనస్సు నిశ్శబ్దమైంది. మళ్లీ ఆలోచనసాగింది: "పోతు, అంతే. ఎంత తొందరగా – మొదట్నుంచీ – ఊహు, లాభంలేదు – ఎంత చిత్రంగా వుందో – ఇలా అవుతుందని – ఊహు –". ఈవిధంగా అకాకీ ఆలోచనా శకలాల మధ్య ఇరుక్కుని ఇంటికి పోవలసినబదులు, ఇంకో త్రోవ నడవసాగాడు. దోవలో పొకీవాడొకడు తారసిల్లి బట్టలు ఖరాబుచేశాడు. అదేసమయంలో పక్కయింటి పైభాగంనుంచి బుట్టెడు చెత్త అతని తలపై గుమ్మరించబడింది. కాని యివేమీ చూసుకోకుండానే అకాకీ నడుస్తున్నాడు. మరికొన్ని అడుగులు వేసేసరికి, అకాకీ తన ఎదురుగా వచ్చేమనిషి రొమ్ములకు ఢీకొట్టాడు. "ఏయ్, కళ్ళులేవూ? గొర్రెపొట్టేలులాగ నన్ను కుమ్ముతావేం?" అని ఎదుటివాడు మందలించాడు. అప్పటికి తెలిసింది తను ఎటు నడుస్తున్నదీ. వెంటనే వెనక్కి తిరిగి యింటికేసి నడిచాడు.

ఇంటికి వెళ్ళాక అకాకీ అటూ యిటూ చెదిరిపోతున్న ఆలోచనల్ని పోనుచేసి కోటుమీదికి కేంద్రీకరించాడు.

ఎదురుగా బుద్ధిమంతుడైన స్నేహితుణ్ణి పెట్టుకొని యింట్లో యిబ్బందులన్నీ చెప్పుకున్నట్టు తనతో తనే నిరాక్షేపమాటంగా నిష్పక్షపాతంగా వాదప్రతివాదాలు చేయసాగాడు. "ఊహు. పెట్రోవిచ్ తో యిప్పుడు మాట్లాడ్డం మంచిదికాదు. బహుశా పెళ్లాం చేత తన్నులు తిని వున్నాడేమో. ఆదివారం పొద్దున్నే వెడతాను. ఆదివారమల్లా తాగి పడుకుందాం అనుకుంటాడు; కాని పెళ్ళాం డబ్బివ్వదు. ఆ సమయంలో పది కోపెక్కులు (రూబుల్ లో నూరోవంతు కోపెక్) చేతిలో పెట్టానా, చక్కగా చెప్పిన మాట వింటాడు. అప్పుడు కోటుగురించి సావకాశంగా—"

ఈ విధంగా ఆలోచించి, పోయిన ధైర్యం కూడగట్టుకుని ఆదివారం వరకూ నిశ్చింతగా నిద్రపోయాడు అకాకీ. ఆదివారం పొద్దున్న పెట్రోవిచ్ పెళ్ళాం బజారుకు వెళ్ళడం దూరంనుంచే గమనించి యింట్లో ప్రవేశించాడు.

పెట్రోవిచ్ నిజంగానే అతిదీనవదనుడై వున్నాడు. నిద్రతో కళ్లు మూతలు పడుతున్నాయి; తల వేళ్లాడిపోతోంది. కాని ఆ కాకీ కోటు సంగతి ఎత్తగానే అతనికి అంతా జ్ఞాపకంవచ్చింది. తలకాయఅడ్డంగా ఆడించి "లాభంలేదు సార్. కొత్తది కుట్టించాల్సిందే," అన్నాడు. అకాకీ అతని చేతిలో పదికోపెక్కుల నాణెం పెట్టాడు. "థాంక్యూ సార్. మీ పేరు చెప్పి తాగుతాను," అని కృతజ్ఞత వెల్లడించాడు. కాని కోటు విషయంలో మాత్రం అభిప్రాయం మార్చుకోలేదు. "ఏమీ లాభంలేదు. ఈ కోటు బాగుచెయ్యడం నాతరంకాదు. నీకెందుకూ, నేను అద్భుతమైన కొత్తకోటు తయారుచేసి యిస్తాను," అన్నాడు.

అకాకీ అకాకియెవిచ్ మరికొంతసేపు వాదించాడు కాని పెట్రోవిచ్ పాతకోటు విషయం మళ్ళీ ఎత్తనివ్వలేదు(?) "నాశాయశక్తులా కష్టపడి మంచికోటు కుట్టియిస్తాను. దేవుడు దయతలిస్తే కొత్త ఫేషన్లో కుట్టగలను," అన్నాడు.

కొత్తకోటు కుట్టించక గత్యంతరం లేదని అకాకీ గ్రహించాడు. గుండె గుబగుబలాడింది. ఇది ఎలా సాధ్యమవుతుంది? డబ్బెక్కడనించి వస్తుంది? ఇప్పటికే కొన్ని కొత్తలాగులు కుట్టించడం, కనీసం మూడు చొక్కాలు కుట్టించడం మొదలైన ఖర్చు సిద్ధంగా వున్నది. పాతజోళ్లకు కొత్తతోళ్లు కుట్టియిచ్చిన చెప్పులషాపువాడికి బాకీ తీర్చ

అనువాదం : నండూరి రామమోహనరావు

వలసి వున్నది. దీనికితోడు కొత్తకోటు ఖర్చుకూడా తగిలితే? ఒకవేళ డైరెక్టరు దయతలచి అయిదురూబుళ్లో, పదిరూబుళ్లో జీతం ఎక్కువ చేసినా, సముద్రంలో కాకి రెట్టలాగ, అది ఏమూలకి చాలుతుంది? పెత్రోవిచ్ చిరాకుగా వున్నప్పుడు నోటి కొచ్చిన ఖరీదేదో చెబుతాడని అకాకీకి తెలుసు. అలాంటి సమయాల్లో అతని పెళ్లాం తమనిషికూడా వచ్చి ఆ ఖరీదుకి ఆశ్చర్యపోయి "నీకేమన్నా మతిపోయిందా?" అని కోప్పడడం కూడా వుంది. అందుచేత ఇప్పుడు కూడా పెత్రోవిచ్ అసలు ఖరీదుకంటె ఎక్కువే చెప్పివుండవచ్చు.

కాగా పోగా పెత్రోవిచ్ మరికొన్ని మెట్లు దిగివచ్చి ఎనభై రూబుళ్ళకి కోటు కుట్టిపెడతానంటాడనుకుందాం. కాని ఆ ఎనభైరూబుళ్లైనా ఎక్కణ్ణించి వస్తాయి? పోకపడితే అందులో సగం దాకా సంపాదించవచ్చునుకో. మిగతా సగం ఎలా వస్తుంది? అవును సగమైతే ఫరవా లేదు; మరి మిగతాది? ఇక్కడ ఆ మొదటి సగం అకాకీకెలా లభ్యం కాగలదో పాఠకునికి చెప్పాలి.

అతనికొక అలవాటుంది. తను ఖర్చు పెట్టిన ప్రతిరూబుల్‌కీ ఒక గ్రోషేన (కోలీ) చొప్పున ఒక చిన్న డబ్బాలో పడేసేవాడు. డబ్బాకి పైన చిన్న కన్నం వుండేది ఆ కన్నంలోంచి నాణెం పడేసేవాడు.

ప్రతి ఆరునెలలకీ మూతతీసి ఆ నాణాలన్నీ వెండినాణాల్లోకి మార్చుకునేవాడు. ఇలా ఏళ్ళతరబడి కూడబెట్టగా మొత్తం నలభైరూబుళ్లు పోగయ్యాయి. కనుక అతనివద్ద సగంధనం రెడీగా వుందన్న మాట. మరి మిగతా నలభయిరూబుళ్లు ఎక్కణ్ణించి వస్తాయి? అకాకీ ఆలోచించాడు, ఆలోచించాడు, ఏమీ తోచలేదు. చివరికొక నిశ్చయానికి వచ్చాడు. కనీసం ఒక ఏడాదిపాటైనా కొన్ని సౌకర్యాలు త్యాగంచేస్తే డబ్బు కూడబెట్టడానికి వీలవుతుంది. సాయంత్రాలు టీ తాగడం మానెయ్యాలి; రాత్రిళ్లు కొవ్వొత్తులు వెలిగించకూడదు; అంతగా ఏదన్నా వ్రాసుకోవలసివస్తే యింటియజమానురాలి గదిలోకి వెళ్లి వ్రాసుకోవాలి; వీధిలోకి వెళ్లి నప్పుడు పేవ్‌మెంటుమీద వీలైనంత తేలికగా నడవాలి; ఊపిరి బిగపట్టి, మునివేళ్ళమీద నడిచినట్టు నడవాలి; లేకపోతే జోళ్ళు త్వరగా అరిగిపోయి బాగుచేయించడానికి డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. చాకలికి వీలైనన్ని తక్కువ బట్టలు వెయ్యాలి; ఇంటికిరాగానే బట్టలు విప్పేసి, కొయ్యకి తగిలించి ఏదో గుడ్డ చుట్టబెట్టుకుని కాలక్షేపం చెయ్యాలి.



రష్యన్ రచయిత:

నికొలాయ్ గొగోల్

నిజానికి, మొదట్లో ఈ నిబంధనలన్నీ అమలుపరచడం బహుకష్టంగా వుండేది. కాని జితేంద్రియుడైన మహర్షిలాగ అతి కఠిన పరిశ్రమచేసి ఇవన్నీ అలవరుచుకున్నాడు. ఇప్పుడివన్నీ అలవాటైపోయాయి. సాయంత్రంపూట ఆకలితో కడుపు దహించుకుపోవడం కూడా అతనికి అలవాటైపోయింది. ఆట్టే ఆకలివేసి చీకాకుపుడితే "ఏయ్, కొత్తకోటు వస్తుంది, జ్ఞాపకముంచుకో," అని తన్ను తనే హెచ్చరించుకునేవాడు. ఇప్పటిదాకా అతని జీవితం అసంపూర్ణంగా వున్నట్టు, ఇప్పుడది నిండిన పాత్రవలె సంపూర్ణమైనట్టు అనిపించేది. తనకి వివాహమైనట్టో, లేక తనలో యింకోమనిషి స్థావరం ఏర్పరచుకున్నట్టో, మొత్తానికి తను ఏకాకి కానట్టు, జీవితయాత్రలో మంచి స్నేహితుడెవరో సహపాంథుడుగా రావడానికి ఒప్పుకొన్నట్టు, ఒకవిధమైన నిండుదనం అనుభవించసాగాడు అకాకీ. ఆ సహపాంథుడు మరెవరో కాదు - గట్టిగా, దట్టంగా చిరగడానికి వీల్లేకుండా కుట్టబడనున్న అతని కొత్తకోటే. కొత్తగా ప్రేమించడం మొదలెట్టిన యువకుని హృదయం వలె అతని హృదయ తటా

కం గట్టులోరని ఉత్సాహతరంగితమైంది. పూర్వపు దైన్యం పోయి, జీవిత పరమావధి కోసం, ఏ కష్టం వచ్చినా చలించక సాధన సాగించే వ్యక్తివలె మనిషి కరుకు తేలాడు. ముఖంలో, నడకలో ఇదివరకటి జంకూ, భయం, ఆందోళన, అశాంతి అన్నీ మాయ మయ్యాయి. కళ్లలోకి తేజస్సు వచ్చింది. ఇదివరకు స్వప్నావస్థలోకూడా రావడానికి సాహసించని అద్భుతమైన ఆలోచనలు అతని మనస్సులోకి అప్పుడప్పుడు వస్తున్నాయి. ఉదాహరణకి, కోటు కాలరులో కొంచెం మంచిరకం ఉన్ని ఎందుకు పెట్టించగూడదు? ఈ ఆలోచనతో అతనికి కళ్లు బైర్లుకమ్మి, గుండె దడదడ కొట్టుకో సాగింది. ఒకసారి ఆఫీసులో ఒక ఉత్తరానికి నకలు వ్రాస్తూ, పరధ్యానంలో పడి తప్పు వ్రాసేదాకా వచ్చింది. ఇంతలో తెలివి తెచ్చుకున్నాడు గనుక ప్రమాదం దాటిపోయింది. నెలకొకసారి పెట్రోవిచ్‌తో సమావేశమై కోటుగురించి మంతనాలుచేసేవాడు. ఏ రకంగుడ్డకొనాలీ, ఏ రంగు బావుంటుందీ, ఎక్కడ కొంటే బావుంటుందీ, ధర ఎందాకా పెట్టవచ్చు, అని చర్చించేవాడు. ఈ చర్చలతో మనస్సు తేలికపడి ఇంటికి తిరిగివచ్చేవాడు. అయితే ఇదంతా తమాషాకోసంచేసే ఆలోచన కాదనీ, ఎప్పటికో ఒకప్పటికి గుడ్డకొనడం, కోటు కుట్టించడం విధిగా చెయ్యవలసిన కర్తవ్యాలనీ లోపల్లోపల బెంగగానే వుండేది.

కాని కోటు కుట్టించేరోజు అనుకున్న దానికంటె త్వరగానే సమీపించింది. ఎందుకంటే డైరెక్టరు ఒక్కసారిగా ఇరవై రూపాయల అధిక వేతనం ఇచ్చాడు. అకాకీకి కొత్తకోటు అవసరంగా వుందని గ్రహించాడో, లేక యాదృచ్ఛికంగానే అధిక వేతన మివ్వాలనిపించిందో మొత్తానికి డైరెక్టరు అతనికి అదనంగా ఇరవై రూపాయలు సమకూర్చాడు. మరి రెండుమూడు నెలలు ఆకలి ఓర్చుకోవడం, ఎనభై రూపాయలు పోగవడం జరిగింది. ఎప్పుడూ నిస్త్రాణగా కొట్టుకునే అకాకీహృదయం చురుకెక్కింది. అవకాశం చిక్కిన ప్రథమ శుభదివసాన అకాకీ దర్జీవాడితో కలిసి బజారు బయలుదేరాడు. మంచిగుడ్డ కొన్నారు. ధరకూడా సరసమైనదేనని చెప్పాలి. గుడ్డవిషయమై ఆరునెలలనుంచీ వారు చర్చలు జరుపుతున్నందున, నెలకొకసారన్నా విధిగా అన్ని షాపులూ తిరిగి ఏగుడ్డ ఏ ఖరీదులో దొరుకుతోందో, ధరలు తగ్గుతున్నాయో, హెచ్చుతున్నాయో శ్రద్ధగా వాకబు చేస్తున్నందున ఈవిషయమై పొరబాటేమీ జరగలేదు. ఇంతకంటె మంచిగుడ్డ భూప్రపంచంలో దొరకదని సాక్షాత్తు పెట్రోవిచ్చే అన్నాడు. లోపలివైపుకుట్టడానికి మామూలు గుడ్డ కొన్నప్పటికీ మంచి దిట్టమైనదిమాసి కొన్నారు. సిల్కుకంటె ఇదే మంచిదనీ, అందంగాను, మెత్తగానూ కూడా వుందని పెట్రోవిచ్ ధైర్యంచెప్పాడు. మేలురకం ఉన్ని కొందామనుకున్నారు గాని ధర కొంచెం జాస్తి కావడంవల్ల అది మానేసి, ఘట్టికొసయిన పిల్లిచర్మం కనిపిస్తే అది కొన్నారు. ఆ చర్మంకూడా దూరంనుంచి చూస్తే ఉన్నివలెనే వుంటుందిగనక ఫరవాలేదు.

పెట్రోవిచ్ రెండువారాలు అహోరాత్రాలు శ్రమించి కోటు పూర్తిచేశాడు. అంతా రెండేసి పొరలుగా కుట్టవలసి వచ్చినందున అంతకాలం పట్టింది. లేకపోతే ఇంకాముందే పూర్తికావలసినది. కుట్టుకూలీ పన్నెండు రూబుళ్లే పుచ్చుకున్నాడు, అంతకుతక్కువ కూలీ సాధ్యంకాదుగనుక. ఏమైనా, గట్టిగా, కుట్లు వూడిపోకుండా, ఒకటికి రెండుసార్లు జాగ్రత్తవహించి కుట్టాడు.

పెట్రోవిచ్ కోటు పట్టుకుని అకాకీ యింటికి వచ్చాడు. ఆరోజు—అది ఏరోజో సరిగా చెప్పలేముకాని, అకాకీ చీకటి జీవితంలో తరుణారుణతరణికిరణాలు వెల్లివిరిసినట్టయింది. మరి కొంతసేపటికి అకాకీ ఆఫీసుకు బయల్దేరుతాడనగా శుభసందేశంలాగ, శోభనపు పెళ్లికూతురులాగ అతని యింటికి కొత్తకోటు వచ్చింది. అప్పుడే చలిగాలి ప్రారంభమైంది; ఇంకా తీవ్రమయే సూచనలుకూడా తోచాయి. అంత మంచి అవసరానికి కోటురావడం ఎంత అదృష్టం! ఈ అదృష్టం ఎంతమందికి పడుతుంది!

పెట్రోవిచ్ స్వయంగా కోటు పట్టుకొచ్చాడు. బుద్ధిమంతుడైన దర్జీ అంటే అలావుండాలి. అతని ముఖాకాశంపై గర్వచంద్రుడు ప్రకాశిస్తున్నాడు. తను చేసిన పని సామాన్యమైనది కాదని, పాతబట్టలకి అతుకులు వేసే దర్జీలకీ, కొత్తబట్టలను సృష్టిచేసే దర్జీలకీ నడుమనున్న దుర్లంఘనీయమైన కందకాన్ని లంఘించిన విజయం తనదనీ పెట్రోవిచ్ గ్రహించాడు కనుకనే అతని ముఖంలో ఆ దుర్నిరీక్ష్యమైన కాంతి!

పరిశుభ్రమైన రుమాలలో చుట్టబెట్టిన కోటును యివతలకు తీశాడు. తీసి రెండు చేతులతో ఎత్తిపట్టి, విజయగర్వంతో తల పంకించి అకాకీ భుజాలపై అతి నైపుణ్యంతో కీలించాడు. తరవాత తనే స్వయంగా కోటు తొడిగాడు. చేతులు, బొత్తాములు, కాలరు వగైరాలన్నీ సంతృప్తికరంగా వున్నాయి. తను యిరుకుసందులో, ఊరూ, పేరూ లేకుండా వుంటున్నందువల్లా, అకాకీని చాలరోజులుగా యెరిగి వున్నందువల్లా, అంత తక్కువ కూలీకి కుట్టానని పెట్రోవిచ్ అనేశాడు. అదే గనక తను జనసమ్మర్దంగల నెవెస్కీవీథిలో వుండేటట్లయితే, డెబ్భయ్ అయిదు రూబుళ్లకు తక్కువ పుచ్చుకునేవాణ్ణి కాదన్నాడు. ఈ విషయమై అకాకీ వాదించదలుచుకోలేదు. కూలీ యిచ్చేసి, కృతజ్ఞత తెలిపి, వెంటనే ఆఫీసుకు బయల్దేరాడు. పెట్రోవిచ్ అతన్ని అనుసరించాడు. వీథిలో నిలబడి, అకాకీ ముందు నడుస్తుంటె చాలసేపు కోటువంకే చూశాడు. తరవాత, పక్కనగల యిరుకు సందులోకి పరిగెత్తి, యింకో సందులోనుంచి మళ్ళీ రాజవీధిలోకి వచ్చి ముందునించి చూస్తే కోటు ఎలా కనిపిస్తుందో పరీక్షించాడు.

అకాకీ మంచి ఖుషీగా ఆఫీసుకి నడిచాడు. కొత్తకోటు తొడుక్కున్నాననే భావం ఒక్కక్షణం కూడా విస్మరించలేదు. ఉండుండి ఉప్పొంగుతున్న సంతోషంతో తనలో తను నవ్వుకున్నాడు. కొత్త కోటు వల్ల రెండు ఉపయోగాలు కనిపించాయి. ఒకటి, వెచ్చదనం; రెండు నూత్న శోభ. నడుస్తున్నంతసేపూ అతనికి రోడ్డు కనిపించలేదు. హఠాత్తుగా తను ఆఫీసు ముందు నిలబడ్డానని గుర్తించాడు. లోనికి ప్రవేశించి దుస్తులు తగిలించుకునే గదిలో కోటువిప్పి, జాగ్రత్తగా చూస్తూ వుండమని బంట్రోతును హెచ్చరించాడు. అకాకీ కొత్తకోటు ధరించి వచ్చాడని ఆఫీసులో వారందరికీ ఎలా తెలిసిందో ఆశ్చర్యమే. అంతా ఒక్కసారే బిలబిలలాడుతూ దుస్తుల

గదిలోకి వచ్చారు. అకాకీని అంతా అభినందించారు; చాలా మర్యాదగా మాట్లాడారు. అకాకీముందు సంతోషంతో చిరునవ్వు నవ్వాడు; చివరిచివరికి సిగ్గుపడసాగాడు. ఉద్యోగులు అతన్ని చుట్టుముట్టి కొత్తకోటుకు నామకరణం చేయాలనీ, అకాకీ అందరికీ విందు చేయాలనీ గేలి చేశారు. అకాకీ ఉక్కిరిబిక్కిరై ఎక్కడ నుంచున్నాడో, ఏంజవాబు చెప్పాలో, అక్కణ్ణించి ఎలా తప్పుకోవాలో తెలియక అవస్థపడ్డాడు. ముఖం జేవురించుకుని కొద్దినిమిషాలు అలాగే నిలబడ్డాడు. అది కొత్త కోటుకాదనీ, తన మామూలు "తుండుగుడ్డే" ననీ చెప్పుకున్నాడు, కాని యెవరూ వినిపించుకోలేదు.

చివరికి హెడ్‌గుమాస్తా కింది ఉద్యోగి ఒకడు తనకి గర్వంలేదని, చిన్న చిన్న ఉద్యోగులమీద తనకి అభిమానం ఉందనీ చూపించుకోడాని కిలా అన్నాడు:

"సరే. అకాకీ అకాకియెవిచ్ బదులు నేను టిపార్టీ చేస్తాను. ఇవ్వాళ రాత్రి మీరంతా మాయింటికి రావాలని కోరుతున్నాను. ఇవ్వాళ నా పుట్టినరోజుకూడా కలిసొచ్చింది."

ఈ ఆహ్వానాన్ని ఉద్యోగులు సంతోషంతో అంగీకరించారు. అకాకీ మొదట్లో తను రాలేనన్నాడు. ఉద్యోగులు బాగా ఒత్తిడిచేసి "ఇది అన్యాయం, అక్రమం, ఘోరపాపం," అని బలాత్కరించిన మీదట అకాకీ నోరెత్తడానికి వీల్లేక వస్తానన్నాడు. పైగా రాత్రి విందుకు వెడితే, కొత్తకోటు ఇంకోసారి ధరించే అవకాశం కలుగుతుందని కూడా సంతృప్తిపడ్డాడు.

ఆ రోజంతా అకాకీ 'పండగబుల్లాడిలాగ' సంబరపడుతూనే వున్నాడు. హుషారుగా యింటికి వచ్చాడు. కోటువిప్పి వంకకు తగిలించి, మళ్లీ కాసేపు చూసి మురిసిపోయాడు. దాని పక్కన పాతకోటు పెట్టిచూసి, రెంటికీ గల తేడాకు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకున్నాడు. భోజనాదికం అయినతరవాత చాలసేపటికి పాత కోటు మళ్లీ జ్ఞాపకంవచ్చి తెగనవ్వాడు. ఖుషీగా భోజనం చేశాడు. ఆ రాత్రికి రాత పని పెట్టుకోకుండా కొద్దిగా చీకటి పడేదాకా ఆవలిస్తూ పడుకున్నాడు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకునిలేచి, కోటు తొడుక్కుని వీధిలోకి వచ్చాడు.

విందుచేస్తున్న అసిస్టెంటు గుమాస్తా ఏ ప్రాంతంలో వుంటున్నాడో చెప్పలేను. సెంట్‌పీటర్స్‌బర్గ్ నగరంలోని యిళ్ళు, వీధులు అన్నీ నా మనస్సులో కలగాపులగంగా కలిసిపోయి ఏదెక్కడుందో జ్ఞాపకం రావడంలేదు. ఒకటిమాత్రం చెప్పగలను; అతడు ఉండేది నగరంలోకల్లా సుందరమైన ప్రాంతం. అందుచేత అకాకీయింటికి చాలదూరమని ఊహించవచ్చు. ముందు అకాకీ మురికి సందులగుండా, నిర్జనమై, మసక వెలుతురులో అస్పష్టంగా కనిపిస్తున్న దారులగుండా నడిచిపోయాడు. కాని అసిస్టెంటు గుమాస్తా నివసించే ప్రాంతం సమీపిస్తున్న కొద్దీ వీథుల్లో సమ్మర్దం ఎక్కువైంది. దీపాల వెలుగుకూడా ఎక్కువైంది. ఖరీదైన దుస్తులు ధరించిన పెద్ద మనుషులు, యువకులు, యువతులు కనిపించసాగారు. అందమైన శకటాలు మంచును చీల్చుకుంటూ పరుగెత్తుతున్నాయి. శకటచోదకులు ఎర్రటి ముఖమల్ టోపీలు పెట్టుకుని, ఎలుగుబంటి చర్మంతో కుట్టిన కోట్లు తొడుక్కుని వున్నారు.

దేదీప్యమానమైన యీ దృశ్యం చూస్తూ అకాకీ సంభ్రమాశ్చర్యచకితుడై నడవసాగాడు. సాయంత్రంవేళ అతడు వీథుల్లో నడిచి కొన్ని యేళ్ళయింది. కుతూహలం ఆపుకోలేక ఒక షాపుముందర నిలిచాడు. కిటికీదగ్గర ఒక సుందరిబొమ్మ వున్నది; ఆమెకి ఒక కాలిజోడు ఊడిపోయి పక్కన పడివుండడం చేత మనోహరమైన నగ్నపాదం చూపరులను నిలవేసి పలకరించి పులకరింపజేస్తోంది. ఆ బొమ్మవెనక అందమైన మీసకట్టు కల యువకుని బొమ్మ తొంగిచూస్తోంది. అకాకీ తల పంకించి నవ్వుకుని ముందుకు సాగాడు. అకాకీ ఎందుకు

★ శనిదేవత రథచక్రం ★

వచ్చాడు? ఎప్పుడూ చూడని వింత చూసినందుకా? లేక చాలమంది ఉద్యోగులవలె "ఈ ఫ్రెంచి వాళ్ళున్నారే! మహాయిదిలే. ఇల్లాంటివాటిల్లో వీళ్లకి మహా -" అని అనుకున్నాడా? ఏమో, అకాకీ ముఖంలో ఆలోచనా రేఖ లేక్కడా కనిపించలేదు.

విందు జరిగే గృహానికి అకాకీ ఎకాయెకీ చేరుకున్నాడు. గృహస్థు మంచి దర్జాగా బతుకుతున్నాడు. మేడమెట్లమీద దీపం వెలుగుతూ దారి చూపిస్తోంది. ద్వారం దాటగానే వరసగా బారులుతీర్చిన కాలి జోళ్ళు కనిపించాయి. గోడలకు రకరకాల కోట్లు, ఓవర్ కోట్లు తగిలించి వున్నాయి; వాటిల్లో కొన్ని నిజంగా ఖరీదైనవే వున్నాయి. దూరపుగదిలో తుమ్మెదల రొదలాగా మాటలు వినిపిస్తున్నాయి. ఒక సేవకుడు పెద్ద పళ్లెంలో పానీయాలు, పాత్రలు పట్టుకొచ్చాడు. రొద యింకా యెక్కువైంది. ఉద్యోగులు వచ్చి చాలసేపైనట్లుంది. అప్పుడే మొదటిసారి టీ తాగడం కూడా అయినట్లుంది.

అకాకీ తనకోటు విప్పి వంకెకు తగిలించి లోనికి ప్రవేశించాడు. ఒక్కసారిగా దీపకాంతులు కొట్టవచ్చాయి. చుట్టలు, పైపులు, పేకముక్కలు కనిపించాయి. ఒకరిమాట ఒకరికి వినరాకుండా అతి వేగంగా సంభాషణ సాగిపోతోంది. అకాకీ దిగ్భ్రాంతుడై, ఏంచెయ్యాలో తెలియక గదిమధ్య నిలబడ్డాడు. అతన్ని చూడగానే ఉద్యోగులు గొల్లున గోల చేస్తూ లేచి చుట్టుముట్టారు. కోట్లు విడిచే గదిలోకి జొరబడి మళ్ళీ అతని కోటు పరీక్షించారు. అకాకీకి కంగారు పుట్టినా, తన కోటును వాళ్ళంతా మెచ్చుకోవడం చూసి, సంతోషపడకుండా ఉండలేకపోయాడు. తరవాత అతన్నీ, అతని కోటునీ వదిలేసి యథాస్థానాలకు వచ్చి కూర్చున్నారు.

ఈ రొద, జనం, తొక్కిడి, అకాకీకేమీ రుచించలేదు. ఎక్కడ నుంచున్నాడో, చేతు లెక్కడ పెట్టుకోవాలో, కాళ్లెక్కడ పెట్టుకోవాలో, అసలు శరీరాన్నే ఏ ప్రదేశంలో ఉంచాలో తెలియక తికమకపడ్డాడు. అతిథులు స్థిమితంగా పేకాట ఉపక్రమించారు. వారి పక్కన కూర్చుని అకాకీ పేకముక్కలవంకా, ఆటగాళ్ళవంకా చూస్తున్నాడు. కొంతసేపటికి ఆవలింతలు మొదలెట్టాయి. మామూలుగా నిద్రపోవలసిన సమయంలో నడుం కట్టుకుని కూర్చోడం బాధగానే వుంది. వెళ్ళిపోదామనుకున్నాడు, కాని వాళ్ళతన్ని లేవనివ్వలేదు. కొత్తకోటు గౌరవార్థం ఒక గ్లాసు షాంపేన్ తాగితీరాలని పట్టుపట్టారు. ఒక గంట గడిచేసరికి, మామూలు భోజనం, పళ్ల ముక్కలు, తీపి పదార్థాలు, షాంపేన్, ఇంకా ఏవేవో గర్భకుహరానికి ఆహుతి అయ్యాయి. అతిథులంతా బలవంతంచేసి అకాకీచేత రెండు గ్లాసుల షాంపేన్ తాగించారు. దాంతో అకాకీకి జవసత్త్వాలు ఇనుమడించినట్టు, ప్రపంచం బాగానే వున్నట్టు అనిపించింది.

అయినా అతనికి తను చాలసేపు కిందటే యింటివద్ద వుండవలసినవాణ్ణనీ, పన్నెండు గంటలదాకా అలా మేలుకోవడం అక్రమమనీ మథన పుట్టింది. గృహస్థుతో చెబితే వెళ్లనివ్వడని, ఎవరితోనూ చెప్పకుండా అకాకీ అక్కణ్ణించి చల్లగా జారుకున్నాడు. బయటి గదిలో తన కోటుకోసం వెదికాడు. అది నేలమీద పడివుంది. 'అయ్యయ్యో' అనుకుని దాన్ని తీసి, భద్రంగా మట్టి గిట్టే దులిపి, తొడుక్కుని, మెట్లు దిగి, వీథిలోకి వచ్చాడు.

వీథిలో యింకా దీపాలు వెలుగుతూనే వున్నాయి. నౌకర్లు, ఆ తరగతికి చెందిన తదితర జనం వెళ్లే చిన్న చిన్న దుకాణాలు కొన్ని యింకా తెరిచే వున్నాయి. పెద్ద షాపులు మూసివున్నప్పటికీ, తలుపుల సందుల్లోంచి వెలుతురు ప్రసరిస్తూనే వుంది. లోపల షాపులకు చెందిన పనివాళ్లేగావును, కబుర్లు, కథలు చెప్పుకుంటున్నారు. అకాకీ సంతుష్టాంతరంగుడై, తరంగకల్లోలితమైన నదిలాగ ప్రవహిస్తూ యింటిదారి పట్టాడు. తటిల్లతలాగ తళతళ మెరసే తరుణీమణి ఒకర్తె అకాకీని రాచుకుంటూ ముందుకు పోయింది. అకాకీ అప్రతిభుడై కాసేపు నిలిచి, ఎప్పుడూ యెరగని మహాసాహసంతో ఆమెను కొంతదూరం వెంబడించాడు. కాని మళ్ళీ తనకే ఆశ్చర్యం కలిగి, వేగం తగ్గించి, మామూలు నడక సాగించాడు. మళ్లీ వీథులు నిర్జనాలైనాయి. పగలే దిగులు, గుబులు పుట్టించే ఆ వీథులు రాత్రిళ్ళు యెంత భయావహంగా వుంటాయో చెప్పనక్కర్లేదు. నిశ్శబ్దాన్ని చించుకుని కీచురాళ్ళు 'గీ' పెడుతున్నాయి. వీథిలాంతర్లు అంతకంతకీ ఎడమైపోతున్నాయి; బహుశా నగరాధికారులు ఇలాంటి వీథులకి నూనె తక్కువ సప్లయి చేస్తారు. పొగమంచులాగ వ్యాపించిన మసక వెలుగులో ప్రతివస్తువూ భయపెడుతోంది. తరవాత దారుగృహాలు, కంచెలు తగిలాయి. ఎక్కడా జనసంచారం లేదు. మెల్లిగా రాలుతున్న మంచు తుప్పర మాత్రం నక్షత్రాల పొడిలాగ నేలమీద మెరుస్తోంది. అకాకీ నడిచి నడిచి చతురస్రాకారమైన బట్టబయలు ప్రదేశానికి వచ్చాడు. ఆ స్థలం దాటితే మళ్ళీ యిళ్ళు వస్తాయిగాని, అది దాటడమే సమస్య.

ఎడారిదారిలో బిడారంలాగ, దూరంగా కాపలావాడి గుడిసెలో దీపకళిక మినుకు మినుకుమని కునుకుతోంది. ఆ దీపం ఎక్కడో మరో ప్రపంచపుటంచుల్లో వున్నటు కనిపిస్తోంది. ఇక్కడికి వచ్చేసరికి అకాకీ వుత్సాహం చాల డిగ్రీలు తగ్గిపోయింది. ఏదో అవ్యక్త భయంతో, అపాయం శంకిస్తూ ఖాళీమైదానంలో అడుగు పెట్టాడు. కొంత దూరంపోయి వెనక్కి చూశాడు. తరిదాపులేని మహాసాగరమధ్యంలో వొంటరిగా వున్నట్టు భయపడ్డాడు. "ఉహు. వెనక్కి చూడగూడదు," అనుకున్నాడు. కళ్ళుమూసుకుని నడిచాడు. మళ్ళీ తెరిచేసరికి, తన్ను చుట్టుముట్టి కొందరు మనుషులు జీబురుగడ్డాలతో, జీబూతాల్లాగ కనిపించారు. ఒక్కసారిగా కళ్లు చీకట్లు కమ్మాయి; గుండెలు పీచుపీచుమన్నాయి.

వారిలో ఒకడు అకాకీ కాలరు పట్టుకుని గుంజి, కర్కశస్వరంతో "ఈ కోటు నాది!" అన్నాడు. అకాకీ "దొంగల్రోయ్" అని కేక వెయ్యబోయాడు. ఇంతలో రెండోవాడు పదిపౌనుల బరువుగల పిడికిలి బిగించి నోటిమీద కొట్టి "అరుస్తావ్రా..." అని తిట్టాడు.

వాళ్లు తనకోటు ఊడలాక్కుంటున్నట్టు గ్రహించాడు అకాకీ. వీపుమీద చాచి

తన్మిన అనుభూతికూడా అతనికి కలిగింది. బోర్లగిలా మంచుమీద పడ్డాడు; అంతే, ఆ తరవాత మరేమీ తెలియలేదు.

కొద్ది నిమిషాల్లో అకాకీకి స్పృహ వచ్చింది. తూలిపోతూ లేచినుంచున్నాడు. చుట్టూ చూశాడు; ఒక్క పిట్ట లేదు. చలి వేసింది; వొంటిమీద కోటు లేదని గ్రహించాడు. గట్టిగా అరుద్దామనుకున్నాడు. కాని అతిహీనస్వరం వెలువడింది. అలాగే అరుస్తూ, పరిగెత్తి అవతల చివరవున్న కాపలావాడి గుడిసె చేరుకున్నాడు. అక్కడ కాపలావాడు నుంచుని తనకేసి పరిగెత్తి వస్తున్న యీ వింతమనిషి యెవరా అని చూస్తున్నాడు. అకాకీ ఏడుస్తూ, కాపలావాడు కాపలా కాయకుండా నిద్ర పోతున్నాడనీ, తన కళ్ళ యెదుట దొంగతనం జరుగుతుంటే చూస్తూ వూరుకున్నాడనీ నిందించాడు. కాపలావాడు, తను యిద్దరు మనుషులను చూసిన మాట నిజమేననీ, వాళ్ళు మైదానం మధ్య అకాకీదగ్గర ఆగడం చూశాననీ, మాసి ముగ్గురూ స్నేహితులనుకున్నాననీ బదులు చెప్పాడు. తన్ను నిందించే బదులు, మర్నాడు పొద్దున్నే పోలీసులకు ఫిర్యాదు చేయడం మంచిదనీ, దొంగల్నీ కోటునీ పట్టుకునే పూచీ వాళ్లదేననీ సలహా యిచ్చాడు.

అకాకీ చేసేదిలేక యింటికి పరిగెత్తి వచ్చాడు. జుట్టు చిందరవందరగా రేగి, కాళ్లు, చేతులు, వొళ్ళూ హిమధూసరితమై మనస్సు భయాకులితమై ఆకాకీ గుమ్మం దగ్గర ఆగి తలుపు బాదాడు. గృహయజమానురాలు గాబరాపడి లేచి గబగబ తలుపు తీసింది. అకాకీ ఆకారం చూసి జడుసుకుని వెనక్కి పడిపోయింది. సంగతంతా విని గుండె బాదుకున్నది. "సరాసరి జిల్లా పోలీసు అధికారి దగ్గిరికి పో. అతని కింది అధికారి దగ్గిరికి వెళ్ళద్దు. అతగాడు కేసులు విని వూరుకుంటాడు గాని పనిచెయ్యడు," అని చెప్పింది. ఇంకా వివరాలిచ్చింది: "జిల్లా పోలీసు అధికారి మంచివాడు. మన యింట్లో యిదివరకు వంటలక్కగా పని చేసిన ఆనా యిప్పుడు ఆయన యింట్లో దాదిగా పనిచేస్తోంది. ఆమెద్వారా నే నాయన్నెరుగుదును. మన యింటిముందు నుంచే అప్పుడప్పుడు పోతూవుంటాడు. ప్రతి ఆదివారం చర్చికి హాజరవుతాడు. భక్తితో ప్రార్థనచెయ్యడమే కాక అందరికంకా చిరునవ్వుతో చూస్తూవుంటాడు. అందుచేత మంచివాడే అయివుండాలి."

ఇదంతా విని అకాకీ విచారంగా కాళ్ళీడ్చుకుంటూ తన గదికి పోయాడు.

సినిక్ స్వగతం

గోపాలచక్రవర్తి

ఈ అండర్ వరల్డ్ నుంచి
ఈ అమావాస్య చీకట్లనుంచి
ఈ అజ్ఞాతవాసంనుంచి
ఈ అశాంతి నికేతనంనుంచి
బయటపడే మార్గంకోసం
ఒక గవేషణ
నాకేం కావాలో నాకే తెలియదు
అందమైన అమ్మాయి
కృష్ణమృగనేత్ర మంజుగాత్ర
కావాలో
ధనం కావాలో మరి ఉద్యోగం
కావాలో
చనిపోతే సుఖంగా ఉంటుందో
చిరకాలం బ్రతికి చేసేదేమిటో
నాకే తెలియని ఒక వింత మానసిక
పరిస్థితి.
మానవుడు చిరంజీవి అంటారు
అంతాను
మానవుడి ఎఛీవ్ మెంటును
పొగడుతారు
కాని నాకు తెలుసు కలలు
నిజమవవని
జీవితానికి అర్థం లేదని
శ్రమకు ఫలితం కన్పించదని.
తాజ్ మహాల్ సౌందర్యం ఒక
అబద్ధం.
సారోయన్ కథల సొగసు
టాగూర్ కవిత్వంలోని ఆధ్యాత్మిక
పరిమళాల గుబాళింపులు
ఇవన్నీ నిజంగా ఉన్నాయంటావా?
నిరుద్యోగుల జీవితాల్లో నిరాశా
నిరుత్సాహాం;
నితాంత వైభవోజ్జ్వలు దేమిటిలే
ఉద్యోగిమాత్రం?
నిరంతరానందం ఎక్కడ వుంది?
అందరి బ్రతుకులూ ఒక విధంగానే
వున్నాయి.
ఎవడు సుఖపడుతున్నాడులే
ఈ భువిపై
ఈ మస్తిష్కమొక తమస్సముద్రం
ఒక కురుక్షేత్ర యుద్ధరంగం
మల్లికా ప్రసూనంకంటె
భద్రగజం దంతంకంటె
శరత్కాలమేఘంకంటె
తెల్లనైన (దొరసాని) కుక్కపిల్ల
మనకంటే ఎంతో నయం
దాని కాలోచనలు రావు
దానికి సమస్యలు లేవు
చీకటీ దుఃఖం కరువూ కాటకం
లేని దేశం ఎక్కడ వుంది?
సదా అమృతం వెల్తురూ వున్న
రమ్యబృందావన మెక్కడ వుంది?
ఈ లోకం విడిచి మరో లోకం
వెళ్ళడానికి మార్గం ఏది?

అతడా రాత్రి ఎలా వేగించాడో ఊహించాలంటే అతని మానసిక వేదనలో మనంకూడా భాగస్వాములం కావాలి.

(ఇంకా వుంది)

స్కెచ్:

దాగిన అగాధాలు

ఆర్. యం. చిదంబరం

పేవ్‌మెంట్ మీద విసవిస నడిచిపోతున్న రవణ తన కెదురుగా వస్తున్న ఓ నడివయసు కాషాయ వస్త్రధారిని మాసి ఛటుక్కున ఆగిపోయాడు. అతను పరధ్యానంగా ఎటో చూస్తూ నడుస్తున్నాడు. కాళ్ళకు తొడుక్కున్న క్రచెప్పులు టక టక మంటున్నాయ్. ఏదో తనలో తాను గొణుక్కుంటున్నాడు కూడా. ఎక్కడో చూసిన ముఖమైనా గుర్తుపట్టటం కష్టమైంది రవణకు.

'సత్యనారాయణమూర్తిగారూ!' అన్నాడతన్ని గుర్తుపట్టగలిగినందుకు సంతోషిస్తూ. మూర్తికూడా ఛటుక్కున ఆగిపోయి 'ఓహో! రవణగారూ! ఎక్కడికెడుతున్నారు?' అడిగి నవ్వాడు. అతని నవ్వులో విషాద ఛాయలు కనిపించాయి. మాటలు కూడా శిధిలమై భూమిలో దాక్కున్న కట్టడంలోంచి వచ్చినట్టున్నాయి.

'చాలా మారిపోయారు. గుర్తుపట్టలేకపోయాను సుమండి...ఇక్కడుంటున్నారా? మనూరొదిలేసి ఎంతకాలమైంది?' అనడిగాడు రవణ.

రవణ కళ్ళల్లో, ఏమూలనో నీటి జీరలు ఛాయగా కనిపించాయి.

'అవూరొదిలేసి రెండేళ్ళైంది. నాకో ఊరేమిటి? ఎక్కడ ఇన్ని మెతుకులు దొరికితే అక్కడ తిష్ఠవేయటమే! చేతిలో విద్యవుండి ప్రయోజనం లేకపోయింది. అందుకూ బాధపడుతున్నా. అడుక్కునే వాడికీ, నాకూ తేడా కనిపించటంలేదు... చూడండి! మొన్న నేమో గ్కొట్టు దగ్గర జోస్యం చెబుతున్నా. ఎవడో చదువుకుంటున్న కుర్రాడు చెయ్యి చూపించి 'నా పరీక్ష ఏమౌతుం'దన్నాడు. బాగా పరీక్షించి పోతుందన్నాను. ఇక చూస్కోండి! పొగలాగ లేచిపోయాడు. వాడూ మరో నలుగురూ కలిసి తన్నటానికి సిద్ధమయ్యారు. పరీక్ష ప్యాసవుతుందంటే అన్నీ కోతలంటారు ..'

ఇంతా అనేసి ఫక్కున నవ్వేశాడు మూర్తి. కానతనికంఠం బొంగురుపోవటం రవణ కనుక్కున్నాడు. జోస్యం చెప్పేశక్తి అతనికున్నదీ లేందీ రవణకు బాగా తెలుసు. ఇదంతా నటనని, మూర్తిని ఏనాడో చాకలి బట్టలుతికినట్టు ఉతికేస్తారని అతనికి తెలుసు.

'ఈపని మానుకుని మరోపన్లోకి పోకూడదూ?' అంతకంటె ఏమనటానికీ తోచలేదు.

'అన్నీ అయిపోయాయి. నా బతుకంతా ఇలాగై పోయింది. నన్నిలా ఉండనివ్వండి బాబూ!'

'మీ పూర్వ చరిత్ర నాకు చెప్పారు కారు. నేను కనీసం వందసార్లయినా అడిగుంటాను...'

ఆమాటలని నాలిక్కరచుకున్నాడు రవణ.

'పోనిద్దురూ! పాతవన్నీ ఎందుకు?'

'నా చెయ్యి మాద్దురూ!' అని రవణ చెయ్యిచాచాడు. నిజానికి ఆ అసందర్భపు పేలాపన - భట్రాజు పొగడ్తలు విందామని కాదు. ఏదో సాయం చేద్దామని. 'ఇదుగో ...ఈ డబ్బులు తీసుకోండి' అనిస్తే మూర్తి బాధపడతాడని రవణకు తెలుసు.

'ఎన్నిసార్లు చూడమంటారు ? ... నీ చేతిలో రేఖలు నాట్యం చేస్తున్నాయంటే నమ్మ. ఇకముందు మీ బతుకంతా బంగారంలా వుంటుంది. ప్రమోషన్‌కూడా అవుతుంది' అన్నాడు తీక్షణంగా చేతిని చూస్తూ.

ఆఖరిమాటకు రవణకు నవ్వొచ్చింది. ఆ క్రితంరోజే అతని వుద్యోగం వూడిపోయింది! ఇంకేం ప్రమోషన్!

దగ్గరుండే ఒక్క పావలా ఇచ్చేశాడు. వృథాగా పావలాను వెచ్చించినందుకు అంతరాత్మతో ఘర్షణ పడవలసి వున్నప్పటికీ మూర్తిమీది జాలి భవిష్యత్తును మరపింపచేసింది.

'మీదయ ఉండబట్టే ఇలా వున్నాను. సెలవు' అని నమస్కరించి మూర్తి వెళ్ళిపోయాడు.

రవణ ఆలోచిస్తూ నడక సాగించాడు. ఎదురుగా మరో కాషాయవస్త్రధారి వస్తున్నాడు. ఎవ్వరినీ దమ్మిడీ అడక్కుండా గంట వాయించుకుంటూ పోతున్నాడు.

'సరదాకి షికారెళుతున్నాడేమో! లేకపోతే ఎవడినీ దమ్మిడీ అడగడే! అడక్కపోతే అమ్మన్నా పెటదు. దయ తలిచి మెడకు కట్టుకున్న డబ్బాలో తృణమో పణమో పడేయాలని గామోలు అతని అభిప్రాయం' అనుకున్నాడు రవణ. గంటల గణగణ దగ్గరైంది. వెళ్ళిపోయింది. అతని పండుటాకులాంటి ముఖం వణకిపోతోంది. చూసి జాలిపడ్డాడు.

కాని జాలి చేయగలిగిందేముంది?

సాధువులంటే రవణ కరికాలిమంట. మిషన్‌గన్ పుచ్చుకుని అందర్నీ కాల్చి చంపాలనేవాడు. కాని కొన్ని చిత్ర సంఘటనలు అతని స్థిరాభిప్రాయాన్ని పెనుగాలి మహావృక్షాన్ని కదలించినట్టు కదిల్చి పారేసింది. అనుకోకుండా సత్యనారాయణమూర్తి తటస్థపడ్డాడు. సానుభూతిని ప్రవహింపజేశాడు. రెండేళ్ళకిందట.

రవణ మరోవూళ్లో వుండేవాడు. ఓనాడు షికారెడుతుంటే మర్రిచెట్టుకింద జనం మూగున్నారు. ఏ మోళీయన్నా నేమోనని జనాన్ని తోసుకుని వెళ్ళాడు. ఓ సాధువు మతం వేసుక్కూర్చున్నాడు. మూడో, నాలుగో రుద్రాక్షమాలలు వేసుకున్నాడు. వీభూతి రాసుకుని అపర సాంబశివుడిలాగున్నాడు. చుట్టూ ఏవో జ్యోతిష గ్రంథాలు హస్తరేఖల్ని చూపుతూ వోపటం!

'జ్యోతిషము చెప్పబడును. చేతికి ఒక్క బేడ మాత్రమే!' అని అట్టమీద రాసుంది.

అతనెవరికో జ్యోతిషం చెబుతున్నాడు. చుట్టూ మూగిన జనం వింత చూస్తూ జోస్యంమీద విమర్శలు పారేస్తున్నారు.

'మీ దశ ఇప్పుడేం బాగా లేదు. నానా అగచాట్లూ పడుతున్నారు. మీ బతుకు బరువుగా గడుస్తోంది. మీకు మంచిదశ రావటానికి ఇంకా రెండేళ్ళు పోవాలి. కోరు వ్యవహారాలు ఇప్పట్లో తెమలవు. అన్ని పనులకూ మీ కవరోధాలు కలుగుతున్నాయి. ఇన్ని కష్టాలు ఒక్కసారిగా వచ్చిపడ్డాయి కనుక మీరు వెంటనే ప్రాయశ్చిత్తం చేసు

కోటం మంచిది. లేకపోతే బాధలు మరీ ఎక్కువై మనశ్శాంతి లేకుండా పోతుంది. ఏమంటారు?'

చాలా గంభీరంగా పలికాడు. నిజానిజాల సంగతటుంచి ఎవర్నీ లెక్క చేయకుండా అంత ధైర్యంగా చెప్పినందుకు అతనికో బహుమాన మివ్వా లనిపించింది రవణకు.

'ప్రాయశ్చిత్తానికి ఏం చేయాలి?' అని ప్రశ్నించాడు జ్యోతిషం చెప్పించుకుంటున్న వాడు. 'కుంకం .. పూలు ... అరటి పళ్ళు - అన్నీ కొని పూజచెయ్యాలి. ఆ క్రమమంతా రాసిస్తాను. అర్థరూపా యివ్వండి.' అన్నాడు జోస్యుడు. అవ్యక్తి మాట్లాడకుంటా వెళ్ళిపోయాడు.

బెల్లం చుట్టూ మూగిన చీమల్ని తప్పించుకుంటూ మరొకడువచ్చి బేడ సమర్పించుకుని చెయ్యి చాచాడు. సాధువు ఇందాకటి పాఠమే కొంచెం మార్చి వల్లించాడు. యథాప్రకారంగా అతన్నికూడా ప్రాయశ్చిత్తం చేసుకోమన్నాడు.

ఇదంతా నటనని తెలిసిపోయింది! ఈ సంగతి సాధువుకు కూడా తెలిసుండాలి మరి. అతను సర్రున లేచాడు.

'హరి నీజోస్యం తగలేయా! నిక్షేపంలా వుంటే ఆ పీడ వుంది — ఈ పీడవుందని జోస్యం చెప్తావా? ముందు నీపీడ విరగడవ్వాలి. కోర్టు వ్యవహారాలు లేండే ఉన్నాయంటావు... నా బేడ ఇలా పడేయ్!' అన్నాడు.

మొదట్లో జ్యోతిష్కుడు ఏదో సణిగాడు కాని పరిస్థితులు ఎదురుతిరుగుతున్నాయని భయపడి బేడ కాసు తిరిగిచ్చేశాడు. ఈ పగటిమోసాన్ని చూశాక, ఇంతకుముందు జ్యోతిషం చెప్పించుకున్న పెద్దలు కొందరు 'మా డబ్బులు మాకు తిరిగిచ్చేయ్!' అని కల్లెర్ర చేశారు.

'మీ రంతా అబద్ధం ఆడుతున్నారు. ఈయ నొక్కడి విషయంలో నా జోస్యం ఫలించలేదు. అంతే! మీ కందరకూ ఉన్నదున్నట్టు చెప్పాను. అన్యాయంగా నన్ను జడిపిస్తున్నారు. నే నివ్వను' అ నరిచాడు జ్యోతిష్కుడు.

'పసవని నాలుగు తన్నండి. వెధవ జోస్యం కేడినా!' అన్నా రెవరో. జ్యోతిష్కుడి తలమీద గట్టిగా దెబ్బ పడింది.

'బాబూ! నేను ఈ వూరివాణ్ణే. ఇదంతా పొట్టకోసం. కోటివిద్యలు కూటికోసం. మీ కాళ్ళకు దండాలు. నష్టం చేయకండి. నా జీవితం భస్మమైపోతుంది. ఇంకెవ్వరూ నా దగ్గరకురారు.. నన్నొదిలేయండి' అని మొత్తుకున్నాడు.



"చాలా మారిపోయావు. గుర్తుపట్టలేక పోయాను సుమా!"

ఇదంతా చూస్తున్న రవణకు కళ్ళనీళ్ళ పర్యంతం జరిగింది. తనకు తెలియకుండా ఏదో శక్తి ఆవహించింది. ఛటుక్కున ముందుకుదూకి ఆ అభాగ్యుణ్ణి విడిపించాడు.

'మీకు మతుల్లేవూ? అమాయకుడు, లోకువగా దొరికాడుకదా అని తంతున్నారా? ఇలాంటి మోసాలెన్ని జరగటం లేదు? పేపర్లో ప్రకటనలు చూసి రూపాయలు తగలేసి మీ అదృష్టాన్ని కొనుక్కుంటారా! అదంతా నిజమయింది! ఇది కాకపోయింది! అమెరికానుంచి దిగాను. జ్యోతిషం చెబుతాను. అని నూటొబాటూ వేసుకున్న వాడు బోర్డు తగిలిస్తే వెళ్ళి ఎన్ని పేలాపనలు పేలినా అడిగినదంతా ఇచ్చుకుని పక్కన పేనుల్లా తిర్గుగొస్తారు... ఇదంతా కూటికోసం. నన్నొదిలేయండి అని మొత్తుకున్నా మీకు దయ లేదన్నమాట!'

రవణ తనకు తెలియకుండా అరిచాడు. సాధువుల్ని, వాళ్ళ జీవితాల్ని విషంలా

ఎంచేత అతను తనను తెలియకుండా ఇతని కోసం తిరిగాడు. బాబూ, దర్పం చెయ్యని వాడి గతింతే గానాలనుకున్నాడు.

మాటంతా నవ్వుకుంటూ చెదిరిపోయింది. కొందరు 'ఇద్దరూ ఒకటే' అన్నారు. కొందరు రవణ మాట నిజమన్నారు. ఆ జ్యోతిష్కుడు కృతజ్ఞత చెబుతుంటే వినిపించుకోకుండా చరచర నడిచి వెళ్ళిపోయాడు. భిన్నభావాలు పాలసముద్రపు సుడిగుండంలో కెరటాల్లా కొట్టుకున్నాయి.

ఆరాత్రే రవణ తను అద్దెకుంటూన్న ఇంటియజమాన్ని ఆ సాధువుగురించడిగాడు. అత కొకప్పుడు సంసారేనట. అతని పెళ్ళాం ఒకడితో లేచిపోయిందట. ఆకేళ్ళ కుర్రాడు అనాథగా మిగిలితే బర్రున చీకటిలా పరుగెడుతున్న కారొకటి ఆకుర్రాణ్ణి మింగేసిందట. మనసు విరిగి ఇలా బతుకుతున్నాడట. అతన్ని గురించి కొందరికే తెలిసినకథ ఇది. అయితే ఈకథ పైకి రాటానికి కారకులెవరో ఎవరికీ తెలియదు.

అతనిపేరు సత్యనారాయణమూర్తి.

'అత నిల్లెక్కడ?' అనడిగాడు రవణ ఇంటాయన్ని.

'రైలు స్టేషను దగ్గర పాకలో ఉంటున్నాడు. అతనిబతు కెందుకోగాని నాకు బోధపడదు' అని తుబుక్కున వుమ్మేశాడు ఇంటాయన.

రవణ కెందుకో అతన్ని కలుసుకోవాలనిపించింది. ఇలాంటి వ్యక్తులు ప్రతిచోటా ప్రతిక్షణం కనిపిస్తూంటారు. కాని వారి జీవితాల వెనకవున్న అగాధాల్ని తెలుసుకోట మెలాగ? మనసులు విరిగి బతుకుల్ని బండరాతికేసి కొట్టుకున్న వాళ్ళను రవణ బాగా ఎరుగును. అందర్నీ తలచుకుని జాలిపడటానికి టైము చాలదు. పాత గాయాల్ని మాపుకోటానికి ఇదో మత్తుమందు.

మరునా డుదయమే రవణ అతనుంటున్న గుడిసెకు వెళ్ళాడు. అత నింటోవున్నాడని రుజువుచేసుకున్నాక తలుపుదగ్గర కెళ్ళాడు.

లోపలనుంచి సన్నటి ఏడుపు వినవచ్చింది. రవణలో భయం మొలకెత్తింది.

పావుగంటపోయాక కాని ఆ ఏడుపు తగ్గలేదు. రవణ తలుపుసందులోంచి చూశాడు. ఆ జ్యోతిష్కుడే కూర్చుని ఏడుస్తున్నాడు. రవణ ఆశ్చర్యంలో దాక్కుండిపోయాడు. గడచిన జీవితాన్ని తలచుకునేడుస్తున్నాడా? వర్తమాన జీవితపు కంపు భరించలేక ఏడుస్తున్నాడా?

'లోప లెవరూ లేరూ?' నెమ్మదిగా అడిగాడు రవణ.

ఐదునిమిషాలు నిశ్శబ్దం. ఏడు పాగిపోయింది.

'ఎవరు?...' అంటూ సత్యనారాయణ మూర్తి తలుపు తీశాడు.

'మీరా...రండి...రండి...అద్దెకోసమేమో ననుకున్నా. మీ దయ లేకపోతే ఈపూ విమానంమీద పోయేది!' అన్నాడు నవ్వుతూ. రవణ లోపలకు పోయి కూర్చున్నాడు. కొత్త చెదారం అంతా గది వలంకరించింది. ఎండిపోయిన అన్నం ఓ కుండలో వుంది. అల్యూమినియం గిన్నెలో చీమలు పట్టిన ముజ్జిగుంది. ఇందాకటి ఏడుపంతా ఏమైందో! కళ్ళు మాత్రం ఎర్రరంగు పూసుకున్నట్టున్నాయి. మూర్తి రవణ పేరు తెలుసుకున్నాడు.

'ఈ ఇంటికి అద్దెంత?' అనడిగాడు.

'అర్థ రూపాయ్!...కా నది రావటం కూడా బాధగానే ఉంది. నాదగ్గర విద్య ఉంది. కా నెవడూ మెచ్చుకోడు. మహత్తర శక్తులు సంపాదించటానికి ఉపాసనా క్రమ మొకటుంది. నలభై రోజులు భూగృహంలో వుండాలి...కాని భూగృహాలు కట్టించి వసతు లేర్పరిచే దాత లెవరు?...' అని సమాధానం చెప్పాడు మూర్తి.

'ఇందాకా ఎందు కేడుస్తున్నారు?'

'అబ్బే! ఏడవటం లేదే!' అన్నాడు మూర్తి ఆశ్చర్యం నటిస్తూ. రవణ చెయ్యిచాచి జ్యోతిషం చెప్పమన్నాడు. అత

"ఇదుగో సిగరెట్టు తీసుకోండి."

"వద్దండీ. అలవాటైతే మానడం కష్టం."

"ఏమీ కష్టంలేదు. ఇప్పటికి నేను చాలసార్లు మానేశాను."

-ఎమ్. వెంకటేశ్వరరావు-గుంటూరు.

చేసేవాడు. జరిగినదానికీ, అతను చెప్పినదానికీ ఏం సంబంధం లేదు. రవణ వినుకోక్కలేదు. కళ్లెర్రచెయ్యలేదు.

'ఈ వృత్తి మానుకుని మరోపని చెయ్యకూడదూ?'

'అన్నీ వినిపోయాయి. నా బతుకిలాగయింది. నన్నిలా ఉండనివ్వండి బాబూ!' అన్నాడు మూర్తి.

'మీరు జీవితంలో పెద్ద పాకు తిన్నవారిలా కనిపిస్తున్నారు......మీ పూర్వచరిత్ర' అని పత్రికా విలేఖరిలా అడిగాడు.

'ఏముంది?......చిన్నతనంనుంచి ఇదే విద్య - నేను విరాగిని. నేనేం పాకులు తినలేదు. ఈ విద్య నెవరూ గుర్తించటం లేదు...'

మూర్తి కంఠంలో అబద్ధం నాట్యమాడుతోందనుకున్నాడు. అతనికో పావలా ఇచ్చేసి తిరిగి వచ్చేశాడు.

అదీ అతని తత్వం. తన విద్య నెవ్వరూ నమ్మరని తెలుసు. అయినా దాన్ని గురించే ప్రజలు పలుకుతాడు. అతన్ని తలుచుకుంటే రవణకు నవ్వొచ్చింది. అతన్ని బాగుచేయటానికి తను చేయగలిగిందేమీ లేదు. జాలిపడి ఒక్క అశ్రుకణం విడువగలడు. అంతే—

పీకలదాకా అశాంతిఉన్నా నవ్వుతున్నాడు. నవ్వాలి. నవ్వకపోతే తన నెవరు నమ్ముతారు? ఇలాగే నాటకమాడాలి. ఈ జానెడు పొట్ట నింపుకోవాలి. చావుదెబ్బలు తినాలి...మూర్తిని గురించి అంతరూ అనుకునే కథ నిజమైనదయితే లేచిపోయిన పెళ్ళాం అతన్ని తలచుకుని ఒక్క అశ్రుకణం విడిచినా చాలును.

తరువాత మూర్తితో ఎన్నోసార్లు మాట్లాడాడు.

ఆలోచిస్తూ పరధ్యానంగా నడిచిపోతున్న రవణ తాను వెళ్ళదల్చుకున్న సత్యం ఎంపోరియమ్ దాటిపోయిందని తెలుసుకుని వెనక్కి మళ్ళాడు.

ఆనాడు మూర్తి ఇంతకంటె లావుగా ఉండేవాడు. ముఖంలో కొద్దిగా కళుండేది. కానిప్పుడదంతా పూర్తిగా నశించిపోయింది. చిక్కి చీపురుపుల్లైపోయాడు. మళ్ళీ ఆ పుస్తకాలు, ఆ అట్టపట్టుకుని తిరుగుతున్నాడు. చివరకు మూర్తేమవుతాడు?

ఆకలితో అన్నంలేక చచ్చిపోతాడు. లేకపోతే దొంగవేషాలువేసి అబద్ధాలాడినందుకు ఎవరన్నా తంతే చచ్చిపోతాడు. ఏ కారుకిందన్నా పడొచ్చు. కాని ఆత్మహత్యమాత్రం చేసుకోడు.

ఇంక ఆలోచించ కూడదనుకున్నాడు రవణ.

'సాంబసదాశివా!...' అని పాడుకుంటూ మరో సన్యాసి బృందం వస్తోంది. వాళ్ళను క్షణంపాటుచూస్తే పిచ్చి పిచ్చి ఆలోచనల్తో బుర్రకు శాంతివుండదని గబగబా నాలుగడుగులువేసి సత్యం ఎంపోరియంలో మాయమయ్యాడు.

★

అనుమానం

"ఏమండీ! శాస్త్రిగారూ యిల్లు ఖాళీగా ఉందని విన్నాను. మాకు యిస్తారా?"

"ఆ! అవున్నాయనా! ఉంది! చాలా మంది అడిగారు కాని మంచివాళ్ళనుచూసి యిద్దామని యింకా యివ్వలేదు. రండి లోపలకు! మీ కిచ్చేది పైభాగం! అదిగో ఆ కనిపిస్తున్న మెట్లమీంచి వెళ్ళి చూసు

కోండి! బాగుంటే తీసుకోందురుగాని..."

"బాగానేఉంది! మరి అద్దిమాట!"

"అద్దిమాట మీకు తెలియనిది కాదు! లోగడ ఈగదికి 15 రూ యిచ్చేవారు. మీరు కూడా అలానే యివ్వండి.

"అలానేలెండి! రేపు మంచిరోజట! రేపు వస్తాము. తాళం యిప్పిస్తారా?"

"ఇందబాబూ!"

"వస్తాము!"

"మంచిదిబాబూ!"

* * *

"అరేరామూ! యిలారారా! అటుచూడు! అటురా గ్రుడ్డివెధవ! అటు అంటే యిటు చూస్తావేరా! అఅమ్మాయిచూడు! ఎప్పుడూ ఏదోపని చేస్తూవుంటుంది. నిన్న నేను ఈల వేస్తే వినిపించుకోనట్లే వుండి, ఏదో పని వున్నట్లు లోపలకు వెళ్ళిపోయింది. సర్దాగా లేదురా యిక్కడ. ఆయింట్లో వున్నప్పుడు బలేసర్దాగా వుండేది. ఈపిల్ల అందంగానే వుంటుందిగాని పొరపాటునైనా తలెత్తి చూడదురా! వీళ్ళు వెళ్ళిపోతే బాగుండురా!"

"బాగుందిరా నీగొడవ! నీకోసరమని వెళ్ళిపోతారా! నీకెప్పుడూ యిదేగొడవ! సినిమాకు పోదాంపద! అక్కడ చాలామంది ఆడాళ్ళు వుంటారు. చూద్దువుగాని!"

"ఏడిశావులే! నువ్వు మహాచూడనట్లు!"

"అందరం చూస్తాములే! కాని! నీఅంత క్రేజ్ ఎవరికీ లేదు. పదు లైమైంది"......

* * *

"శారదా! శారదా! ఏంచేస్తున్నావే! ఆదొడ్లో కాడీ వెధవలు! మేడమీద ఒకటే తిరుగుతున్నారు. కనిపట్టంలే?"

"నేను చూడలేదు. అయినా ప్రొద్దస్తమానం డాబామీద నేవుంటే ఎలా చావటం బాబూ! ఎక్కడా యిళ్ళు లేనట్లు యిక్కడికే వచ్చారు! నిన్న నేను రిబ్బను వుతుక్కుంటుంటే ఈలవేశాడమ్మ!"

"చాల్లే వూరుకో మీనాన్న వింటే నువ్వు అటే చూస్తూ కూచున్నావు కాబోలు అంటారు, అనుమానం మనిషి."

"నేనటు చూస్తేనే అలా ఉంటారేమిటి? వాళ్ల స్వభావమే అంత! స్వతంత్రం వుందని విర్రవీగుతారు. అందుమూలంగా ఎంత మందికి యిబ్బందో అని ఆలోచించరు.

నేను ఈ రెండుగదుల్లోనే వుండాలి. దొడ్లోకి వెళ్లటానికైనా వీలులేదు కదా! ఇంక అలా వెడితే చాలు, ఆడవాళ్ళు అంటే వాళ్లకు అంత చులకన. పూర్తిగా, అంటే పారిపోతారనే ఆలోచనతో నవ్వుతాలు, ఈలలు, కేరింతాలు, నేను లెక్క పెట్టకుండా నా మానాన నేనుంటే ఏం చేస్తారు? రెండురోజులతరవాత మళ్ళీ చూపెమను చూద్దాం!"

"ఊ! అయిందా నీ వుపన్యాసం! చెల్లి ఏడుస్తోంది! ఎత్తుకోపో!

"అందుకేగా! ఆడవాళ్ళు పుట్టింది! ఎంత చాకిరీ చేస్తున్నా ఆడది పుట్టగానే 'అయ్యో ఆడపిల్లా' అని పెదవి విరుస్తారు. యిప్పుడు అన్నయ్యకు చదువుకు మీరు ఎంత పంపుతున్నారో ఎప్పుడైనా లెక్క వేశారా? ఎందుకేస్తారూ? రేపు సంపాదించిపెడతాడు కదా అని."

"ఏడిశావులే! ఎవరన్నారని నువ్వు యిప్పుడు అలా అనటం? మాకు కొడుకైనా కూతురైనా ఒకటే."

"అవునులే యిద్దరు ఒకటే! నాకు తెలియదూ. మొన్న చీరకోసమంటే ఏమన్నావ్? యింట్లోవుండే ఆడముండకు కూడా మంచి బట్టలే కావాలంటే ఎట్లా, వాడు బట్టలు లేవని వ్రాశాడా? వాడికో 100 రూపాయలైనా వుంటేగాని నాలుగు బట్టలు రావు. అనలేదూ? నాకేగాని నాలుగు రోజులు జ్వరంవొస్తే యింట్లో వుంటుంది తమాషా, అప్పుడు పనికి మనిషి కావాలి, పిల్లను ఎత్తుకుంటానికి ఒక నౌకరు కావాలి. యింతమంది వున్నా నాన్నకు టైముకు వంట అవదుగా!"

"చాల్లే కట్టిపెట్టు నీ వాగుడు. నాన్న వొచ్చినట్లున్నారు. తలుపు తియ్యి."

"శారదా.....చిన్నా.....తలుపు.... తలుపు"

"వస్తున్నా నాన్నా."

* * *

"ఏరా శంకరం ఏమిటి ఆలోచిస్తున్నావ్."

"ఏంలేదు! యిందాకటి విషయమే."

"కాదు. మన డాబామీదనుండి మనం

పిళ్లారిశెట్టి
అహల్యాదేవి

చూసుకుంటాం. వాడి కెందుకంట? మర్యాద కలవాళ్ళట! అవుతే మనమే తక్కువవాళ్ళ మన్నమాట!"

"మనలో మనమాట కాని శంకరం, కాలేజీవున్న రోజుల్లోగూడా బడి ఎగేసి పిట్టగోడమీద కూర్చొని వుంటావ్. మరి వాళ్ళన్నిటికీ దొడ్లోకే రావాలికదా! వాళ్ళకు కష్టంకాదూ!"

"మన యింట్లో మనం కూర్చొన్నాం కాని వాళ్ళయింటిలోకి వెళ్ళలేదుగా!"

"యింక అలా అంటే నేను చెప్ప లేనురా!"

"నీకెందుకు నువ్వూరుకో, వారం రోజుల్లో యిక్కడనుంచి వాళ్ళని లేవ గొట్టకుంటే నన్ను మారుపేరుపెట్టి పిలు! ఏం!"

"పోనిస్తూ వాళ్ళతో మనకేమిటి! అయినా ఏమిచేయాలనుకుంటున్నావ్. వాళ్ళనిక్కడ నుంచి లేవగొట్టడానికి?"

"నీకు చెప్పకూడదులే పదా టైమైంది కాలేజికి"......

* * *

"అయితే నువ్వు యింట్లో వున్నది వంట చేసి పెట్టడానికన్నమాట! ఆ ముండ దొడ్లో చేస్తున్న పనులేమన్నా చూస్తున్నావా? నీకు పిల బాధ్యత ఏమాత్రం లేనట్లుందే. యిట్లాంటి గొడవ లొస్తాయనే యింట్లో యింటికోసమని రోజూ తిరుగుతునే వున్నాను. కాని యింతవరకు ఏదీ కనిపించలే. యింక సెలవన్నా పెట్టి యింటి కోసం అఘోరించాలి."

"ఇంతకు మీ రనేదేమిటి"

"అనేదేమిటా? నీ కూతురు ఆ రౌడీ వెధవతో ఉత్తరప్రత్యుత్తరాలు నడుపుతోంది. ఇప్పుడైనా తెలిసిందా, యింకా లేదా! అసలదేది."

"ఏదో చెల్లెలొచ్చి తీసుకువెళ్ళింది."

"ఇంక దానిని బయటకు వెళ్ళనివ్వవద్దు."

"ఉత్తరాలు వ్రాసి ఎవరిచేత పంపిస్తుందంట? మన పిచ్చిగాని."

"ఏమో ఎవరిచేత పంపిస్తుందో నీకే తెలియాలి. పైకి ఏమీ ఎరగనట్టే వుంటారు! తూ...తూ...ఆడవాళ్ళని నమ్మకూడదు."

"మీ రనవసరంగా మాటనలకండి. అసలు విషయం చెప్పితే అదొచ్చాక అడుగుతాను."

"నిన్న డాబామీద ఈ ఉత్తరం దొరికింది. చదువు నీకే తెలుస్తుంది. నేను పోతున్నా, తలుపేసుకో."

"ఏరా! శంకరం! నువ్వన్నట్లు వాళ్ళు వెళ్ళిపోయార్రా! యింతకూ నువ్వు ఏమి చేశావురా!"

"వెళ్ళిపోయారు. పీడ వదలిపోయింది. యింతకి క్రొత్తవాళ్ళు ఎవరొస్తారో!"

"ఇంతకీ ఏమిచేశావో చెప్పరా తొందరగా!"

"చెప్తా ఆగు మరి. రోజూ ఆముసలి పీనుగ డాబాఎక్కి పచార్లు చేస్తుంటాడు. ఒక రోజున ఆయనక్రిందకు వంగి ఏదో కాయితముచూచి మళ్లా పారేశాడు. నాకప్పుడు ఒక ఆలోచన తట్టింది. ఆ అమ్మాయికి ఒక ఉత్తరం వ్రాసినట్లు వ్రాసి పడేస్తే వాడు వచ్చినప్పుడుచూసి యీ యింటిలోవుంటే ఇంక తనకూతురు మానం దక్కదనిఇల్లుఖాళీ చేసిపోతాడని ఆపని చేశాను. తెలిసిందా!"

"ఒలేవాడివోయ్ యింతకీ ఏమని వ్రాశావేమిటి?"

"విను. ప్రియమైన శారదకు,
నువ్వు వ్రాసిన వుత్తరం చేరింది.
నువ్వువ్రాసినట్లు దొడ్డిగుమ్మం దగ్గర కొస్తాను. తలుపు తీస్తావుకదూ? ఇట్లు...నీ జగన్నాథం"

"జగన్నాథం ఎవరోయ్?"

"అసలు పేరువ్రాస్తే కొంప మునగదూ? అందుకనే మారుపేరు వ్రాశాను."

"ఇంతకీ పాపం ఆ అమ్మాయికి అనవసరంగా మచ్చ వచ్చింది. మనకీ అక్కచెల్లెళ్ళు వున్నారు. ఆమాత్రం తెలియదురా"

"చాల్లే నీవేదాంతం వినలేక చస్తున్నా! పద ఎక్కడికన్నా పోదాం" ☆

కళ్ళజోడు

శారద

[తెర లేస్తుంది. నిర్మానుష్యమైన వీధి ఒకవేపు గౌరవనీయుల ఇళ్ళవరస. తెల్లని గోడలు. వాటిపై సినిమా పోస్టర్లు. వెల్తురు తక్కువగా, మసకమసకగా వుంటుంది. అకస్మాత్తుగా, ఎడంవేపునించి కేకలు వినపడతాయి. కుక్కలు మొరుగుతాయి. వెనువెంటనే ఒక వ్యక్తి రొప్పుతూ రోస్తూ పరుగెత్తుతూ వచ్చి కుడివేపు మాయమౌతాడు. ఆవెంటనే నలుగురు, చేతికి దొరికిన రోకలిబండ, బ్యాటరీలైటు, వసికర్రలూ పట్టుకుని స్టేజిమీదకు వస్తారు.]

పైజమా వ్యక్తి: (క్రాపు సర్దుకుంటూ) నలుగురం కలిసి, ఒక వెధవని పట్టుకోలేక పోయాం! వీరులమంటే మనమే మరి!

నెరిసినక్రాపుఆయన: (రొప్పుతూ) ఆ- ఇదేమన్నా అమెరికన్ క్రైమ్ సినిమా అనుకున్నావటోయ్ - టాక్సీలేసుకుని మైళ్లకు మైళ్ళు పరుగెత్తి పట్టుకోటానికి?

లుంగీవ్యక్తి: (బాటరీలైటు అన్నివేపులా ఫోకస్ చేసి) దొంగలకి ఎక్కడ దాక్కోవచ్చో ఎవరూ చూపించక్కరలేదయ్యా! ఆ అదుర్దాలోనే వాళ్ళకి అన్నీ తోస్తయి అనుకుంటా! అసలు ఎవరింటో పడ్డాడో వాడు? తెలుసా?

పైజమా వ్యక్తి: (నిదానంగా) మన సుబ్బయ్య పంతులుగారింటో!

నెరిసినక్రాపు: (హేళనగా) ఆయన ఇంట్లోనా దొంగతనం! ఆయన రాలేదేం? పొద్దుగూకేవేళ ఏం చేస్తున్నాడు దొంగ ఇంట్లో పడేదాకా?

పైజమా వ్యక్తి: నా కొక్క విషయం తల్చుకుంటే నవ్వొస్తున్నది! (నవ్వుతాడు)

స్టూడెంటు: ఏమిటది? అంత నవ్వొచ్చే విషయం?

నెరిసిన క్రాపు: (విరగబడి నవ్వుతూ) సుబ్బయ్యగారింటో ఏముంది బూడిద! రెండో కౌసు మాస్టరు! మున్సిపాలిటీవాళ్ళిచ్చే జీతం 32 రూ॥ సంసారానికి పోను దొంగలకేం మిగులుతుందా అని!

(ఎడంవేపునించీ సుబ్బయ్య పంతులుగారు వస్తాడు. బక్కచిక్కిన వ్యక్తి. నలుగురూ ఆయనకేసి విచిత్రంగా చూసి)

నలుగురూ: (ఒక్కసారే) ఏం ఎత్తుకు పోయాడు?

సుబ్బయ్యగారు: (తల గోక్కుంటూ) చెంబూ తప్పాలా లెక్కిస్తే కాని ఏం పోయిందో తేలదు మరి!

నెరిసిన క్రాపు: (నవ్వాపుకుంటూ) డబ్బేం పోలేదుకదా?

సుబ్బయ్యగారు: ఎబ్బే-అబద్ధం ఎందుకు చెప్పాలి? అసలు...డబ్బేం వుంది ఇంట్లో? చిల్లర డబ్బులు కూడా ఏ ఆవాల డబ్బాలోనో వుంటాయి.

(పైజమా ఆయనా, నెరిసిన జుట్టూ ఎడంవేపుగా నిదానంగా నడుస్తూ నవ్వుకుంటూ నిష్క్రమిస్తారు.)

లుంగీ ఆయన: సుబ్బయ్యగారు! దొంగ ఎట్లా వున్నాడో గుర్తుపట్టగలుగుతారా?

సుబ్బయ్యగారు: దొంగా? మనిషల్లే నే వున్నాడు. కుర్రాడే...(పక్కన వున్న స్టూడెంటును చూపుతూ) ఈ ఈడే వుంటాడనుకుంటా. నేను బాదం చెట్టు కింద నిల్చుని ఆకులు కోతాంగదా అని చూస్తున్నాను. దొడ్డి వాకిలిగుండా జొరబడ్డాడు గావును. ఏదోగిన్నె దొర్లిన చప్పుడయింది. మా ఆవిడ ఇంతలో మజ్జిగ పోయించుకుని లోపలికి పోయింది గావును, కేక పెట్టింది. నేను లోపలికి పరిగెత్తాను. వాడు అదే పరుగు వాకిలి వేపుగా. 'దొంగ దొంగ' అని అరిచాను. మీరంతా వాడి వెంటబడ్డారు. నేను, ముసలి వాణ్ణిగదా అండీ? నిదానంగా వచ్చాను. ఇంటికిపోయిచూడాలి, ఏంపోయి నదో.

స్టూడెంటు: పాపం! పడక పడక వాడు మీ యింట్లోనే పడాలా!

లుంగీ: అవును మరి! ఏముంది చెప్పండి? ఒక్క చెంబుపోయినా, ఈరోజున కొనే తాహతున్నా దా?

సుబ్బయ్యగారు: అంతేనాయనా మరి. చీకటిపడింది బాబు! పోదాం పదండి. ఈ హడావుడిలో కళ్ళజోడు ఎక్కడో పడి పోయింది. అదిలేందే నాకు కళ్లు కనపడవు. (స్టూడెంటు వంకతిరిగి) నాయనా, నీకు పుణ్యంవుంటుంది గాని నన్ను మాయింటికి చేర్చుతావా బాబు?

స్టూడెంటు: తప్పకుండా! పదండి. మా నాయనకికూడా కళ్ళజోడు లేందే కళ్ళు కనపడవు. చత్వారం అనుకుంటా.

[స్టూడెంటు సుబ్బయ్యగారి చెయ్యిపట్టుకుని నడిపిస్తూ లుంగీ ఆయన వెంటరాగా నిష్క్రమిస్తాడు.] (తెర)

2

[తెర లేవగానే పూరిల్లు. కోడిగుడ్డు లాంతరు పట్టుకుని సుబ్బయ్యగారి భార్య అన్నపూర్ణమ్మ వెతుకుతూ వుంటుంది. సుబ్బయ్యగారు, ఓమూల పీటమీదకూర్చుని ఆమె వేపు చూస్తూవుంటాడు.]

సుబ్బయ్యగారు: (ఆదుర్దాగా) ఏమీ దొరకలేదు గదా!

అన్నపూర్ణ: ఇక్కడేం వుంది వాడి బూడిద, పోవటానికి? అన్నీ చింకిపేతలూ, చిల్లిబొచ్చెలున్నూ, అవే ఎత్తుకెళ్లేవాడేమో గాని, నేను రానేవస్తిని. పారిపోయినాడు. ఈ సందట్లో ఆ పాతికరూపాయల కళ్ళజోడు పోగొట్టుకున్నారు గదా ఖర్మ! ఎక్కడని వెతకం?

సుబ్బయ్యగారు: (దిగులుగా) అది లేక పోతే ఎట్లానే గోల! రేపొద్దున్నే బడికి తగులడాలి గదా! బాక్ బోర్డేనా కనపడాలనా! ఆ పిల్ల వెంకల్ని గుర్తుపట్టాల్నా? ఎట్లా వచ్చేదే? పోయి దొడ్లో చూడు?

అన్న: (మరింత దిగులుగా) చూస్తా పోయి, దేవుడిదయవల్ల దొరికితే వొచ్చే శుక్రవారం కొబ్బరికాయ కొడ్తా. నిష్క్రమిస్తుంది, దీపంతో సహా.)

(ఐదు నిమిషాలకల్లా తిరిగొచ్చి.)

అన్న: ఇదిగోనండి...ఒక పక్క తీగ మాత్రం దొడ్డి గడపదగ్గర దొరికింది. మిగతాది ఎంతవెతికినా దొరకలేదు. పొద్దున్నే వెలుతురులో చూస్తే దొరుకుతుందేమో, లేవండి, భోజనానికి.

సుబ్బయ్యగారు: (విసుగ్గా) నాబొంద-నేను లేచేదెట్లా, తిండి తినేదెట్లా? కళ్ళు ఒకటే మసకగా ఏడుస్తుంటే! ఈ దొంగ ముండాకొడుకు వచ్చినవాడు ఏ చెంబో ఎత్తుకుపోక నా కళ్ళజోడుకు తెచ్చాడేం తిప్పలు! ఖర్మ...ఖర్మ. (మెల్లగా తడుముకుంటూ లేవపోతాడు అన్నపూర్ణమ్మ ఆయన చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళి మరో పీటమీద కూర్చోపెట్టి విస్తరివేసి మంచినీళ్ళు పెడుతుంది)

సుబ్బయ్య: (తడుముకుంటూ) రేపయినా దొరికితే సరికాని - లేకపోతే మళ్ళీ కొనాలంటే నెలజీతం పెట్టాల్నె రామా! ఏం జీవితం రా నాయనా!

అన్న: (జాలిగా భర్తముఖంలోకి చూస్తూ) అబ్బాయికి ఉత్తరం వ్రాస్తే ఏమన్నా పంపడూ? మీరు ఊరికే దిగులు పడకండి. (అన్నం వడ్డిస్తూ) తినండి. అదిగో చింతకాయ పచ్చడి...నెయ్యి అయిపోయింది.

సుబ్బయ: అబ్బాయి! వాడొక దౌర్భాగ్యుడు. చదవరా నాయనా, మేం ఎట్లాగో కడుపు కట్టుకుని చదివిస్తాంరా అంటే వినక గాడెద్దులాగా తిరిగి, ఇప్పుడు ఆ కాఫీ హోటల్లో పోయి పొగలో కూడి చస్తున్నాడు, వాడు నాకు పంపించటం సరే - నేనా సరే.

అన్నపూర్ణ: పోయిన నెలే గదండి పది రూపాయలు పంపించాడు?

సుబ్బయ్యగారు: ఆర్నెల్లు వెతుక్కుంటే పది రూ॥ పంపించాడు నీ ముద్దుకొడుకు. ఛా ఛా...ఎక్కడి కొడుకులూ ఎక్కడి తండ్రులూ! కొడుకులు తండ్రుల్ని పోషించటం అదీ వెనకటి కాలమేపిచ్చి మొహమా! చస్తే కొరివి పెట్టటమే చోద్యంగా వుంది ఈ కాలంలో!

అన్న: (విరక్తిగా) మీదిమరీ విచిత్రమండీ! మజ్జిగ పొయ్యనా?

సుబ్బయ్య: పొయ్యి.

(తెర)

3

(సుబ్బయ్యగారి ఇంటి అరుగు. ఉదయం 7 గంటలవుతోంది. సుబ్బయ్యగారు అరుగుమీద కూర్చుని కూన్యంగా చూస్తూ వుంటాడు. స్నానంచేసి విభూతి పెట్టుకుని వుంటాడు.)

అన్నపూర్ణమ్మ: (లోపల్నించి బైటకి వచ్చి) ఏ కుర్రాడికన్నా చెప్పి కలవచీటి పంపించండి. నేనూ ఇల్లంతా వెతికాను. దొడ్డంతా గాలించాను. కళ్ళజోడు కనపడనే లేదు!

సుబ్బ: ఏడ్చినట్టే వుందికథ. ఆ హెడ్ మాస్టరు వొప్పుకు చావడు గదా! వాడి దగ్గిర చివాట్లు తినాలి. తప్పేదేముంది. అనుభవించాలి. పక్క ఇంటి వున్నయ్య గారి అబ్బాయినిపిలు. చెప్పిపంపుతా.

(అన్నపూర్ణమ్మ నిష్క్రమించి రెండు నిముషాల్లో ఒక 14 ఏళ్ళ కుర్రాడితో సహా



కుసుమ కోమలి

చిత్రకారుడు: ఆర్. వి. చిన్నారావు, (దాక్షారామ)

ప కే జో తం

వొస్తుంది. కుర్రాడి చేతిలో పలక పుస్తకాలూ వుంటాయి.)

కుర్రాడు: (సవినయంగా) ఏమిటండి మాస్టారు?

సుబ్బయ్యగారు: (శూన్యంగా చూస్తూ) ఎవరు నాయనా, ప్రసాదమా? ఇవ్వాళ నాకు జ్వరంగా వుంది. బడికిరాను అని హెడ్ మేస్టర్ గారితో చెబుతావ్ కాస్త?

ప్రసాదం: చెబుతానండి. చీటి రాసియ్యండి ఇచ్చేస్తాను!

సుబ్బయ్యగారు: ఇప్పుడు రాయలేను నాయనా. నా కళ్ళజోడు ఎక్కడో పోయిందిరా. ఆమాటకూడా హెడ్మాస్టర్ గారితో చెప్పు. రాత్రి ఎవడో దొంగ మా యింటిమీద పడ్డాడు. ఆ కళ్ళజోడేమన్నా ఎత్తుకుపోయినాడో ఏమో! చెబుతావా మరి?

ప్రసాదం: చెబుతానండి. వెళ్తున్నా. (నిష్క్రమించును)

అన్నపూర్ణ: పండగ ఇంకో వారం వుంది. అమ్మాయిని తీసుకురావద్దటండీ? అల్లుడుకూడావస్తే బావుండును. పెళ్ళయినాక పిల్ల దాన్ని అక్కడికి పంపించాం; ఇంతవరకూ దాని అతీ గతీ కనుక్కోలేదు. సంక్రాంతి పండక్కన్నా దాన్ని తీసుకొచ్చి......

సుబ్బయ్యగారు: తీసుకొచ్చి, నెత్తిన పెట్టుకుని పూరేగు. ఒక్క రవికగుడ్డ పెట్టాలంటే టికానా లేదు ఇక్కడ. అల్లుణ్ని కూడా తెస్తావు? పంచెలచాపు కెక్కడ పోతావు? పండగఖర్చు కెక్కడ పోతావు? నామటుకు నేను, ఏగంగలోనో దిగి కళ్ళు మూసుకుంటాను. తీరిపోతుంది.

అన్న: ఏంమాటలండీ అవి? శుభమా అని నేనంటూవుంటే! ఇంతకీ దాన్ని ఈయేటికి తీసుకొచ్చే ఆలోచన లేదా ఏం చెప్పేసేయండి!

సుబ్బయ్య: (విరక్తిగా) ఎట్లా తీసుకువస్తావో కాస్త చెప్పవే. ఇవ్వాళ ఇంట్లో నెయ్యి లేదు, పప్పు లేదు అంటుంటివి! జీతం రావటానికింకా రెండు వారాలుందే! ఈలోగా ఓయ్యానికే ఆ అయ్యనీ, ఈ అమ్మనీ బతిమాలుకోవాలాయె! ఈ లక్షణంలో కూతుర్నీ అల్లుణ్ణీ తెచ్చి యింట్లో పెట్టుకుంటే, డొక్కలో తోటకూర పెడ్తావో పరమాన్నమే వండిపెడ్తావో, నీ ఇష్టం! నాదగ్గిర ఎర్రని ఏగానీ లేదు.

అన్న: ఊఁ...

సుబ్బయ్య: ఊఁ......అంటే సరిపోయిందా? నాని అప్పిచ్చేవా రెవరన్నా



పండు ముదుసలి

చిత్రకారుడు: ఆర్. వి. చిన్నారావు, (మద్రాసు)

★ కళ్ళజోడు ★

ఉన్నారా? ఇచ్చేవాళ్లెవరో ఇదివరకే యిచ్చారు; మళ్ళీ అడగను గూడా అడగటం లేదు. పలకరిస్తే మళ్ళీ ఎక్కడ అప్పు అడుగుతానో అని భయం!

అన్నపూర్ణ: ఈ పాఠం నేను కాపరానికి వచ్చింది లగాయతూ రోజూ వింటూనే వున్నాగా. మీ ఇష్టం బాబూ. నేను చెప్పలేను. అయినా నాదేం వుంది!

(అంటూ విసురుగా లోపలికి పోతుంది.)

సుబ్బయ్య: (విరక్తిగా పైకి) విన్నని లాభం ఏముందే? నా స్థితి అట్లా వుంది. (ఏదో స్ఫురణకొచ్చి) ఆ హెడ్‌మాస్టరు ఎన్ని తిడ్తున్నాడో...ఈ కళ్లజోడు దొరక లేదుకదా! రేపయినా, ఎవర్నన్నా అప్పయినా అడిగి ఒకటి తగలేసుకొస్తేనే ఈ జీవితం సక్రమంగా నడుస్తుంది......నెల రోజుల భత్యం...దీనికే సరి.

[తెర]

4

[సుబ్బయ్యగారి అల్లుడు రామారావు 26 ఏళ్ళవాడు. పొరుగూరులోనే ఒక షావుకారు గుమాస్తా. అతని భార్య 18 ఏళ్ల యువతి. ఆమె కోర్కెలు సగం సగం నెరవేరి - నెరవేరక, ఆమెలో పేరుకుని వుంటాయి. ఆమె అందగత్తె అనాలి. కాని, అది ఏ ఆభరణాలవల్లా శోభించేది కాదు, మంచి చీరెలయినా వుండవు.

రామారావు వుండే ఒకే ఒక్క గది. ఉదయం 8 గం॥ రామారావు బయిల్దేరుతూ వుండగా తెరలేస్తుంది.]

రామారావు: నువ్వు రోజూ కాఫీ అని ఇస్తున్నావే, ఒక విచిత్ర పానీయం, అది కాస్త తొందరగా ఇద్దూ కొట్లోకి వెళ్తాను.

శారద: (వెటకారంగా) మీరు "కాఫీ పొడి" అని తెస్తున్నారే ఒక అద్భుత చూర్ణం! దానిలోనుంచి దిగిన కషాయమే అది. నన్ను ఆడిపోసుకుని లాభమేమిటి?

రామా: యధార్థం మాట్లాడావు శారదా! మనబోటివాళ్ళు చవక చవక అని బజార్లో కొనేవన్నీ అట్లా నకలు సరకుగానే వుంటాయి మరి!

శార: ఇంటివాళ్ళు అద్దె అడిగివెళ్లారు! ఎప్పుడు వొదిలిస్తారు?

రామా: ఇవ్వాళే జీతం చూసి ఇస్తారు: సాయంత్రం అద్దె, బియ్యం, ఉప్పూ చింతపండు అన్నీ వొస్తాయి! వొక్క పూటలో మునిగిపోయేదేముంది?

శార: అవన్నీ వొస్తాయి సరే. నాకు రాత్రుళ్ళు చలి చంపుతోంది. ఒకదుప్పటి.

రామా: ఈనెలకి వీలుగాదు. జీతం లెఖ్ఖ వేస్తే నెల గ్రాసానికి సరిపోతుంది! ఇంక నీకు దుప్పటి, నాకు రెండో చొక్కా అన్నీ...

శార: అన్నీ - కలకాలం అలా కోర్కెలుగా నిలిచి, ఊరిస్తూ ఉండవల్సిందే గాదూ?

రామా: అంత అన్యాయం కాదనుకో. వొచ్చేనెల జీతం పెంచుతానన్నాడు మా షావుకారు. దుప్పటి కొనవచ్చు!

శార: ఆరునెలలనుంచీ ఇదే పాఠం!

రామా: కనీసం ఏ పాఠమైనా వొంటబట్టటానికి ఆరునెలలు పడ్తుంది మరి!

శార: నేను పోయి 'కాఫీ' రసాయనం తెస్తాను!

రామా: తొందరగా తెచ్చిపెట్టు. కొత్త వరాలు చెప్పినమాట వింటాయి.

[సారద వెళ్తుంది. పోస్టుమేన్ రెండు కార్డులు ఇంట్లోకి విసిరి వెళ్తాడు.]

రామా: (రెండూ తీసి అడ్రసులు చూస్తూ). శారదా! మీనాన్న ఓ ఉత్తరం, మీ అమ్మ ఒక ఉత్తరం వ్రాశారు. చదవనా?

[శారద కాఫీ గ్లాసు పట్టుకువచ్చి నిలబడుతుంది.]

రామా: ఒకే కార్డుమీద ఇద్దరూ వ్రాస్తే సరిపొయ్యేదానికి ఇంకో ముక్కానీ దండగ చేశారెందుకో...ఇది మీనాన్న వ్రాసింది.

"చిరంజీవి రామారావుకు మీ మామగారు అనేక ఆశీర్వాదములు చేసి వ్రాసుకొన్నదేమనగా;

మేము అంతా ఇక్కడ కులాసాగా ఉన్నాము. మీరు, అమ్మాయీ కులాసా అని భావిస్తాను. మొన్న మా యింట్లోకి దొంగవచ్చాడు. వాడికి అవకాశం లేక పోవటంవల్లనైతేనేమి, ఏదీఅందుబాటులో లేకపోవుటవల్లనైతేనేమి, నా కళ్లజోడు ఒక్కటే మాత్రం తస్కరించుకుని వెళ్ళినాడు. ఈ పండగకు మిమ్మల్నీ అమ్మాయినీ ఇక్కడకు తీసుకురావాలని ఎంతోగానో నాకు ఆశ ఉన్నప్పటికీన్నీ, ప్రస్తుతం నా కళ్ళజోడు కొత్తది కొనుక్కోవలసి ఉండటంవల్ల అది సాధ్యం కాలేదు, అంతేగాక, ఇప్పుడు కళ్ళజోడు కొనటానికే పైకం దొరక్క చాలా ఇబ్బంది పడుచున్నాను. దాని ఖరీదు 30 రూ॥ లన్నా వుంటుంది. అమ్మాయినడిగానని చెప్పండి. వెంటనే సమాధానం వ్రాయండి.

ఆ. సుబ్బయ్యపంతులు."

శారద: (బుంగమూతి పెట్టి దిగులుగా) నేనెంతో ఆశపడ్డా, ఈ సంక్రాంతికన్నా పుట్టింటికిపోదామని. ఆ దొంగవెధవ ఎవడో మాయింట్లోనే జొరబడాలా, నా దురదృష్టం కాకపోతేనూ! పాపం! నాన్నకి ఆ కళ్ళజోడు లేకపోతే కళ్ళు అసలు కనపడవండి! ఎట్లాగో ఏమో!

రామా: గోచీకన్న గొప్ప దరిద్రం వుంటుందా శారదా! మీనాన్నకి ఒక నెల జీతంతో ఆ కళ్ళజోడు వస్తుంది ... పాపం అల్లుణ్ని తీసుకొచ్చి అచ్చట్లు ముచ్చట్లు తీరుద్దామని ఆయన కెంతఆశగావుందో మరి! పోనీ నాదగ్గిర ఏదన్నా వుంటే ఆ కళ్ళజోడు కొనుక్కుని ఈనిమిషాన వెళ్లేవాడ్ని!

శారద: (కళ్ళనీళ్ళు పెట్టుకుని వెక్కుతూ, కొద్దిగా నవ్వుతూ) మీరెంతమంచివారండి! మాఅమ్మ ఏంరాసిందో అదీ చదవండి.


రామా: లేని త్యాగులకన్నా, ఉన్న మొండి మేలు అన్నారు శారదా! నాకు ఈక్షణాన ఈలోకంలో దరిద్రులందర్నీ బాగుచెయ్యాలని వుందికాని వీలే లేకుండా వుంది! మీఅమ్మ ఏంవ్రాసిందంటే -

"చిరంజీవి సౌభాగ్యవతి శారదకు మీఅమ్మ అనేక ఆశీర్వచనములుచేసి వ్రాసుకొన్నది ఏమనగా,:

సంక్రాంతిపండగ ఇంకా మూడురోజులే వున్నది. నువ్వూ అల్లుడుగారుకూడా ఒక రోజుముందే ఇక్కడకు రండి. అన్నయ్యకీ ఉత్తరం వ్రాశాను. వాడూ వొస్తాడు. కలో గంజో మాతోబాటే ఈ పండగ

(52-వ పేజీ చూడండి)





10

జిప్సీ యువతి ననుసరించాడు కవి. ఇద్దరూ కలిసి ఒక చిన్న గది ప్రవేశించారు. గదిలో వెచ్చగా వుంది. ఈ ఆశ్రయం అతడికి నచ్చింది. ఇంక ఆకలి తీర్చుకోడానికేదైనా ఆహారం, తరవాత సుందరితో ముచ్చటగా ప్రసంగిస్తూ గడపడంకంటె మించి కోరదగిందేదీ లేదనుకున్నాడు కవి. జరిగినదంతా ఇంద్రజాలంలా సుఖస్వప్నంలా ఉందతనికి. ఏ దేవతల కథలోనో తాను కథానాయకుడైనట్లు ఊహించుకున్నాడు. ఊహించుకోడమే కాదు నమ్ముతున్నాడు. భూలోకంనుంచి ఈ స్వర్గలోకంలోకి ఎలా వచ్చానా అని ఆలోచించసాగాడు. దేవతలు పంపిన దివ్యవిమానం ఎక్కడుందా అని చుట్టూచూశాడు. కాని అంతలోనే జేబుల్లో చేతులు పెట్టుకు చూసుకోగానే యథార్థంలో పడుతున్నాడు. కలకూ వాస్తవానికీ మధ్య కవి ఊగిసలాడుతున్నాడు.

జిప్సీ యువతిమాత్రం అతని ఉనికిని గమనించనట్లు ఉంది. గదిలో వస్తువులు సర్దుతూ అటూ ఇటూ తిరుగుతోంది. మధ్యమధ్య తన మేక 'డాలీ'తో మాట్లాడుతోంది. కొంతసేపైనతరవాత మేజా వద్ద ఒక కుర్చీలో కూర్చుంది. ఆమెను శ్రద్ధగా పరికించడానికి కవికి వీలు చిక్కింది.

చిన్నతనంలో సీతాకోకచిలుకల్ని వాటి రంగుల రెక్కల్ని తన్మయులై చూడ్డం అందరికీ సహజమే. అవి ఎగిరివచ్చి ఎగిరిపోతుంటే కౌతుకంతో చూస్తూ ఉండిపోతారు. ఒక పువ్వుపై వాలినిల్చి కొద్దిగా రెక్కలాడించినప్పుడు, అంతలోనే ఈ అందమైన స్వప్నం మాయమౌతుందేమో నన్నట్లు చూస్తారు. గ్రింగైర్ సరిగ్గా అదే తన్మయత్వంలో జిప్సీ సుందరిని చూడనారంభించాడు. ఆమెను చూస్తూవుంటే రాత్రి పాట, నృత్యం జ్ఞప్తికి వచ్చాయి. ఆమెను తదేకంగా చూస్తున్న గ్రింగైర్ ఊహాలోకంలో విహరించ నారభించాడు. "ఎమరాల్డా అంటే ఈ అలౌకిక సుందరే కాబోలు. అప్సరసలా ఉంది! ఈ సౌందర్యం ఊహాకందనిది. అయితేం! ఈమె కేవలం వీధుల్లో యాచనకై నృత్యంచేసే జిప్సీమాత్రమే! ఎంతచిత్రం! ఇవాళ రాత్రి నా ప్రాణాలు కాపాడింది ఈమే! నన్ను పెండ్లిచేసుకోడాని కంగీకరించిందంటే, నాపైన మక్కువ కలిగిందన్నమాట ఈ అపురూపసుందరికి! ఎంతవింత!" ఇంతలో ఏదో ఊహ తట్టింది. టిత అదిరిపడిలేచాడు "ఎంతవింత! ఎలా సంభవించిందో బోధపడదు. కాని ఇప్పుడీమె భర్తను నేను!"

ఈయోచనతో అతనికళ్లు తళతళ మెరిశాయి. ఆమెపై దృష్టి నిలిపి మెల్లిగా సమీపించాడు. ఆమె లేచి వెనుకంజ వేసింది? "ఏమిటి? ఏం కావాలి?" అని అడిగింది.

"అలా అడగవచ్చా నువ్వు?" అతని కంఠస్వరంలో నిగ్రహించలేని ఆవేశం ద్యోతకమయింది. తన కంఠధ్వని విని తనే చకితుడైనాడు.

జిప్సీ యువతి తన పెద్దకళ్లను మరింత పెద్దవిచేసి చూసింది! "అంటే? నాకు తెలియడంలేదు" అంది.

"అంటేనా? అంటే! తెలియదూ?" అని విస్తుపోయాడు. "నేను నీవాడిని కానా? నువ్వు నాదానవు కావా?" అంటూ ప్రీతితో ఆమె భుజంపైన మృదువుగా చెయ్యివేశాడు. కాని చేతి కానకుండా ఆమె భుజం మెల్లిగా జారింది. ప్రక్కకు తప్పుకుని చ్రువకై జారు తీసింది. ఆమె ముఖం ఎర్రబడి పోయింది. కన్నులు ఎర్ర

మూలం :
విక్టర్ హ్యూగో

అనువాదం :
సూరంపూడి సీతారామ్

ఘంటా రావం

సైనాయి. కోపంవల్ల ఆమె భుజాలు కిందికీ పైకీ ఊగుతున్నాయి. మేక ఆమెవద్ద నిలబడి కొమ్ములు చూపింది — అవసరమైతే పొడవడానికి సిద్ధంగా ఉంది. కవి నిశ్చేష్టుడైనాడు. జిప్సీ వంకా, మేకవంకా తెల్లబోయి చూశాడు. "అమ్మో! పులిపిల్లలల్లే ఉన్నారే?" అని గొణిగాడు.

"నీ కెంత పొగరు!" అంది జిప్సీయువతి రోషంతో.

"క్షమించాలి. కాని నన్ను భర్తగా ఎందుకెంచుకున్నావు?"

"లేకపోతే ఉరి తియ్యనియ్యాలనా?"

కవి ఆశాభంగం చెందాడు. నిట్టూర్పు విడిచాడు: "అయితే ఉరి తప్పించడమే తప్ప నన్ను పెళ్ళి చేసుకోడానికి మరో ఉద్దేశమే లేదా?"

"మరో ఉద్దేశం ఏముంటుంది నాకు?"

గ్రింగైర్ పెదవి కరుచుకున్నాడు. "ఇంతే నీ కర్మ!" అని తనను తాను నిందించుకున్నాడు. "ప్రేమ వ్యవహారాల్లో నువ్వూహించుకున్నంత తెలివి నీకు లేదు. ఇంతా చేస్తే ఆ కూజా ఎందుకు బ్రద్దలు కొట్టినట్టు?"

ఎమరాల్డా చేతిలో కైజారు అలాగే పొంచిఉంది. మేక కొమ్ములు కూడా గురిపెట్టే ఉన్నాయి. ఇది గమనించి గ్రింగైర్ ఇలా అన్నాడు:

"సరే అయితే! నీ ఉగ్రరూపం ఇంక ఉపసంహరించుకో ఎమరాల్డా! నువ్విలా కత్తి చేతబట్టుకుని ఉండిపోడం మంచిది కాదు. ఇది నగర శాసనాలకు విరుద్ధం. ఇలా కత్తి చేత్తో పట్టుకుని వీధుల్లో తిరిగినందుకు వారం రోజుల క్రిందట ఒకడికి జరిమానా విధించారు నీకు తెలుసుగా. అయినా అది కూడా నాకెందుకు? ఇకనించి నీ సమ్మతి లేనిదే నిన్ను తాకబోనని ప్రమాణంచేసి చెప్తున్నాను. కాని కాస్త రొట్టె ఉంటే పెట్టు; నీకు పుణ్యం ఉంటుంది."

వాస్తవానికి గ్రింగైర్ శృంగార వ్యవహారాలంటే అంత మోజు లేనివాడు. రాజవంశస్థులు, సైనికాధికారుల మాదిరిగా బలవంతాన యువతులను అపహరించేటంత మోహం, సాహసం అతనికి లేవు. ఇతర విషయాలలో మాదిరిగానే శృంగారంలో కూడా సాహస ప్రదర్శనకంటె సౌమ్యభావం మేలని అతని భావం. ప్రస్తుత పరిస్థితిలో సుందరి సమర్పించే ఆహారం నిమితంగా భుజించడం శ్రేష్ఠమని భావించాడు.

జిప్సీ జవాబివ్వలేదు. తలెగరవేసి బిగరగా నవ్వింది. చేతిలోని కైజారు మాయమయింది. ఆమె దానినెక్కడ, ఎలా దాచిందో కవికి తెలియలేదు.

క్షణంలో రొట్టె, మాంసం, పళ్లు, ఒక కూజానిండా మద్యం తెచ్చి మేజాపైన పెట్టింది. మోహమంతా ఒక్కసారిగా ఆకలిగా మారిపోయినట్లు కవి అతిలోభంతో గబగబ తిననారంభించాడు. జిప్సీ అతని కెదురుగా కూర్చుని అతన్ని పరికించసాగింది. మేక వచ్చి ఆమెవద్ద కూర్చుంది. జిప్సీ మధ్యమధ్య చిరునవ్వులతో ఏదో ఊహించుకుంటూ మేకను మోకాళ్ల మధ్య కూర్చోబెట్టి తల నిమురుతోంది. గదిలో కొవ్వొత్తిదీపం వెలుగు కదలాడుతోంది.

ఆకలిమంట కొంత చల్లారగానే పళ్లెరంవంక చూశాడు. అందులో ఒక్క పండు మాత్రం మిగిలివుంది. తన ఆలోచనలేమికి తనే సిగ్గుపడ్డాడు. "నువ్వేమీ తినవా ఎమరాల్డా?" అని అడిగాడు. జిప్సీ తల అడ్డంగా తిప్పింది. ఆమెగది కప్పువంక చూస్తూ యోచిస్తోంది.

"ఏమాలోచిస్తోందో?" అనుకున్నాడు గ్రింగైర్. ఆమె చూస్తున్న వైపు చూశాడు. అక్కడ వికృతమైన శిరస్సు ఆకారం ఒకటి చిత్రించబడి ఉంది. "ఆ వికృతమైన శిరస్సంటే ఆమె కిష్టమా? ఆ బొమ్మకంటె నేను మెరుగేకదా!" అనుకున్నాడు.

"ఎమరాల్డా!" అని పిలిచాడు. ఆమె పలకలేదు. మళ్లీ మరింత బిగ్గరగా పిలిచాడు. అయినా ఆమె వినిపించుకోలేదు. ఆమె మన స్సెక్కడో ఉంది. ఆమెను గ్రింగైర్ పిలుపు మేల్కొలుపలేక పోయింది. ఇంతలో మేక కదలనారంభించింది. ఆమె గౌను అంచులుపట్టి లాగడం మొదలుపెట్టింది.

"ఏంకావాలి?" అంది జిప్సీ, నిద్రనుంచి మేలుకున్నట్లు ఉలిక్కిపడి.

ప్రసంగావకాశానికి ఉత్సాహం కలిగింది కవికి. "దానికి ఆకలివేసింది." అన్నాడు.

ఎమరాల్డా చిన్న రొట్టెముక్క తీసుకుని నలిపింది. ఆమె అరచేతిలోనుంచే అందుకుని మేక తింటున్నది. తిరిగి ఆమె ఊహాస్వప్నంలో పడిపోకముందే అందుకున్నాడు గ్రింగైర్: "అయితే నన్ను భర్తగా అంగీకరించవన్నమాటేనా?"

జిప్సీ ఒకసారి అతనివంక పరీక్షగా చూసింది. "ఊహుఁ" అంది తల అడ్డంగా తిప్పుతూ.

"పోనీ ప్రియునిగా అంగీకరిస్తావా?"

జిప్సీ మూతి ముడుచుకుంది. "వీల్లేదు" అంది.

"పోనీ స్నేహితునిగా?"

మళ్లీ అతనిపై దృష్టి నిలిపి చూసింది. క్షణంసేపు ఆలోచించి అంది. "అదప్పుడే చెప్పలేను."

తత్త్వవేత్తలైనవారికి ఈమాట చాలు. దీనితో గ్రింగైర్‌కి ధైర్యం కలిగింది. "స్నేహంఅంటే ఏమిటో తెలుసా?"

"తెలుసు" అంది జిప్సీ. "స్నేహంఅంటే అన్నచెల్లెళ్ళవలె ఉండడం. అంటే మనస్సు లొక్కటికావు. రెండువేళ్లవలె ఒకదానికొకటి తాకుతూ ఉంటాయి అంతే."

"ప్రేమ అంటే?"

"ప్రేమా?" ఈమారు ఆమెమాటలో అనురాగం, కళ్లలో మెరుపూ గోచరించాయి. "మనస్సు లొకటై పోవడం. ఉండేది యిద్దరే. స్త్రీ, పురుషులు. ఇద్దరిమనస్సులూ ఏకమైతే దేవతలవుతారు."

ఈమాటలంటున్నప్పుడు జిప్సీసుందరి ముఖంలో మరింత సౌందర్యం కనపడింది. ఆమెవాక్కులోనూ, ముఖంలోనూ మాధుర్యం చిప్పిలుతున్నది. గులాబిరేకులవంటి ఆమె పెదవులపై చిరుహాస్యం తోచింది. ప్రశస్తమైన నుదుటిపై అప్పుడప్పుడు నీలిఛాయలు కనపడుతున్నాయి. రాఫేల్ ప్రశస్త చిత్రాలలో కన్య, మాతృమూర్తి, దేవకన్యల వర్చస్సులను ఒకేమారు స్ఫురింపచేసే ముఖబింబం ఆమెముఖంలో తోపింపచేసింది. కవి ముగ్ధుడైనాడు.

మెల్లిగా మళ్లీ అన్నాడు! "నిన్ను ఆకర్షించడానికి ఎలా ఉండాలి."

"మగవాడై ఉండాలి."

"మరి నే నెవర్ని?"

"అసలైన మగవాడికి చేతిలో కత్తిఉంటుంది. తలకొకశిరోష్ఠం ఉంటుంది. గుర్రంపై స్వారిచేస్తాడు."

"ఓహో! గుర్రం ఎక్కనివాడు మగవాడే కాడన్నమాట! సరే! అలాటి మగవా ళ్ళెవరి నేనా ప్రేమించావా నువ్వు?"

క్షణంసేపు ఆమె ధ్యాసలో మునిగింది. తరవాత మెల్లిగా అంది. "అదీ త్వరలోనే తెలుస్తుంది."

"నేను పనికిరానా?"

జిప్సీ అతనివంక నూటిగా చూసింది: "నన్ను రక్షించలేని మగవాణ్ని నే నెన్నడూ ప్రేమించలేను."

గ్రింగైర్ లజ్జపడ్డాడు. ఆమె తన నెత్తిపొడిచిందనుకున్నాడు. క్వాసిమోడో చేతులనుండి ఆమెను రక్షించడానికి తానుచేసిన ప్రయత్నం ఆమె మరిచిపోలేదనికూడా అనుకున్నాడు. అది జ్ఞప్తికి రాగానే నిస్పృహతో తలకొట్టుకున్నాడు: "మందమతినై పోయాను. ఆ సంగతి ముందే నిన్నడిగి ఉండవలసింది. క్వాసిమోడో చేతులనించి ఎలా తప్పించుకున్నావ్?"

ఈ సంఘటన గుర్తుకురాగానే జిప్సీ కంపించింది. "అబ్బ! గూనివా డెంత భయంకరంగా ఉన్నాడు!" అని రెండుచేతులతో ముఖం మూసుకుంది.

"భయంకరమే" అన్నాడు గ్రింగైర్. "కాని ఎలా తప్పించుకున్నావ్.?"

ఎమరాల్డా నవ్వింది. తరవాత నిట్టూర్పువిడిచి మౌనం వహించింది.

"అసలు నిన్నెందుకు పట్టుకున్నాడో తెలిసిందా?" అని మళ్ళీ అడిగాడు.

"తెలియదు. కాని నువ్వుకూడా నన్ను వెంటాడించావుగా! నువ్వెందుకు వెంటాడించావు?"

"అవును. నాకూ తెలియదు కారణం" అన్నాడు గ్రింగైర్.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉండిపోయారు. గ్రింగైర్‌కి ఏమీ తోచలేదు. జేబులో చాకుతీసి బల్లపైన గీరడం మొదలుపెట్టాడు. యువతి చిరునవ్వు నవ్వింది. ఆమె దూరపుచూపులకు గోడ అడ్డు నిలవలేదు. ఉన్నట్టుండి పాట మొదలుపెట్టింది. అంతలోనే ఆపివేసింది. ఆపి మేకను దగ్గరకు తీసుకొని గారంగా దాని ఒళ్లు దువ్వింది.

"మేక చక్కగా ఉంది" అన్నాడు గ్రింగైర్.

"ఇది నా చెల్లాయి."

"నీకు ఎమరాల్డా పేరెలా వచ్చింది?"

"నేను చెప్పలేను."

"అహం. నిజం చెప్పు."

ఎమరాల్డా జాకెట్‌లోపలినుంచి ఒక చిన్న సంచి తీసింది. అది మెడలోని పూసలహారానికి చివర కట్టబడిఉంది. అది పైకి తియ్యగానే కర్పూరపువాసన గుప్పున వచ్చింది. సంచి ఆకుపచ్చని పట్టుగుడ్డతో కుట్టినది. మూతివద్ద 'పచ్చ'ను పోలిన గాజుపూస ఒకటి ఉంది.

"ఈ పచ్చవల్ల నాకా పేరు పెట్టిఉంటారు" అంది జిప్సీ. [ఎమరాల్డా అంటే 'పచ్చ'.]

గ్రింగైర్ అది అందుకోడానికి చెయ్యి చాపాడు. ఆమె వెనక్కు లాక్కుంది. "ఇది ముట్టుకోకు. ఇది మంత్రించిపెట్టిన తాయెత్తు. ముట్టుకుంటే దీని మహత్తేనా పోతుంది. లేకపోతే నీకు ముప్పు కలుగుతుంది."

కవికి కుతూహలం అధికమయింది. "అది నీ కెవ రిచ్చారు?"

ఆమె పెదవులపై వేలుంచి వారించింది. తాయెత్తు దాచివేసింది. తిరిగి తిరిగి దానినిగురించి ప్రశ్నించాడు కాని ఆమె జవా బివ్వలేదు.

"ఎమరాల్డా అంటే ఆ పేరు నీ కెందుకొచ్చింది?"

"ఏమో నాకు తెలియదు."

"మీది ఏ భాష?"

"జిప్సీ."

"అయితే ఫ్రాన్సు నీ జన్మభూమి కాదన్నమాట."

"నాకు తెలియదు."

"నీ తలిదండ్రులు బ్రతికున్నారా?"

"మేము విహంగాలం! ఎవరి కెవరో! నా రెక్కలతోనే ఎగిరి సముద్రాలు దాటుతాను."

"నువ్వు ఫ్రాన్సు వచ్చేసరికి నీ వయస్సెంత?"

"చాల చిన్నతనంలో వచ్చాను."

"పారిస్ ఎప్పుడొచ్చావు?"

"నిరుడు."

ఈ ప్రసంగంతో గ్రింగైర్ ఉత్సాహవంతుడైనాడు.

"నీకు జోస్యం చెప్పడం వచ్చా?"

"రాదు" అంటూ ఆమె తిరిగి ఆలోచనల్లోపడింది.

"మహారాజు అంటే మీ జిప్సీలకందరికీ నాయకుడా?"

"అవును."

"మరి అతనే మనిద్దరికీ పెళ్ళిచేశాడే!"

మళ్ళీ ఆమె మూతి ముడుచుకుంది. ఆమె మూతి ముడుచుకున్నప్పుడల్లా గులాబీమొగ్గవలె కనపడుతుంది. అది కవికి చూడముచ్చటయింది.

"నాకు నీ పేరైనా తెలియదు." అంది ఎమరాల్డా.

(౫౮-వ పేజీ చూడుడు)



విజ్ఞాన వీధులు

"డాక్టర్"



157. భగవంతుడు కోరికలిస్తాడా? మహాత్తులు కల్పిస్తాడా?

అని చాలామంది అడుగుతున్నారు. నేను భగవంతుణ్ణి చూడలేదు. భగవంతుడి ఉనికినిగురించి నాకు అప్పుడప్పుడు సందేహము వస్తూంటుంది. కనక నా అనుభవములో చెప్పినది నిజము కాకపోవచ్చును. అయినా చెప్పమంటే నేను చెప్పే జవాబు ఇది "భగవంతుడికి ఇష్టమైతే కోరికలూ ఇస్తాడు, మహాత్తులూ కల్పిస్తాడు. ఇష్టము లేకపోతే చెయ్యడు."

శ్రీ రామకృష్ణపరమహంస అనుభవాలలో నాకు గుడ్డినమ్మకమున్నది. ఆయన కూడా ఈరీతిగానే సమాధానము చెప్పేరు. "కోరికలను ఇవ్వనూవచ్చును, ఇవ్వకపోనూ వచ్చును" అన్నారు. అందరి అనుభవమూ ఇలాంటిదే అనుకుంటాను. కొన్ని కోరికలు చెల్లవచ్చును, కొన్ని చెల్లకపోవచ్చును. అయితే కోరికలు కోరి ఫలమేమిటీ? అని అడుగుతారేమో! జవాబు చెప్తున్నాను వినండి. ఫలము మాట అటుంచి పరమార్థము మాత్రము కోరికలు కోరేవారి దారిలో ఉండదు.

ఒక కాపునకు ఇద్దరు కూతుళ్ళు. పెద్ద దాన్ని ఒక తోటమాలికీ, చిన్నదాన్ని ఇటుకలు చేసేవాడికీ ఇచ్చాడు. ఒకనాడు కూతుళ్లను చూతామని బైలుదేరాడు. పెద్ద కూతురన్నది. "రాజుగారి తోటలో నాటడానికి మొక్కలు తయారుచేశాము. వాన కురిస్తే ఆ మొక్కలన్నీ బ్రతుకుతాయి. లేదా మా కొంప కూలిపోతుంది." అని. కాపు బరువైన గుండెతో రెండో కూతురింటికి చేరాడు. ఆమె చెప్పింది: "రాజుగారి విహారమండపం నిర్మించడానికి ఇటుకలు అచ్చుకట్టేము. బట్ట తడుపు వర్షము పడినా మా కొంప కూలిపోతుంది" అని. కాపు భగవంతుణ్ణి తలుచుకుని చేతులు జోడించి అడిగేడు "ప్రభూ! నిన్నేమని కోరమంటావూ?" అని.

కనుక కోరికలు కోరనేవద్దు, కోరిన కోరికలు మీ మంచికే అని మీ కెలాగ తెలుసునూ? రామకృష్ణస్వామే ఇంకొక కథ చెప్పారు. ఒకడు అడవిలో వానలో తడిసి కల్పవృక్షపునీడకి వచ్చాడు. పొడి జాగా, వాని కోరికనుబట్టి మంచమూ, పరుపూ దుప్పటమూ దొరికేయి. వెచ్చగా కప్పుకుని పడుక్కుని 'ఇక్కడికి పులులు కూడా వస్తేనో?' అనుకున్నాడు. కల్పవృక్షమాయెను! పులులు వచ్చాయి. 'ఇవి మింగుతాయి గాబోలు' న్నాడు, మింగేయి.

కోరికలు మనిషికి 'శరీరమే నేను' అన్న అభిప్రాయాన్ని కలిగిస్తాయి. చచ్చేదాకా వెంటబెట్టి పాతాళానికి దింపుతాయి. కనక కోరికలు కోరకపోడమే మేలు.

ఇక 'మహాత్తులు కల్పిస్తాడా?' అన్న ప్రశ్నకి రామకృష్ణస్వామే చెప్పేరు: "తన కిష్టమైతే ఏదేనా చెయ్యగలడు. ఇంత సృష్టిని చెయ్యలేదా?" అని. ఆయన అర్చించే గుడి ధర్మకర్త వాదించాడట. భగవంతుడైతే మాత్రము? తాను కల్పించిన సూత్రాలకి విరుద్ధంగా చెయ్యగలడా? ఈ ఎర్రగన్నేరు చెట్టుకి తెల్ల పూవులు పూయించగలడా?" అని. రామకృష్ణస్వామి "తప్పక. ఆయన కిష్టమైతే ఈ గన్నేరు మొక్క తెలుపుకూడా పూయగలడు" అన్నారట.

కొన్నిరోజులైనతర్వాత ఆ గన్నేరు కొమ్మకే ఒక రెమ్మకి ఎర్రపూవూ, ఇంకొక రెమ్మకి తెల్లపూవూ పూచినవట. చిలిపి రామకృష్ణస్వామి ఆ రెంటినీ రెమ్మలతో తెంపి ఆ ధర్మకర్తకు చూపించినారట!

కాబట్టి తనకి కావలిస్తే భగవంతుడేదైనా చెయ్యగలడు. మనకి కావలసినది చేసినా చెయ్యవచ్చును, మానినా మానవచ్చును. జగత్తులో ప్రళయాలు వద్దంటే మానాయా? రమ్మంటే వస్తాయా?

ప్రార్థిస్తే కోరికల్ని తప్పక నెరవేర్చే భగవంతుడికీ నమ్మకమైన బంటుకీ తేడా యేమిటంటారూ? ఆయన బ్రతిమాలితే చేసే పని వీడు ఆజ్ఞాపిస్తే చేస్తాడు. ఈ లోకానికి సంబంధించిన, అంటే ఈ శరీరానికి సంబంధించిన కోరికలకోసము ప్రభువుని కష్టపెట్టడము ఎందుకూ? బంట్రోతుల్నే చెయ్యమనరాదూ? కల్పవృక్షాన్ని బొగ్గులకోసమూ ఆశ్రయించడమూ? అయితే ప్రార్థన ఎలాగుండాలీ? అది మీరు నిర్ణయించుకోవలసినది. నాకు "అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ. మృత్యోర్మా మమృతం గమయ."

—ఆస్తికుడు.

158. బిడ్డలు తలిదండ్రులను పోలవద్దా?"

"ఒకజంట. ఇద్దరూ ఎరుపే. వారి ఏకైక పుత్రుడు నలుపు. ఎందువల్ల?" అని రాజమండ్రినుంచి ఆకుల గంగావతి గారు అడుగుతున్నారు.

తల్లిదండ్రుల గుణాలు బిడ్డలకు ఎంత వరకూ సంక్రమించును? అనే సమస్యను విప్పుటకు మెండెల్ సన్యాసి ఒక రకపు శనగమొక్కలతో చేసిన ప్రయోగాలు చాల సహాయకారులు. ఆయన రెండు ప్రత్యేకరకాలశనగమొక్కలను - పొడుగూ పొట్టి రకాలందాము—పరాగసంపర్కము వల్ల కలిపేడు. పొడుగూ పొట్టీ కలిసిన మొక్కకి నాలుగు విత్తనాలు వస్తే మూడు పొడుగూ, ఒకటి పొట్టీ అయింది. వీటిని మళ్ళీ సరిగ్గా అలాంటి వాటితోనే కలిపితే, ఒకటిమాత్రము పొడుగు జాతిగానూ, ఒకటి పొట్టిగానూ తేలిపోయిందీ, మిగిలిన రెండూ సంకరములైనాయి. ఈ సంకరాలను సంకరాలతో నే

కలిపితే, ఒకటి పొడుగుజాతీ, ఒకటి పొట్టీ, రెండు మళ్లీ సంకరాలూ అయినాయి. అంటే ఏమిటి తేలిందీ, రెండు వేరురకాలు కలిపితే, మూడింటికి పై రెండిటిలోనూ ప్రముఖమైన గుణాలూ, ఒక్కదానికి తప్పకవగుణాలూ సంక్రమిస్తాయి. మూడింటిలో ఒకటిమాత్రమే కేవలము ప్రముఖ గుణమూ గలది. మిగిలిన రెండూ సంకర గుణాలు గలవి. వాటిలో వాటికి కలిపితే వచ్చే నాల్గింటిలో ఒకటి ప్రముఖమూ, ఒకటి అధమమూ, రెండు సంకరమూగా తేలతాయి.

మెండెల్ పైన చెప్పినట్లు నియమాను సారి సంపర్కమునేకాక సంకీర్ణ సంపర్కమునుకూడా కలిగించి చూచాడు. అనేక వింతరకాలు బయల్దేరాయి. మన మెట్ట తామరరకాలూ, చంద్రకాంతపు రకాలు చూడలేదా మీరు? ఒకేచెట్టుకి ఒక కొమ్మకి, ఎరుపూ పసుపూ పూలూ సగము ఎరుపూ సగము పసుపూ పూలూ పూస్తాయి. హాలెండులో ఈ సూత్రాన్ని అనుసరించి గిన్నె పూలను(*Bulbs*) ఎన్నో రకాల్ని కల్పించు కుంటున్నారు. ఆవులకి రకరకాల మచ్చల దూడలు పుట్టడం కూడా చూచిఉంటారు మీరు. కుక్కలరకాలు చెప్పనక్కరనే లేదు. ఇంగ్లండులో గౌరవర్ణముగల ఆవుకి ఏమూలనైనా మచ్చఉంటే అది సంకర జాతిది అనేస్తారు.

మనుష్యులలో నాయనమ్మల, మేనత్తల, పోలికలూ, తాతల, పినతండ్రుల పోలికలూ కూడా కనపడుతూంటాయి. రంగూ, పొడుగూ చక్కగా కనబడిపోయే పోలికలు. రంగూ పొడుగులలో తండ్రిని పోలిన ఒక ఆడపిల్ల దీటుగా చూస్తూంటే తల్లిని పోలడము చూచాను నేను. ఈపిల్ల పిల్లలలో ఈ మాపులపోలిక ఇంకా బాగా కనబడవచ్చును.

ఇంతకీ అన్నిటా తండ్రినిగాని తల్లిని గాని పోలినవారు లేరు. పోలికలేగాని పూర్తి సామరస్యముండదుకదా!

ఈ సూత్రము పశువులలో జాత్యభివృద్ధి కుపయోగించారు. సింహాళపుగోవు చాలా పాలిస్తుంది. ఒంగోలుఎద్దు చక్కగా పని చేస్తుంది. ఈ జాతులను కలిపితే కోడెదూడలు ఒంగోలు ఎడ్లనూ, పెయ్యలు సింహాళగోవులనూ పోలినవి. అయితే ఇదంతా మన ఇష్టమే కాదు. బెర్నార్డుషాకు ఒక కన్య జాబురాసిందట "నేను సుందరి నని అందరూ అంటున్నారూ, నీవు మేధావివీ, మనము వివాహమాడితే బిడ్డలకు నీ మేధస్సూ నా సౌందర్యమూ అలవడతవి" అని. ఆయన జవాబు రాశాడు "వారికి నీమేధస్సూ నాసౌందర్యమూ వీల రాకూడదా" అని. కాబట్టి మిశ్రగుణాలు వస్తా

యన్నదే నిజము. భారతీయ స్త్రీలకూ, ఆంగ్లపురుషులకూ కలిగిన సంతానముకంటె భారతపురుషులకూ ఆంగ్లస్త్రీలకూ గలిగిన సంతానము ఎక్కువ తెలివిచూపినదేమో! కారణము కూడా ఊహించలేనిదికాదు. సముద్రాలు దాటి మనదేశానికి ఉద్యోగాలకి వచ్చిన పురుషులూ, వారిని వివాహమాడిన స్త్రీలూ ఒక అంతస్థులోనివారే. ★





'తుదిబార'

(నీట మునిగిన వనిత)

దేవీ ప్రసాద్ రాయ్ చౌదరిగారి శిల్పానికి ఫొటో.

బొమ్మరిల్లు

కథ అడ్డంతిప్పిన కాకి

శ్రీనివాస కాశ్యప

అనగనగా ఒక అడవిలో
అల్లరి కాకొకటుండెను
ఆ కాకికి సాటి లేదు—
ఏ కాకియు ఈ భువిలో!

* * *

ఒకనాడొక చెట్టుమీద
ఒంటరిగా అది కూర్చొని
మాంస ఖండ మొక్కటి తన
ముక్కున కఱచుకొనుండీ!

* * *

ఇది అంతయు ఇకిలిస్తూ
నక్కొక్కటి కనుగొన్నది:
కాకిని మోసం చేసీ—
కాజేయా లనుకొన్నది:

* * *

"కాకిబావ! కాకిబావ!
విన్నావా ఈ వింతా!
కలదట నీకంటె బాగ
పాడగల మరొక్క కాకి!"

* * *

"లేదని నే నెంతెంతో
కష్టముతో వాదించీ
నీవద్దకు వచ్చినాను
ఏదీ ఒకపాట పాడు!"

అని కాకిని ఉబ్బేసీ—
ఆ మాంసపుముక్క కాస్త
ఆరగించ చూచిందీ
అతి తెలివితో నక్కబావ!

* * *

నక్కబావ జిత్తులన్ని
నాకుందరనా యనుకొని
కాలికింద ముక్కపెట్టి
"కాకా" యని పాడిందీ!

* * *

వేరె దారి దొరకక ఆ
నక్కబావ యోచించీ
"కాకిబావ! డాన్సింతో
చక్కగ జేస్తావట నే?
ఏదీ! ఒకసారి చేసి
నా కన్నుల కింపుగొల్పి
నాకు మోద మొసగెదవా?"

అని కాకిని అడిగిందీ!—
అని అడిగిన బావమాట
ఆలకించి కాకి యపుడు
ఆ మాంసపు ముక్క కాస్త
నోటబెట్టి ఆడిందీ!!

ఇంకొక యోచన బుర్రలో
ఇట్లె మెరిసె నక్కకపుడు:
బావా! "నీపాట, ఆట—
బాగుండట!" ఆడమనేను,

* *

అనినంతనె కాకిబావ
ఆ మాంసపు ముక్క తినీ
పాటయు, ఆటయు కలిపీ
పాడసాగె! ఆడసాగె!!

* *


తను వేసిన ఎత్తులన్ని
తారుమారు అవటంతో
తలగోకుచు వెళ్ళిందీ
తనదారిని నక్కబావ!

* *

చూచారా పాపాయిలు
మోసముచేయగ నెంచీ
తను త్రవ్విన గోతిలోన
తానే పడె నక్కబావ!

* *

మోసము చేయగ నెంచిన
మోసపోవుటయె గాక
కలిగిన కాస్తంత యశం
కరగిపోవు నుయిలాగే!!



2

హైడ్‌కొరకై అన్వేషణ

ఆనాటి సాయంకాలం అట్టర్సను తన ఇంటికి వచ్చాడు. అది బ్రహ్మచారి నివాసం. అట్టర్సను దీర్ఘాలోచనలో ఉన్నాడు. భోజనానికి కూర్చున్నాడు గాని తిండిమీద ధ్యాస లేదు. సామాన్యంగా ఆదివారంరాత్రి ఆయన భోజనం అయినతోడనే ఏదైనా భగవత్సంబంధమైన గ్రంథమొకటి తన బల్లమీద ఉంచుకొని నెగడు ప్రక్కనే వెచ్చగా పారాయణం చేస్తూ కూర్చుండడం అలవాటు. చేరువలో ఉన్న చర్చిలో రాత్రి 12 గంటలు కొట్టినతర్వాత నిద్ర పోవడం అలవాటు. కాని, యీ ఆదివారంనాటి రాత్రి భోజనానంతరం బల్లమీదిగిన్నెలు వగైరా తీసివేయబడినతోడనే, ఒక కొవ్వొత్తిదీపం చేతబట్టి తన కచేరీ గదిలోకి వెళ్లాడు. అక్కడ ఒక ఇనుపపెట్టెను తెరచి దానిలో అంతర్గర్భితంగా దాచియుంచబడిన ఒక దస్తావేజును పైకితీశాడు. "డాక్టరు జెకిల్ వీలునామా" అని ఆకవరుమీద వ్రాయబడి ఉంది. అందులో ఉన్న విషయములను అతిశ్రద్ధగా ఏకాగ్రచిత్తంతో పరిశీలించడం ప్రారంభించాడు. డాక్టరు జెకిల్ గారి ఈ వీలునామా యావత్తూ ఆయన స్వహస్తంతోనే వ్రాయబడింది. సదరు వీలునామాను తయారు చేయడంలో అతనికి అట్టర్సను కించిత్తయినా తోడ్పడలేదు కాని, తయారుచేయబడిన వీలునామాను తాను భద్రపరచి ఉంచుటకు మాత్రము ఒప్పుకొన్నాడు. హెన్రీ జెకిల్, యం. డి., డి. సి. యల్., యల్.యల్. డి., యఫ్. ఆర్. యస్., వగైరా గతించిన పక్షమున అతని ఆస్తులూ సొత్తులూ అన్నీ అతని "మిత్రుడున్నూ శ్రేయోభిలాషియున్నూ అయిన ఎడ్వర్డు హైడ్"కు సంక్రమించవలెను అని ఆ వీలునామాలో వ్రాయబడి ఉంది. అంతేకాదు. డాక్టరు జెకిల్ ఒకవేళ "మూడు నెలలకుమించి అదృశ్యుడైనపక్షంలో గాని, దురూహ్యమైన కారణాలవల్ల గైరుహాజరైన యెడలగాని," సదరు ఎడ్వర్డు హైడ్ అను నతడు డాక్టర్ జెకిల్ యింటిలోని కొందరికి యివ్వవలసిన కొన్ని స్వల్పమొత్తములను మాత్రం యిచ్చివేయవలసిన బాధ్యత తప్ప ఏయితర పూచీలు పేచీలు లేకుండా కించిత్తు కాలహరణం లేకుండా హెన్రీ జెకిల్ యొక్క స్థానే, ఆస్తికి సర్వాధికారి కావలెను. అని ఆవీలునామాలో వ్రాయబడి ఉన్నది. చిరకాలంనుంచీ అట్టర్సనుగారికి యీ వీలునామా అంటే కన్నెర్రగానే ఉంది. ఆయనయొక్క లాయరు తత్వానికి అది చాలా వెగటుగా ఉంది. అంతేకాదు. సాధారణమైన లోకమర్యాద పద్ధతులనుబట్టి కూడా ఆ వీలునామా ఆయనకు వెగటుగా ఉంది. వింత వెర్రి పోకడలుపోవడం ఆయనకు బేమర్యాదగా కన్పిస్తూ ఉంటుంది. ఇంతకాలంనుంచీ హైడ్ అంటే ఎవరో ఆయనకు తెలియకపోవడంవల్లనే ఆయనకు కడుపుమంటగా ఉండేది. ఇప్పుడు యీ హైడ్ సంగతి హఠాత్తుగా వెల్లడి పడుటవల్లనే ఆయన ద్వేషభావము మరింత హెచ్చింది. హైడ్ అంటే ఎవరో అజ్ఞాత పురుషుడనిన్నీ కల్పన అనిన్నీ ఆయనకు స్థిరాభిప్రాయం

మూలం: రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ ★ అనువాదం: దాసు వామనరావు

మనిషిలో మనిషి

వీర్పడింది. అందువల్లనే ఆయనకు అసహ్యం కలిగింది. ఇప్పుడు యీ హైడ్ అనబడేవాడు చాలా హేయలక్షణాలు కలవాడని తెలిసినతర్వాత అసహ్యం మరింత అధికమైంది. ఇదివరకు ఏవో ఊహాలు మేఘాలులాగున ఆయనకు హైడ్‌నుగురించి ఉండేవి. కాని యిప్పుడు కేవలము ఒక రాక్షసప్రకృతి ప్రత్యక్షమైనట్లుగా ఉంది అతని కండ్లముందు.

ఆ రోతకాగితాన్ని తిరిగి యినుపపెట్టెలో దాచివేస్తూ "ఇదంతా ఒక వెర్రి తరహా అనుకున్నాను. కాని, యిప్పుడిది కేవలము అవమానకరమైన వ్యవహారంఅని నాకు తోస్తోంది." అన్నాడు.

ఆ మాటలు తనలో అనుకొని, ఆ కొవ్వొత్తిని ఊది ఆర్పివేసి; పెద్ద బురఖాకోటు తొడుగుకొని, కావెండిష్‌స్క్వేరు వైపు బయలుదేరాడు. అక్కడ ఇతని స్నేహితుడైన డాక్టరు లాన్యనుగారియిల్లు ఉంది. ఆయనవద్దకు వచ్చేరోగులు అందరూ అక్కడికేవస్తారు. "ఈ విషయంగురించి ఎవరికైనా తెలిసిఉంటే, లాన్యనుకు మాత్రమే తెలియాలి" అని తనలో తాను అనుకున్నాడు.

అక్కడికి వెళ్లగానే అక్కడఉండే బట్లరు ఆయనను గుర్తుపట్టి లోపలికి దయచేయండి అన్నాడు. అనవసరమైన కాలహరణం చేయకుండా, వాకిలి గుమ్మంనుంచి నరాసరి భోజనంచేసే గదిలోనికి తీసికొని వెళ్లాడు. అక్కడ డాక్టరు లాన్యనుగారు ద్రాక్షారసం స్వీకరిస్తూ ఒంటరిగా కుర్చీలో కూర్చున్నాడు. మనిషి సదయహృదయుడు, సరసుడు. ఎర్రని మొగం- తొందరగా నెరిసినవెండ్రుకలు తలనిండా ఉన్నాయి. సందడి మనిషి—ఖండితంగా మాట్లాడుతాడు. అట్టర్సను లోపలికి రాగానే, తన కుర్చీలోనుంచి తటాలున లేచి రెండుచేతులతో ఆయనకు ఆదరణగా స్వాగతమిచ్చాడు. మనిషియొక్క ఆదరణచూస్తే నాటకం చూసినట్లుంటుంది--కాని, హృదయంలోనుంచి వచ్చిన నిజమైన ఆదరణ అది.

వీరిద్దరూ పాత స్నేహితులు. స్కూలులోను కాలేజీలోను కలిసి చదువుకొన్నారు. ఉభయులూ ఆత్మగౌరవం అన్యోన్యగౌరవం కలవారు. అంతేగాక, ఇద్దరూ సమావేశమైనప్పుడు ఒకరినిచూస్తే ఇంకొక ప్రాణం లేచివచ్చినట్లుగా చాలా సరదాగా కాలక్షేపం చేస్తారు.

మొదట్లో కొంత ఇష్టాగోష్ఠి జరిగిన తర్వాత లాయరుగారు తన మనస్సును కలవరపెట్టుతున్న అసలు విషయాన్ని ప్రారంభించారు.

"హెన్రీజెకిల్‌కు ఉన్నటువంటి ఆ బాల్యమిత్రులలో మన మిద్దరమూ అతి పురాతన వృద్ధమిత్రులమని నా అభిప్రాయం-ఏమంటావు లాన్యన్?"అని అట్టర్సను ప్రస్తావించాడు.

"ఈ పాతమిత్రులు పడుచువాళ్లయితే బాగుండునని నా కోరిక - మనం అట్లాగే ఉన్నామనుకుంటాను - అయితే సరేగాని, ఆ సంగతెందుకు? ఇప్పుడు అతను కంటికి కన్పించడంలేదే!" అని డాక్టరు లాన్యను అన్నాడు.

అట్టర్సను ఆ మాట విని, "నిజంగా! మీ కిద్దరికీ అన్యోన్యాను బంధం చాలాఉన్నదని అనుకుంటున్నానే!" అన్నాడు.

"మా కిద్దరికీ అన్యోన్యాను బంధం చాలాఉన్న మాట నిజమే. హెన్రీ జెకిల్ నాతో ఖులాసాగా మాట్లాడి ఇప్పటికి పదేండ్లకుపైగా అయింది. అతని కేదో బుద్ధి పెడత్రోవల పట్టింది. ఏదో పాతకాలపు స్నేహంవల్ల అతని విషయమై నేను వ్యాకుల పడుతూవచ్చాను కాని, ఆ మనిషి యిప్పుడు హుమ్‌కాకి అన్నట్లుగా ఆచూకీ చిక్కకుండా ఉన్నాడు. అతను చేసే అకటావికటపు పిడివాదాలమూలంగా ఎటువంటి పరమమిత్రులైనా పరాయివాళ్లవుతారు"అని డాక్టరు లాన్యను అన్నాడు.

ఈవిధంగా అతడు పెదవివిరుస్తూ జెకిల్ విషయంలో మాట్లాడినందువల్ల అట్టర్సనుకు కొంతవరకు సేదతీరినట్లుగాఉంది. వారిద్దరికీ శాస్త్రవిషయ చర్చలోనే ఏదో భేదాభిప్రాయం కలిగిఉంటుందని అట్టర్సను అనుకొన్నాడు. అటువంటి శాస్త్రసంబంధమైన రగడలో అట్టర్సను ఆసక్తికలవాడు కాదు. అందువల్ల "అంతకంటె అప్రాచ్యమైన విషయం మరేమి లేదు కదా?" అని అట్టర్సను తలఊపుతూ అన్నాడు. తన

మిత్రుడైన డాక్టరు లాన్యను కొంచెం సంబాళించుకొనేటందుకు కొలదిక్షణముల వ్యవధియిచ్చి తాను వచ్చిన అసలు పనినిగూర్చి ప్రస్తావన సాగించాడు.

"అతని ఆప్తాభిమాని 'హైడ్' అనే పెద్దమనిషినిగూర్చి మీకు ఏమైనా తెలుసునా?" అని ప్రశ్నించాడు.

"హైడ్ ఏమిటి? నేనెప్పుడూ వినలేదే! నేను పుట్టినతర్వాత ఆపేరు వినలేదు"అని లాన్యను బదులు చెప్పాడు.

ఈ స్వల్ప సంజాయిషీ మాత్రమే అట్టర్సనుకు లభించింది. దానితోనే అట్టర్సను తిరిగి తన మకామునకు తానుచేరి తన పడకమీద పరుండి పరిపరి విధాలుగా ఆలోచిస్తూ, తూర్పు తెల్లవారేవరకు ఇటుఅటు దొర్లుతూనే ఉన్నాడు. అతనిది అసలు తీరికలేని మెదడు- ఆ రాత్రిఅంతా ఏవేవో సందేహాలూ, ప్రశ్నపరంపరలూ అతని మనస్సును వేధిస్తూనే ఉన్నాయి.

అట్టర్సను యింటికి సమీపంగా ఉన్న పాదిరీ గుడిలో తెల్లవారుజామున ఆరుగంటలు కొట్టడం అతను విన్నాడు. కాని, అతని మనస్సును బాధిస్తున్న సమస్యను అతనింకామధిస్తూనేఉన్నాడు. ఇంత వరకూ ఈ విషయాన్ని వ్యవహార సరళిగా తర్కించాడు. కాని యిప్పుడు ఆ కధంతా విచిత్రగాధలాగున, అతని గదిలోని తెరమీద ఆడిన బొమ్మలాటవలె కన్పించింది. ఎన్ఫీల్డు చెప్పినదంతా కండ్లకు కట్టినట్లుగా ఉంది. రాత్రివేళ మహానగరంలో బారులుతీర్చిన దీపాలు- చకచకా నడిచిపోతున్న ఒక మనిషి ఆకారం— డాక్టరు యింటినుంచి పరుగెత్తికొని వస్తున్న ఒక ఆడపిల్ల-ఇద్దరూ ఢీకొట్టుకొనడం—జగన్నాథ రథంలాగున ఆ పిల్లను త్రొక్కుకుంటూపోవడం—ఆపిల్ల ఏడ్పులు లక్ష్యం చెయ్యకపోవడం—ఇవన్నీ అతని మనస్సులో మెదులుతున్నాయి. లేదా మంచి సంపన్నమైన ఒక యింట్లో ఒక చక్కని గదిలో తన మిత్రుడు నిద్ర

★ మనిషిలో మనిషి ★

పోతూ ఉండడం - ఏదో స్వప్న ప్రపంచంలో అతడు తనలో తాను నవ్వుకుంటూ ఉండడం; ఇంతలో అతని పడక గదితలుపు తెరచుకుని మరొక మనిషి అతని కళ్ళెదుట నిలువబడడం; ఆ మనిషి అభిమతానుసారం అట్టి అర్ధరాత్రివేళ కూడా మన మిత్రుడు విధేయుడై ప్రవర్తించడం—ఇవన్నీ అతని కళ్ళల్లో ఆడుతున్నట్లుగా కన్పిస్తున్నాయి.

ఈ రెండు ఘట్టాలలోనూ ఈ కథానాయకుడైన వ్యక్తి ఆ లాయరు మనస్సును రాత్రి అంతా వేధిస్తూనే ఉన్నాడు. ఎప్పుడైనా మధ్యలో కునికిపాట్లు పడినట్లయితే, ఆ నిద్రమత్తులో కూడా నిద్రాణభవనములగుండా దొంగచాటుగా మసలుచున్న మనిషి లీలగా కన్పిస్తూ ఉంటాడు. లేదా, ఇంకా గాఢంగా నిద్ర కళ్ళమీద తూగుతూవున్నట్లయితే, దీపాల వెల్తురులో మెలికలు తిరిగిన ఆ మహానగరవీధులలో ఏవీధివంక తిరిగినప్పటికీ, ఆడపిల్లను ఘోరంగా కాళ్ళ క్రింద త్రొక్కడం, ఏడుస్తున్న పిల్లను చూస్తూ విడిచి వెళ్ళడం—ఇవే దృశ్యాలు అతని తలలో తిరుగుతున్నాయి. ఆ నిద్రకళలో కూడా, ఆ స్వప్నావస్థలో కూడా, ఆ ఘోరపురుషుని ముఖం యిట్టిదనే ఊహ ఏమీ తట్టడంలేదు. అతడు ముఖంలేని ప్రముఖుడుగా ఉన్నాడు. అతడేదో అవాఙ్మనసగోచరుడుగా అగమ్యగోచరుడుగా అయోమయస్వరూపిగా ఉండి ఊహాతీతుడగుటవల్ల, హైడ్ ఎట్టివాడో ప్రత్యక్షంగా చూడవలెననే సంకల్పం లాయరుకు నానాటికి తీవ్రమైంది. ఒక్కపర్యాయము అతనిని కంటితో చూచినట్లయితే యీ అగమ్యగోచర వ్యవహారంలో ఉన్న తెరమరుగు అంతా తేటతెల్లమవుతుంది గదా అని మనస్సులో ఒకసారి అనుకున్నాడు. తన మిత్రుడు ఆమనిషియెడల అంతటి విచిత్ర విపరీత గాఢాభిమానం ఎందుకు కలిగియున్నాడో, తన మిత్రుని వీలునామాలో వింత విపరీతపరతు వాక్యాలు ఎందుకు ఉన్నాయో అదంతా కూడా చాలావరకు బోధపడగలదు. ఏమైనప్పటికీ ఆమనిషిముఖం ఒకసారి చూడవలసినదే—పొట్టకోసిచూచినా కించిత్తయినా దయా దాక్షిణ్యాం లేని మనిషిముఖం—ఎన్ఫీల్డుకు ఎక్కడలేని ద్వేషం అసహ్యం కలిగించినటువంటి మనిషిముఖం ఎట్లా ఉంటుందో ఒకసారి చూడదగినదే అని అట్టర్సను నిశ్చయించుకొన్నాడు.

అది మొదలుకొని షాపులూ, దుకాణాలతో కిక్కిరిసియున్న ఆ ప్రక్కసందులోని యింటిగుమ్మం వద్దకు తరచు వెళ్ళివస్తూ ఉన్నాడు. ఆఫీసులకు వెళ్లే వేళకు కొంచెంముందుగా ఆ యింటిగుమ్మంవద్దకు పోయిచూచేవాడు. వర్తకవ్యాపారం చురుకుగాజరిగే సమయంలో కూడా మధ్యాహ్నవేళ వెళ్లేవాడు. ఆ మహానగరంలో పొగమంచులో అర్ధరాత్రివేళ కూడా అక్కడికి వెళ్లేవాడు. ఎటువంటి ఏకాంత నిశ్శబ్ద నిర్జనసమయములలోనైనా, జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న రద్దీ సమయములలోనైనా, తాను శోధించదలచిన ప్రదేశానికి వేంచేస్తూ ఉండేవాడు.

"అతడు అంతర్ధానమయ్యే మానవుడైతే, నేను అతని అంతరార్థం గ్రహించే మానవుడను కావాలి" అని తన మనస్సులో అనుకున్నాడు.

ఏమైతేనేమి? చిట్టచివరకు అతనికృషి ఫలించింది—ఒకనాటి రాత్రివేళ అది. వీథులన్నీ ఖాళీచేసిన నాట్యమందిరముల లాగున ఉన్నాయి. వీథులలో దీపాలు ఆ నిశీథమందు గాలికి తూలక నిశ్చలంగా ఉన్నాయి. వీథివెంట నీడల్తూ వెలుగులూ ముగ్గులు తీర్చినట్లుగా ఉన్నాయి. రాత్రి పదిగంటల వేళప్పుడు ఆ ప్రక్కసందు అంతా నిర్మానుష్యంగా ఉంది. లండనునగరపు ఘోష నీరసించిన మూలుగు లాగున విన్పిస్తూనే ఉంది. అయినప్పటికీ ఆ సందు అంతా గుప్‌చప్‌గా ఉంది. చీమ చిటుక్కుమంటే వినబడుతూ ఉంది. ఇండ్లల్లో ఏకించిత్తు శబ్దం అయినప్పటికీ ఎంతో దూరం వినిపిస్తోంది. ఆ వీథిలోకి ఎవడైనా నడచివస్తున్నాడంటే, ఆ కాలిచప్పుడు అతడు అడుగుపెట్టకముందే ఆలకించవచ్చు. అట్టర్సను తన గస్తీపనిమీద అక్కడకు హాజరై కొన్ని నిమిషాలు గడిచాయి. అప్పుడొక అడుగుచప్పుడు విడ్డూరంగా వినిపించింది. కొన్ని దినాలనుంచీ యీవిధంగా ఒంటరిగా యీ వీథిలో రాత్రిళ్లు మాటువేసి తిరుగుతూ ఉండడం అట్టర్సనుకు అలవాటైంది. ఇటువంటి కాలి

చప్పుళ్లు అప్పుడప్పుడు అతను వింటూనే వచ్చాడు. ఆ లండనునగరపు అర్ధరాత్రి నిద్రగుర్రులో అట్టి అడుగులచప్పుడు, అసలు మనిషి కన్పించకపూర్వమే, అతనిచెవికి ఆచూకీ యిచ్చినట్లుగా వినిపించేది కాని, యీ పర్యాయము విన్పించిన బూట్సులచప్పుడు మాత్రము అతనిని "అవధరింపుడు" అన్నట్లుగా హెచ్చరించింది. ఈరాత్రి తన కృషి ఫలించగల దనే నమ్మకము అతనికి అప్రయత్నంగా కలిగింది. ఆ నమ్మకంతోనే ఆసందు మొదట్లోకి అట్టర్సను మెల్లిగా నడిచాడు.

ఆ సందులోనికి వస్తున్న మనిషి అడుగులు కొంచెం వడిగా వేశాడు. అడుగులచప్పుడు వీధికొనకు రాగానే మరింత పెద్దగా వినిపించాయి. సందు మొదట్లోకి లాయరువచ్చి నిల్చుండి చూచేసరికి తనతో వ్యవహార సంబంధండున్న ఆ మనిషి ఎటువంటివాడో బాగా చూచాడు. ఆ మనిషి పొట్టివిగ్రహం—సాదా దుస్తులలో ఉన్నాడు. అంత ఎదురుగా నిల్చుండి చూచినప్పటికీ ఆ మనిషి ఆకారం చూచేవానికి చూడ బుద్ధి అగుటలేదు. అయినప్పటికీ, ఆ గుమ్మం వైపుకు ముందంజవేశాడు. స్వగృహానికివచ్చి చేరుకొన్న యింటియజమానివలె జేబులోనుంచి తాళంచెవి తీశాడు.

అట్టర్సను కొంచెం ముందుకువచ్చి అతని బుజం మీద చెయ్యివేసి తట్టి "మీరే హైడ్ అనుకుంటాను-అవునా ?" అన్నాడు.

హైడ్ కొంచెం వెనుకకు జంకి, ఒక్కదమ్ముగాలి ఎగపీల్చాడు. అతని జంకు క్షణమాత్రమే కన్పించింది. లాయరు ముఖంవైపు అతడు తేరిపారచూడలేదు. గాని, "అదే నాపేరు. అయితే, మీకేంకావాలి?" అని ప్రశ్నించాడు.

"మీరు లోపలికి వాతున్నా రనుకుంటాను. నేను డాక్టరు జెకిల్‌కు స్నేహితుణ్ని - నాపేరు అట్టర్సన్ - గాంట్ వీధిలో నేను ఉండేది—నాపేరు మీరు వినిఉంటారు. ఇప్పుడు తీరికగా మన మిద్దరమూ కలిసికొనడం సంభవించింది కనుక నాకుకూడా లోనికి అనుజ్ఞ యిస్తారా ?"అని లాయరు అన్నాడు.

"డాక్టరు జెకిల్ మీ కిప్పుడు కన్పించడు—ఆయన ఇంట్లోలేడు" అని హైడ్ తన తాళంచెవిని ఊదుతూ అన్నాడు. అంతటితో ఊరుకొనక, తల పైకెత్తకుండానే, చివాలున యిలా అన్నాడు. "అయితే నన్ను మీరు ఎట్లా ఎరుగుదురు ?"

అప్పుడు అట్టర్సను యిలా అన్నాడు "మీరు మాత్రం నా కొక సహాయంచేయగలరా?"

"చిత్తం ! అభ్యంతరమేమిటి? అల్లాగే చేస్తాను. ఏమిటది మీకుకావలసింది" అని ఆ మనిషి ప్రశ్నించాడు.

"మీ ముఖం ఒకసారి నన్ను చూడనిస్తారా?" అని లాయరు అడిగినాడు.

హైడ్ కొంచెం సంకోచించినట్లుగా కన్పించాడు. కాని, అంతలో ఏమనుకున్నాడో, వెంటనే ఎదురు తిరిగి ధిక్కరించినట్లుగా, అట్టర్సను ముందర ముఖాముఖీ నిల్చున్నాడు. కొలది రెప్పపాట్లకాలం ఇద్దరూ ఒకరిముఖం ఇంకొకరు ఎగాదిగా చూచుకొన్నారు. "ఇక మీరు నాకు గుర్తుఉంటారు. ఎరుక ఎందుకైనా అక్కరకు వస్తుంది"అని అట్టర్సన్ అన్నాడు.

"అవును. మనం కలిసికొనడం మంచిపనే అయింది. ముందుగా నా అడ్రెసు మీవద్ద ఉండాలి" అని చెప్పి సోహో చౌకులోని ఒకవీధినెంబరు చెప్పాడు.

"ఏడిల్లు బంగారంగాను! వీలునామా సంగతివీడి బుర్రలోకూడా ఉన్నట్లుంది!"అని లాయరు తనలోతాను అనుకొని పైకి ఏమీఅనకుండా, అతడు తన అడ్రెసు చెప్పినందుకు "చిత్తం"అని గొణిగి ఊరకున్నాడు.

"అయితే, నాసంగతి మీకెట్లా తెలుసు? " అన్నాడు ఆమనిషి.

"మిమ్ములను గూర్చిన వర్ణనవల్ల" అని జవాబు యిచ్చాడు.

"ఎవరి వర్ణన ?"

"మనకు సమష్టి సంబంధంగల మిత్రులు ఉన్నారు" అని అట్టర్సను అన్నాడు.

"సమష్టిమిత్రులా ! ఎవరబ్బా వారు ?" అని హైడ్ బొంగురుపోయిన కంఠంతో అన్నాడు.

"ఉదాహరణకు కావాలంటే, జెకిల్ మన స్నేహితుడే" అన్నాడు లాయరు.

"అయితే అతడు నీకు నాసంగతి అంతా వర్ణించి ఎప్పుడూ చెప్పిఉండడు. అయితే మీరు అబద్ధ

(54-వ పేజీ చూడండి)

మా అమ్మ చదువు

ఒకరోజు మధ్యాహ్నం మా అమ్మ మా నాన్నగారితో అంది. "ఏమండీ ఈ సంవత్సరం నేను కూడా మెట్రిక్యులేషన్ పరీక్షకు చదువుతాను"

"ఎందుకు" అని అడిగారు మానాన్నగారు.

"ఎందుకేమిటి? నా ఫ్రెండ్సు అందరూ ఇంగ్లీషు వచ్చినవాళ్ళే. నాకే రాదు. రామ్మూర్తిగారిభార్య కూడా ఇప్పుడు నేర్చుకుంటున్నాది, ఏ. బి. సి. డీ. లు."

"నీకుమాత్రం రాదా? నీవు వాళ్ళలాగ పరీక్షకు కట్టకపోయినా నీకు ఇంగ్లీషు రాదని ఎవరూ అనుకోరు. ఎంత చదువుకోకుంటేమటుకు నీ తెలివి తేటలు వాళ్లకు వస్తాయా? అసలు కొత్తవాళ్లు నిన్ను చూసి నీకు ఇంగ్లీషువచ్చుననుకొని ఇంగ్లీషులోనే మాట్లాడతారు" అని మా నాన్నగారు అమ్మను పొగిడారు.

"మీ ఎగతాళి కేం లెండి. ఎప్పుడూ ఇంతే. నేను చదువుకోటం మీకు ఇష్టం వుంటేకదూ? అందుకే ఇలా అంటారు."

"సరే చదువుకో. నీవు చదువుకుంటానంటే నా కంతకంటె ఏం కావాలి."

ఆనూరాధ

"ఇప్పటికి ఎన్నిసార్లు అన్లేదు 'సరే. సరే.' అని; పుస్తకాలు తెచ్చిఇస్తేకదూ?"

"నీవు నిజంగా చదువుకుంటానంటే పుస్తకాలు కొనటం ఎంత సేపు? కాని నీకు పుస్తకం చేతిలోకి రాగానే కళ్ల మీదికి నిద్రవస్తుంది!"

"ఇకనుంచి ఎంత పట్టుదలగా చదువుతానో చూడండి"

"అయితే రేపు బజారుకు వెళ్ళి పుస్తకాలు కొందాం వస్తావా?"

"ఓ" అని హుషారుగా జవాబిచ్చింది మా అమ్మ.

రేపటివరకు కూడా ఆగకుండా సాయంత్రమే బజారుకు బయల్దేరింది మా అమ్మ. "ఇప్పుడేనా! రేపు వెళ్దామనుకున్నాంగా" అని మా నాన్నగారు అన్నారు.

"ఆఁ. ఈరోజు వున్నంత ఉత్సాహం రేపుండదు. ఇప్పుడే వెళ్దాం" అని తనే ముందు నడిచింది. తమాషా చూద్దాం అన్నట్లు మా నాన్నగారు బయల్దేరారు.

ఇంటికి పుస్తకాలతో వచ్చేటప్పటికి నాకు చాల ఆశ్చర్యం, సంతోషం ఒక్కమారే కలిగాయి; మా అమ్మ కూడా చదువుకుంటుందికదా అని. అసలు మా అమ్మ బజారుకు వెళ్లితే ఆవిడ మనస్సంతా బట్టలపైనే ఉంటుంది. అవి సూటు గుడ్డలైనా సరే, జాకెట్టు గుడ్డలైనా సరే. చీరలైతే ఇంక మా అమ్మ సంతోషం చెప్పనక్కరలేదు. అంతగా చేతిలో డబ్బు లేకపోతే ఆఖరికి ఒక పావు గజమైనా కొనుక్కుని రావాలి. అటువంటిది, ఆ రోజు పుస్తకాలు మాత్రమే కొనుక్కుని వచ్చింది. అవి ఆంధ్రా మెట్రిక్యులేషన్ ఎగ్జామినేషన్ పుస్తకాలు. అందుకని నేర్చుకోటం సులభం. అంతా తెలుగే-ఇంగ్లీషు ప్రోజు, పోయిట్రీ, నాన్‌డిటేల్డు మినహాయించి.

భోజనాల దగ్గర మా అమ్మ మెట్రిక్యులేషన్ టీచర్లను నిర్ణయించింది. మా నాన్నగారు ఇంగ్లీషు, లెక్కలు, చెప్పటానికి; నేను కాని మా చెల్లెలు సరస్వతి గాని హిందీ నేర్పటానికి; మా తమ్ముడు బాబు, మా రెండో చెల్లెలు లలిత వీళ్లు ప్రాక్టీసుకోసం ఇంగ్లీషులో మాట్లాడటానికి;

తప్పులుపోతే మా నాన్నగారు చెప్పాలి.

కాని మాఅమ్మ నాలుగురోజుల వరకు పనితీరగానే సైన్సు పుస్తకం మాత్రం చదువుతూ కూర్చునేది. నాకు నవ్వాపుకోవాలన్నా ఆగ లేదు. "అమ్మకు సైన్సులో ఫస్టు మార్కు వస్తుందినాన్నా" అన్నాను, నవ్వుతూ.

"మనఅమ్మ ఇంజనీరు కాబోతుంది" అన్నది సరస్వతి. "కాదు లేడి డక్టర్" అన్నాడు బాబు గర్వంగా.

లలిత కళ్లు తిప్పుతూ 'అమ్మ ఇవేమీ కాదు, నాన్నలాగ ప్రిన్సిపాల్ అవుతుంది' అన్నది.

"చూడండీ! ఈ కొంటెపిల్లలు నన్ను ఎలా ఎగతాళి చేస్తున్నారో? ఇందుకే నాకు చదవాలనిపించదు. వీళ్ళకు అసలు పెద్దవాళ్లంటే కొంచెమైనా భయ భక్తులు లేవు!" అని అమ్మ నాన్నగారితో ఫిర్యాదు చేసింది.

"అమ్మను అలా అనటం తప్పు కదూ" అని తీర్పు చెప్పారు నవ్వుతూ, నాన్నగారు.

"అవును. తప్పు. చాలాతప్పు. వేరీసారీ మై డియర్ మదర్" అని గుండీలు తీశాడు బాబు.


"తప్పు తప్పు" అని లలిత చెంపలు వాయించుకొంది.

వాళ్లు చేసిన పనికి అంతా నవ్వారు.

మరునటిరోజు నాన్నగారు అమ్మతో అన్నారు.

"ఎప్పుడూ సైన్సుమాత్రం చదువుతూ కూర్చుంటే మిగతా సబ్జెక్టు ఎప్పుడు చదువుతావు?"

"ఒకటయింతర్వాత ఇంకొకటి!!



"మన అమ్మ ఇంజనీరు కాబోతుంది" అన్నది సరస్వతి. "కాదు లేడీడక్టర్" అన్నాడు బాబు గర్వంగా.

★ మా అమ్మ చదువు ★

ఈ పుస్తకం చదవాలి, అని ఒక

"అలా కాదు. ఇన్ని నిమిషాలు టైంటేబిల్ తయారుచేసుకుని గడియారం దగ్గ రుంచుకొని రెండు గంటలు చదివితేచాలు."

"అలా అయితే భోజనాలు కాగానే ఇంగ్లీషుపాఠం చెప్పండి."

"నీవు నిద్ర పోవద్దూ"

"ఈరోజునుంచి నిద్రకు స్వస్తి."

భోజనాలైనతర్వాత నాన్నగారు ఇంగ్లీషు కథల పుస్తకం చిన్నది తీసుకుని వచ్చారు. మా అమ్మకు ఇంగ్లీషు, హిందీ కొంచెం కొంచెం వచ్చును. కాని ఉచ్చారణ సరిగా రాదు. అర్థం సరిగా తెలియదు. అమ్మ చదవటం మొదలెట్టింది. అది భారతంలోని కథ. "వన్స్ అపాన్ ఎ టైం దేర్ వాజ్ ఎ కింగ్ కాల్డ్ ధృతరాష్ట్రి"

"భలేగా చదివావ్. దొరసాని మాట్లాడినట్లు వుంది. సరే. అర్థం చెప్పు"

"ఒకానొకప్పుడు ధృతరాష్ట్రి అని ఒక రాజుండేవాడు"

"భలే. భేషుగ్గా చెప్పావు. నీకు ఇంగ్లీషు రాదని నువ్వే అనుకుంటావు. నీ స్నేహితురాం డ్రెవరైనా ఇంత బాగా చదవగలరా? ఊ. తర్వాత చదువు."

మాఅమ్మ ఉబ్బి తబ్బిబ్బైంది. ఇంకా హుషారుగా చదవటం మొదలెట్టింది. "హి వాజ్ ది అంకీల్ ఆఫ్ పాండవాస్."

"అంకీల్ కాదు. అంక్ ల్ అనాలి"

"ఆ. ఏమిటీ? అంకులా?"

'అంకులు కాదు పెంకులు కాదు. అంక్ ల్ అనాలి!"

"సరేలెండి. ఇప్పుడు నాకు నిద్ర వస్తున్నది. మీా పీరియడ్ అయిపోయింది. ఇక చాలు.

"ఇంకొంచెంసేపు చదువు. ఇలా

అయితే పరీక్షకు కట్టినట్లే.''

''ఆఁ. పరీక్షకు వెళ్ళకపోతే పీడాపోయింది. నేనిక చదవనంటే చదవను" అని హాయిగా గుబ్బు పెట్టి నిద్రపోయింది మాలమ్మ.

ఆతర్వాత ఇంకొకరోజు తప్పు లున్నా అర్థం తెలియకపోయినా హిందీపాఠం చెప్పమని నన్ను అడిగింది. తప్పులువుంటే చెప్పగలను కాని అర్థం నాక్కూడా సరిగ్గా తెలియదు"అన్నాను. "సరే, నీకు తెల్సినంతవరకే చెప్పు" అంది. హిందీపుస్తకం తెచ్చి అందులో ఒక పద్యం రాగంతో చదవటం మొదలెట్టింది.

'చహా నహీం ప్రేమీ మాలా మేంబిందాయాలీకోలల చాపూం'

'మళ్ళీ ఇంకొకసారి చదువు'

'చహానహీం'

'చహా నహీం కాదు చాహా పహీఁ'

'సరే. చాహానిహీఁ ప్రేమీ మాలామేం'

'మేంకాదు మే అనాలి.'

'సరే చాహాపహీఁ ప్రేమీ మాలామే బింధా మారీకో అల చాపూఁ.

"మారీకో లలచాపూంకాదు. ప్యారీకోలలచాపూఁఅనాలి. అసలు నువ్వు రాగంతో పాడకు. మామూలుగా చదువు."

"ఇది పద్యంకదూ, అందుకని రాగంతో చదవాలి!"

"బాగా వచ్చినతర్వాత రాగంతో పాడాలమ్మా"

"ఇప్పటినుంచీ రాగం ప్రాక్టీసు చెయ్యాలి"

"ఇలాచేస్తే నావల్ల కాదు నీకు నేర్పటం. ఇంకొక మాష్టరుచేత చెప్పించుకో."

"నేనంత అల్లరి చేస్తున్నానా? కొంటెపిల్లా?" అని నవ్వుతూఅంది.

(43-వ పేజీ చూడండి)



యానము

చిత్రకారుడు: ఎస్. వెంకటేశ్వరరావు, (గుడ్లవల్లేరు)

"గృహస్థాశ్రమములోని సౌఖ్యం ఎలా వుంటుందో చూడాలని వుంది" అని ఒక బ్రహ్మచారి అన్నాడు.

అది విన్న ఒక గృహస్థు "నాయనా! నీకేకాదు. నాకూ వుంది, అదెలా వుంటుందో చూడాలని" అని నిట్టూర్పు విడిచాడు.

—సి. బి. జగన్నాధరావు-కాకినాడ.

జాలిగుండె

అభిరాము డంటే అందరికీ హడల్. ఆ చుట్టుపట్లపల్లెల్లో గజదొంగ అని అతని పేరు మారుమ్రోగుతోంది. యముని బొమ్మను చూసేవుంటారు. అభిరాము డంటే అదే పోలిక అనుకోండి. కాని వూరూరా అతడ్ని గురించి చెప్పుకొనేటప్పుడు అనుకొనేవారు, "అతనిది జాలిగుండె" అని.

అభిరాముడు దొంగతనం చేశాడంటే ముందు హెచ్చరిక చేసేవాడట. కాని ఒక్కరూ అతన్ని పట్టుకొన్న పాపాన పోలేదు. అతన్ని గురించి పోలీసులకు యెన్నో రిపోర్టులు పోయాయి. వారూ విశ్వప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

ఒకనాడు నలుగురు పోలీసులు అభిరాముణ్ణి వెంబడించారు. ఎటు పారిపోవడానికీ పాలుపోలా అభిరాముడికి. సందులు,గొందులూ తిరిగి వారికంటబడకుండా ఒక గోడ దూకి ఒక యింట్లో దూరాడు. ఆ యింటిగోడకు పిడకలు కొట్టుతున్న యింటి ముసలామె దూకిన చప్పుడు విని అదిరిపడి "యెవ రక్కడ?" అన్నది. అభిరాముడికి గుండె నీరయింది. చేసేదిలేక అవ్వ దగ్గరకు పోయి "అవ్వా! నేను అభిరాముడనే దొంగను. నలుగురు పోలీసులు నన్ను తరుముకొచ్చారు. వారుచూడకుండా గోడయెక్కి యింట దూకేశాను. బైట వారు నాకోసం వెతుకుతున్నారు. యిప్పట్లో వారి బారినుండి నువ్వే నన్ను కాపాడాలి" అని ఆమె కాళ్లుపట్టుకున్నాడు. ఆ యవ్వ హృదయం కరుణతో ద్రవించింది. ఎలాగైనా ఆ శరణార్థుని

యం. అంకమరాజు

కాపాడాలని నిశ్చయించుకొన్నది. ఇదేసమయంలో పోలీసులు తలుపు తెరువమని దబదబా బాదారు. తటాలున ఆమెకొక యోచన తట్టింది. గాదిమూతతీసి అభిరాముణ్ని అందులో దింపి మళ్లీ మూత పెట్టింది.

తరువాత వెళ్లి తలుపుతీసింది. వెంటనే నలుగురు పోలీసులు లోనికొచ్చారు. ఆ నలుగురిలో ఆమె కొడుకున్నాడు. "అమ్మా! ఒక దొంగ లోనికి వచ్చాడు. చూశావా?" అని ప్రశ్నించాడు కొడుకు.

"నే నిక్కడనే ఉన్నాను. నాకు తెలిసి యెవ్వరు లోపలికి రాలేదు నాయనా"యని అవ్వ జవాబు చెప్పింది.

ఆరోజు రాత్రి డ్యూటీనుండి తిరిగి వచ్చాడు కొడుకు. భోజనంవద్ద కూర్చున్నప్పుడు తల్లి అడిగింది "నాయనా! యింకా యెన్నిదినములు నా కీ శ్రమ? ఏదో పెండ్లి చేసుకొని నీకూ నాలుగు కాయలు కాస్తే నేను కండ్లార చూద్దామనుకుంటున్నాను. నీవుమాత్రం యే చింతా లేనట్లున్నావు" అని నిష్ఠూరంగా అడిగింది.

"అమ్మా! అభిరాముడ్ని నేను పట్టానంటే నాకు తప్పకుండా సబ్ ఇన్‌స్పెక్టరుగా ప్రమోషనవుతుంది. అప్పుడు మనంకోరిన కోరికలన్నీ నెరవేరుతాయ్. లేకుంటే సవ్యంగా వుండదు" అన్నాడు కొడుకు.

"నీ యిష్టం నాయనా! నేను చెప్పాలిసింది చెప్పాను" అన్నది ముసలమ్మ.

ఇదంతా వింటూవున్న అభిరాముడు ఆమె దయార్ద్ర హృదయానికి విస్తుపోయాడు. ఉదయాన్నే ఆమె అతడ్ని జాగ్రత్తగా వెళ్ళమని చెప్పి విడిచిపెట్టింది.

మరునాడు ఉదయం పది గంటలైంది. ఊరూరా కొండనిప్పు ప్రాకినట్లు ప్రాకింది వార్త "అభిరాముడు పట్టుబడ్డాడని". ముసలామె "అయ్యో పాపం!" అని చింతించింది.

ఆరాత్రి భోజనమునకు వచ్చినపుడు కొడుకు సంతోషముతో

చెప్పాడు: "అమ్మా! అభిరాముడ్ని నేను పట్టేశాను. నాకు సబ్ ఇన్‌స్పెక్టరుగా ప్రమోషన్ వచ్చింది. యింక నీవు చెప్పినట్లు పెండ్లి చేసుకుంటాను."

కాని ఆ తల్లి హృదయంలో కొడుకు సబ్ యిన్‌స్పెక్టరయ్యాడనే సంతోషం ఒకప్రక్క, అభిరాముడు పట్టుబడ్డాడనే దుఃఖమొకప్రక్క పెల్లుబికినాయ్.

* * *

మరునాటి పుదయానికల్లా అభి

రాముడు జైలుకమ్మీలు వూడబెరికి వుడాయించాడని విని అందరూ నోర్లు నొక్కుకున్నారు. కాని ముసలామె మనస్సు తేలికపడింది. వంతోషంతో తిన్నెవద్దకు వచ్చి చూసేసరికి ఒక కాగితం కనపడ్డది. దానిని తీసి చూసేసరికి ఇలావుంది:

"ఆపద సమయంలో ఆదరించి కాపాడిన అమ్మగార్కి నమస్కారములు; ఇక్కడనుంచి వెళ్ళినది మొదలు నా మనస్సు మీకు ప్రత్యుపకారం చేయలేనందుకు తల్లడిల్లింది. నేను ఈ చిన్న ఉపకారం మాత్రం చేయగలిగాను. ఆ రాత్రి మీ కుమారుడు చెప్పినట్లు అతని చేతికే పట్టుబడి అతనికి ప్రమోషన్ ఇప్పించగలిగాను. ఇంక అతనికి మీ అభీష్టం ప్రకారం పెండ్లి చేయగలరని నమ్ముతున్నాను— మీ విధేయుడు అభిరాముడు." ★

సముద్రాప్తి

ఆంగ్లం : సుజిత్కుమార్ ముఖోపాధ్యాయ

అనువాదం : పి. ఎస్. గోపాల్

అశోక చక్రవర్తి బౌద్ధమత ప్రభావానికి లోనైన రోజులవి. బౌద్ధ భిక్షుకులను కేవలం భగవత్స్వరూపులని భావించి, వారు ఎదురైనప్పుడు సాష్టాంగ నమస్కారం చేసేవాడు చక్రవర్తి. పుట్టుపూర్వోత్తరాలు తెలియని భిక్షుకులకు, విశాలసామ్రాజ్యాన్ని పరిపాలించే అశోక చక్రవర్తి ఆవిధంగా నమస్కరించడం ఇష్టం లేకపోయింది కొందరు మంత్రులకి.

ఇలా వుండగా ఒకరోజున యశుడనే మంత్రి వుండబట్టలేక, "మహాప్రభూ; రాజాధిరాజులైన తమరు, హీనకులజులైన ఈ భిక్షుకులకు శిరస్సు వంచి నమస్కరించడం మాకే సిగ్గుగా వుంది" అన్నాడు. చక్రవర్తికి పట్టరానంత కోపం వచ్చింది ఈ మాటలు వినగానే. కాని ఆ కోపం పైకి ప్రకటించకుండా చరచరా నడచి వెళ్ళిపోయాడు.

కొద్ది రోజుల తరువాత తన మంత్రుల్ని పిలిచి "ఈరోజున రెండు వందల జంతువుల తలలు కావాలి. అందులో ఒక మనిషితల కూడా వుండాలి. ఎన్ని పనులున్నా మాని, ఈ పని ముందర చూడండి. వెళ్ళండి!" అని ఆజ్ఞాపించాడు. ఇలాంటి హిరణ్యాక్షవరాలకి అలవాటుపడ్డ మంత్రులు మారుమాటాడకుండా వెళ్ళిపోయారు.

మంత్రులు తెచ్చిన వివిధ మృగాల తలలు మంత్రులకి పంచి, వీటిని పట్టణవీధులలో ప్రజలకి అమ్ముకురండి అన్నాడు చక్రవర్తి. ఆవిధంగానే అందరు మంత్రులూ తమతమ వంతుకు వచ్చిన తలలు అమ్మి చక్రవర్తి దర్శనానికి వచ్చారు. కాని యశుడు మాత్రం తన వంతుకు వచ్చిన మనిషి తలని అమ్మలేకపోయాడు- భయపడుతూ చక్రవర్తి ఎదుట నిలబడ్డాడు యశుడు. తన వంతుకు వచ్చిన మనిషి తలని అమ్మలేకపోయానని కంపితస్వరంతో చెప్పాడు.

"ఒకవేళ ప్రజలు ఆ తలని డబ్బు చెల్లించి కొనడానికి సందేహిస్తే, ఊరికే ఇవ్వలేకపోయావా" అన్నాడు చక్రవర్తి.

యశుడు ఆ తలని తిరిగి రాజవీధికి తీసికెళ్ళి "ఈ తల కావలసినవాళ్ళు ఊరికేనే తీసుకోవచ్చు" అని ప్రకటించాడు. కాని ప్రజలు ఆ ప్రాంతానికేనా రాక, దూరదూరంగా తొలగిపోసాగారు. హతాశుడై యశుడు చక్రవర్తి దగ్గరకి వచ్చి—"ఆవుల, జింకల, మేకల, తోళ్ళతలలు ఎంతో ఉత్సాహంతో కొన్న ప్రజలు మనిషి తలని ఊరికే ఇచ్చినా తీసికోడానికి ఇష్టపడటం లేదు ప్రభూ" అన్నాడు.

ఎందుచేత? అన్నాడు చక్రవర్తి.

"దీన్ని చూడగానే భయం, రోత పుట్టించడంవల్ల."

"ఈ ఒక్క తలేనా, ఏ మనిషి తలైనా అంతేనా?"

"ఏ మనిషి తలైనా అంతే, ప్రభూ."

"నా తల?" అన్నాడు చక్రవర్తి మెలుకువలా.

యశుడు నిరుత్తరుడై నిలుచుండిపోయాడు. కాని చక్రవర్తి తిరిగి అదే ప్రశ్న వేశాడు.

"ప్రభూ, నేనా ప్రశ్నకి సమాధానం చెప్పడానికి సాహసించలేను" అన్నాడు యశుడు.

"యశా, నీవేమీ భయపడనక్కరలేదు. నీ ప్రాణాలకి అభయం

(42-వ పేజీ తరువాయి)

ఇస్తున్నా.—కాని నిజం మాత్రం చెప్పు."

ఇంకా భయంతో కంపిస్తూ, "సార్వభౌముని తలైనా జుగుప్సాకరమైనదే" అన్నాడు యశుడు.

అశోకుడు చిరునవ్వు నవ్వుతూ "ఊరికే ఇస్తామన్నా ఎవ్వరూ తీసికోని తలని ఒకరి పాదాలదగ్గర వంచడంచేత మహాపుణ్యం వస్తూంటే స్నేహితుడా, ఎందుకు సంకోచిస్తావ్. పతిత ప్రపంచాన్ని ఉద్ధరించడానికి జన్మించిన బౌద్ధభిక్షు కులమెంచనిమంచిని నీవు వాళ్ళపుట్టు పూర్వోత్తరాలనీ, జాతినీ ఎందుకు త్రవ్వుతావ్? ఉన్నత కులజుడవనే భ్రమలో కొట్టుకుంటూన్న నీవు అదే గర్వంతో నన్ను కూడా ఆ అంధకూపంలోనికి లాగటానికి ఎందుకు ప్రయత్నిస్తావ్. జాతి మత విభేదాలని నీతితో ముడిపెట్టడం అర్థంలేని మాట. మంచి అనేది మనుష్యుని హృదయంలో ప్రవేశించే ముందు నీ జాతి ఏది అని ప్రశ్నించే ప్రవేశిస్తుందా? మిత్రుడా ఉన్నతపదవి నలంకరించిన ఒక మంత్రిఅంతటివానికి, హోదా పేరిట చక్రవర్తిని ధర్మపథాన్నించి చ్యుతుణ్ణి గావించడం భావ్యం కాదు. కనుక మిత్రుడా, ఇకనైనా నన్నా అంధకూపంలోనికి లాగకు" అన్నాడు.

ఈ సంఘటన యశునిలో విపరీతమైన మార్పు తెచ్చింది. అప్పటి నుంచీ యశుడు బౌద్ధభిక్షువు లెదురైనపుడు అంజలి ఘటించేవాడు - అవనత శిరస్కుడై. ★

మా అమ్మ చదువు

(39-వ పేజీ తరువాయి)


ఆరోజు సాయంత్రం "పిల్లలూ నాపుస్తకాలు మాసిపోతున్నాయి. ఎవరైనా అట్టలు వేసిపెట్టండి" అని చెప్పింది.

"సరే. వేస్తానమ్మా" అని సరస్వతి జవాబిచ్చింది. రాత్రి అన్ని పుస్తకాలకి అట్టలువేసి వాటిపైన మాఅమ్మపేరు వ్రాసింది. బాబువచ్చి ఆపేరుక్రింద 'యం. బి. బి. యస్' అని వ్రాశాడు. లలితవచ్చి "మిసెస్ నాన్న, కాలేజి ప్రిన్సిపాల్" అని వ్రాసింది.

పుస్తకాలకు అట్టలు వేసినతర్వాత మాఅమ్మ ఇంతవరకు వాటిని మళ్ళీ చూడలేదు. "చదువుతావా అమ్మా" అని అడిగితే, "ఆఁ. ఇప్పుడెక్కడ. నాకు చాలా పని వుంది. తొందరగా వంటచేసి, భోజనంచేసి, కొంచెంసేపు నిద్రపోయి, సాయంత్రం బజారుకు వెళ్లి కూరలు తేవాలి" అనిగాని "గోపాలరావుగారింటికి వెళ్ళాలి" అనిగాని అంటుంది.

కొన్ని రోజు లయింతర్వాత "నువ్విక చదువుకోవా అమ్మా?" అని అడిగాను.

"ఆఁ. చదువు చట్టుబండలుగానే వుంది. అసలు నాకు తీరికఎక్కడే!" అంది. ★




ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి "పెంపుడుకొడుకు" లో సావిత్రి.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి "పెంపుడు కొడుకు" ఆంధ్రదేశంలో విడుదల అయింది. డైరెక్టరు ఎల్. వి. ప్రసాద్; మాటలు సదాశివబ్రహ్మం; పాటలు శ్రీశ్రీ, అనిశెట్టి, సదాశివబ్రహ్మం; సంగీతం రాజేశ్వరరావు; ఫొటోగ్రఫీ ఆది ఇరానీ; నటీనటులు పుష్పవల్లి, కుమారి, సావిత్రి, శ్రీరామమూర్తి, గణేశన్, రంగారావు, ప్రసాద్, మోహన్, సుధాకర్, సేతు మున్నగువారు. కథకు ఒక తమిళ నవల మూలం.

రంగస్వామి(ప్రసాద్) అనే పేదవాడికి ఇద్దరు కొడుకులు. రెండోవాడు పసివాడు.



"పెంపుడు కొడుకు" డైరెక్టరు
శ్రీ ఎల్. వి. ప్రసాద్



"పెంపుడు కొడుకు"లో ఆహ్లాదకరమైన నృత్యం చేస్తున్న కొత్తనటి పి. రాజసులోచన

భార్య మంగమ్మ (పుష్పవల్లి) ఆస్పత్రిలో జబ్బుగావుంది. భార్య బ్రతకదేమోనని భయపడిపసివాణ్ణి శోభాదేవి (కుమారి) అనే ధనికురాలికి పెంపకం యిస్తాడు. ఆమె పిల్లణ్ణి తీసుకుని వేలూరులో ప్రొఫెసరుగావున్న భర్త (రంగారావు) వద్దకు వెళ్లిపోతుంది. రంగస్వామి భార్యకు జబ్బు నయమై యింటికి తిరిగివచ్చి "రెండోవాడేడీ" అని అడుగుతుంది. సంగతి తెలుసుకుని పిల్లణ్ణి తిరిగి తీసుకురమ్మని భర్తను వేధిస్తుంది. రంగస్వామి వేలూరు వెళ్ళడానికి డబ్బు సంపాదించేందుకు ఒక యిల్లు కట్టడం పనిలో చేర్తాడు. ప్రమాదవశాత్తు యిల్లు కూలి చనిపోతాడు. మంగమ్మ పెద్దకొడుకు ముత్తణ్ణి వెంటబెట్టుకుని రెండో కొడుకును వెదికేందుకు వేలూరు వెళుతుంది. వేలూరులో ఒక ఆఫీసరు (ఆర్. నాగేశ్వరరావు) యింట్లో వంటలక్కగా చేరుతుంది. ఒకరోజున మళ్ళీ ప్రమాదవశాత్తే, ఆమె కాస్తున్న కాఫీలో బల్లి పడి, ఆ కాఫీ తాగిన ఆఫీసరు ఉంపుడుకత్తె (ఇందిరా ఆచారి) చనిపోతుంది. హత్యానేరం మోపబడి మంగమ్మ జైలుపాలవుతుంది. పెద్ద కొడుకు ఒక అచ్చాఫీసులో కుదురుకుని బుద్ధిమంతుడై మెలగుతూవుంటాడు.

ప్రొఫెసరు దంపతులు పెంచుతున్న రెండో కొడుకు మోహన్ తను ధనవంతుల బిడ్డ అనే భ్రమతో దుండగీడవుతాడు. వాడికీ, ముత్తడికీ విరోధం ఏర్పడుతుంది. పెద్దయిన తరవాతకూడా ముత్తడికీ (శ్రీరామమూర్తి) మోహన్‌కీ (గణేశన్) విరోధం సాగుతుంది. ఇద్దరూ గౌరి (సావిత్రి) అనే దాసీకన్యని ప్రేమించి వైరం పెంచుకుంటారు. మంగమ్మ జైలునుంచి తిరిగివచ్చి ప్రొఫెసరు యింట్లోనే పనిమనిషిగా చేరుతుంది. మోహన్ తన రెండో కొడుకేనని గ్రహిస్తుంది. ముత్తణ్ణి కూడా కలుసుకుంటుంది. అన్నదమ్ముల వైరం చూసి ఖేదపడుతుంది. కాని రహస్యం బయటపెట్టదు.

చివరికి ప్రొఫెసరుదంపతుల మాటలు చాటునించి విని మోహన్ తను వారి కొడుకు కానని తెలుసుకుని తన తలిదండ్రు లెవరో చెప్పమంటాడు. శోభాదేవి "మంగమ్మే నీ తల్లి" అని చెబుతుంది. అతడు పశ్చాత్తాపపడి తన తల్లిని, అన్ననూ క్షమాపణ వేడుకుంటాడు. అంతా సుఖంగా వుంటారు.

ఈ చిత్రంలో కథ కొత్తదనడానికి వీల్లేదు. "దాసి" మొదలైన పాత చిత్రాల ఛాయలు కనిపిస్తాయి. హాస్యంకోసం ప్రత్యేకపాత్రలను ప్రవేశపెట్టనందుకు సంతోషించాలిగాని, పూర్తిగా విషాదచిత్రంగా తయారుచేసినందుకు విచారించాలి. 'మెలోడ్రామా' అంటే యేమిటని కొందరు పాఠకులు మమ్మల్ని అడిగారు. 'మెలోడ్రామా'కు "పెంపుడుకొడుకు" కంటె ఉచితమైన ఉదాహరణ కనిపించదు. ప్రతి పాత్రా, ప్రతిదానికీ, సహజమైన అనుభూతి కంటె ఎక్కువ అనుభూతిని, ముఖ్యంగా శోకాన్ని అభినయిస్తుంది. కొడుకును పెంపకంయిస్తూ రంగస్వామి బావురుమని యేడుస్తాడు. పొరుగింటి అంబుజం హఠాత్తుగా వీడ్కోలు గీతం ఎత్తుకుంటుంది. మంగమ్మ చిత్రం పొడుగునా ఒకే శోకస్థాయిలో నిలబడి వుంటుంది. శోభాదేవి బీదవాళ్ల కష్టాలు తలుచుకుని విచారపడుతూంటుంది. ఎప్పుడూ ఖుషీగా వుండే మోహన్‌కూడా ఆఖర్న తన తల్లి మంగమ్మ అని తెలిసి జుగుప్సాకరమైన యేడుపు అభినయిస్తాడు. ఇలాగ మోతాదుమించిన శోకంతో కరుణరసం కాక, కరుణరసాభాసం యేర్పడుతుంది.

ఈ చిత్రంలో గాలిలో వేళ్లాడుతున్న పాత్రలు చాలావున్నాయి. ప్రొఫెసరు పాత్ర మొదట్లో కనిపించి, మధ్యలో మాయమై, విస్మరించబడి మళ్ళీ చివరికి ప్రత్యక్షమవుతుంది. ప్రత్యేకం నీతివాక్యాలు ఉపన్యసించడానికి మాత్రం యీ పాత్ర హాజరవుతుంది. దాసీయువతి గౌరికి కూడా కథలో సరియైన స్థానంలేదు. ఆమె తను దాసీదాన్నని చెప్పుకున్నది గనుక అలా అనుకోవాలిగాని లేకపోతే సినిమాతార అనుకోవలసిందే. ఆమె పాడిన "సన్నజాజి తోటలో..." అనే పాట భావకవుల చేత వ్రాయబడి, సినిమాతారలచేత పాడబడవలసిందే గాని దాసీ పాత్రకు అనుగుణమైనదిగా లేదు.


మంగమ్మ పనిగత్తెగా చేరిన ఆఫీసరు, అతని భార్య అన్యోన్యంగా వున్నట్టు ఒక దృశ్యంలో భ్రమ కలుగుతుంది. మరొక దృశ్యంలో భర్త ఉంపుడుకత్తె యింటికి పోతూ భార్యని చితకగొడతాడు. ఇలాటి జెర్కులు ఇంకావున్నాయి. ముత్తడికి తన తల్లి జైలులో వుందని తెలుసు. అయినా ఆమె విడుదలకోసం నిరీక్షించడు. ఒకవేళ విడుదలయితే యెక్కడవుందో అన్వేషించడు. యాదృచ్ఛికంగా మార్కెట్‌లో కలుసుకుంటాడు.

సంభాషణలు పేలవంగా వున్నాయి. గ్రామ్యం, శిష్టవ్యావహారికంగా మిళాయి చేయబడ్డాయి. దాదాపు ప్రతి పాత్రా మాటలద్వారా, పాటలద్వారా లోకంమీద, సంఘంమీద, విధిమీద, కార్మికులమీద ఒకేరకం అభిప్రాయాలు వెల్లడిస్తుంది. పాత్రలు మాట్లాడక, పాత్రలద్వారా రచయిత మాట్లాడతాడు. పాటలు తీసివేసినా అభ్యంతరం లేనట్లున్నాయి. ఒక్క పాట పి. రాజసులోచన నృత్యంచేస్తూ పాడినది మాత్రం (ప్లేబాక్ జిక్కి) ఆహ్లాదకరంగా వుంది. ఆ సన్నివేశం అతుకు అయినా నృత్యంకూడా ఆహ్లాదకరంగానే వుంది.

ఈ లోపాలున్నప్పటికి "పెంపుడుకొడుకు" చిత్రం ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొనగలదని విశ్వసించవచ్చు. మాతృప్రేమ ఎన్ని చిత్రాలలో వచ్చినా శక్తిని, కొత్తదనాన్ని కోల్పోని కథావస్తువు. ఇది యీ చిత్రంలో సంపూర్ణంగా వున్నది. నటీనటుల్లో చిన్న ముత్తడుగా మాస్టర్ మోహన్ బాగా నటించాడు. కుమారి నటనకూడా సంతృప్తికరంగా వుంది. పుష్పవల్లి, శ్రీరామమూర్తి, సావిత్రి తమతమ పాత్రలను బాగా పోషించారు. ఆదిఇరానీ ఫొటోగ్రఫీ, లైటింగు చక్కగా వున్నాయి. ఆర్టుశాఖ కూడా సహజత్వాని కెక్కడా దెబ్బ తగులకుండా పనిచేసింది కాని, ఊరవతల కొండల సెట్టింగు మాత్రం కృత్రిమంగా తయారు చేసినట్టు తెలిసిపోతోంది. శబ్దగ్రహణం వగైరాలు తృప్తికరంగా వున్నాయి.

ఈ చిత్రం ప్రివ్యూ వాహినీ ప్రొజెక్షన్ థియేటర్లో తొమ్మిదవ తేదీ రాత్రి యివ్వబడింది.

ఈనెల 11 వ తేదీన దక్షిణ భారత ఫిలిం వాణిజ్య మండలివారు మద్రాసు, వుడ్‌లాండ్స్ హోటల్లో ఇద్దరు సెన్సార్ అధికార్లకు సన్మానం చేశారు. ఒకరు కొత్తగా మద్రాసు ప్రాంతీయ సెన్సార్ అధికారిగా నియమింపబడిన జి. టి. శాస్త్రిగారు. రెండోవారు కొత్తగా కేంద్రఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులుగా నియమింపబడిన పోటూరి సత్యనారాయణగారు. ఈ సన్మాన సభకు అతిథిగా పూర్వం యిక్కడ ప్రాంతీయ



రాజఘాటులో గాంధీజీ సమాధిపై పుష్పగుచ్ఛాలుంచుతున్న బొంబాయి సినిమా ప్రముఖులు. ఈ నెల 8, 9 తేదీలలో ఢిల్లీలో జరిగిన క్రికెట్ ఉత్సవంలో వీరు పాల్గొన్నారు. డేవిడ్, జైరాజ్, సజ్జన్, భీగంపారా, యశోధరా కట్జూ మున్నగువారు ఈ బొమ్మలో వున్నారు.

★

మద్రాస్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి "రోహిణి"లో జి. వరలక్ష్మి



★ సెన్సార్ అధికార్లకు సన్మానం ★

అధికారిగా పనిచేసి, తరవాత కలకత్తాలో పనిచేసిన కె. శ్రీనివాసన్ గార్కూడా వచ్చారు. వీరిప్పుడు తమపదవికి రాజీనామా యిచ్చినట్లు తెలుస్తోంది. సభకు పలువురు సినిమా ప్రముఖులు హాజరయ్యారు. ఎ. రామయ్యగారు అధ్యక్షత వహించారు.

రామయ్యగారు అతిథులను ఆహ్వానిస్తూ, జి. టి. శాస్త్రిగారు ఇదివరకు ఆలిండియా రేడియో స్టేషన్ డైరెక్టరుగా మద్రాసు, తిరుచిరాపల్లి, కలకత్తాలలో పని చేశారనీ, అందుచేత వారికి సంగీతంతోను, సంగీత నాటకాలతోను బాగా పరిచయం ఏర్పడి వుంటుందనీ, ఈ పరిచయం వారి ప్రస్తుత కర్తవ్య నిర్వహణలో ఉపకరించగలదనీ అన్నారు. ఫిలిం నిర్మాతల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని వారికి తోడ్పడగలరని ఆశిస్తున్నామని అన్నారు. మోటూరి సత్యనారాయణగారు కూడా ఫిలిం విచారణ సంఘంలో సభ్యులుగా పనిచేసినందువల్ల ఈ పరిశ్రమతో వారికి పూర్వ పరిచయం వుందనీ, అందుచేత పరిశ్రమ ఎదుర్కొంటున్న యిబ్బందులను తొలగించడానికి వారు కేంద్రంలో పని చేస్తారని ఆశిస్తున్నామనీ రామయ్యగారన్నారు. ఫిలిం సెన్సార్‌షిప్ అనేది పెద్ద సమస్యగా తయారైందనీ, లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టితీసిన చిత్రంలో సెన్సార్ వారు 'ఇది తీసెయ్యి, అది తీసెయ్యి' అంటే నిర్మాతలకు చాలా కష్టం అనిపిస్తుందనీ, సెన్సార్లు, నిర్మాతలు పరస్పర సుహృద్భావంతో పనిచేసి క్రమేణా సెన్సార్‌షిప్ విధానమే రద్దయేందుకు ప్రయత్నించాలనీ కూడా ఆయన అన్నారు.

రామయ్యగారి తరవాత వాసన్‌గారు వేదికపై కెక్కి చాలసేపు మాట్లాడారు. ముఖ్యంగా "ఫిలిం పరిశ్రమ విమర్శకులను, శ్రేయోభిలాషు లనుకునేవారిని, ప్రభుత్వ దృక్పథాన్ని" ఆయన అధిక్షేపించారు.

"ఫిలిములు బాగుండడంలేదు, బాగుండడంలేదు, అంటే సరికాదు. ఎక్కడ బాగుండడంలేదో, ఎందుకు బాగుండడంలేదో, మేము ఏంతప్పు చేస్తున్నామో చెప్పండి. బాగలేని ఫిలిములున్నాయని నేను ఒప్పుకుంటున్నాను. ప్రతిరంగంలోను మంచి చెడ్డ వుంటాయి. అలాగే ఫిలిముల్లోకూడా మంచివీ, చెడ్డవీ ఉంటాయి. అంతమాత్రాన ఫిలింపరిశ్రమనంతటిన్నీ ఎందుకు తెగనాడతారు? ఫిలిములద్వారా ప్రజలకు వినోదం, విద్య, విజ్ఞానం, సాంస్కృతికవికాసం ఇవ్వవచ్చునని మాకు తెలుసు. మేము ముఖ్యంగా వినోదదాయకులం. మా నలభైయేళ్ల చరిత్ర తిరగేసిచూస్తే మా ఫిలిములు వినోదంకోసమే తీశామని తెలుస్తుంది. అయితే యీవినోదం ద్వారా భారతీయ సంస్కృతి నశించిపోయిందా? నశించినట్లు నాకేమీ కనిపించడంలేదు. మేము నిజంగా సంస్కృతిని నాశనం చేస్తుంటే ఫిలిము పరిశ్రమను ఇంతకాలం ఎందుకు సహించి వూరుకున్నారు? మేము న్యాయచట్టానికి లోబడి వినోదం ఇస్తున్నాం. ప్రజలకి మాపై అభిమానం వున్నది. అందుకనే మేమింతకాలం నిలబడగలిగాం. మా చిత్రాలను విమర్శించవద్దని నేను అనను. పత్రికలున్నాయి. అవి మా చిత్రాలు బావుంటే బాగున్నాయంటాయి; లేకపోతే బాగు లేవంటాయ్. ప్రజలున్నారు. వారికి మా చిత్రాలు నచ్చితే చూస్తారు. లేకపోతే మానేస్తారు. కాని ప్రభుత్వ దృక్పథమే నాకు అర్థంకావడంలేదు. ప్రభుత్వమేకాక మరికొందరు సంఘపెద్దలుకూడా మమ్మల్ని తెగనాడుతున్నారు. మేము సంస్కృతిని నాశనం చేస్తున్నామట. అయితే సంస్కృతిని ఉద్ధరించే బాధ్యత మాపై వున్నదన్నమాట. అయితే మీరు మాకు ధనసహాయం చెయ్యడంపోయి వినోదం పన్ను ఎందుకు వేస్తున్నారు? 'వినోదం పన్ను' అనే పేరును బట్టే మేము వినోదకారులం అని ప్రభుత్వం అంగీకరిస్తోందని అర్థం వుంది. మేము కేవలం వినోదకారులమే అయితే మాకు సంస్కృతి బాధ్యత ఎందుకు అంటగడతారు?

ఈ రోజుల్లో ఫిలిం పరిశ్రమను కూలనాడడం ప్రతివాడికీ ఫ్యాషనైపోయింది. ఎవణ్ణి చూసినా రెండు విషయాలే మాట్లాడుతాడు: తనవిషయం, సినిమాలవిషయం. మేము యేడాదికి 12 కోట్ల రూపాయలు ప్రభుత్వాలకు పన్నులు చెల్లిస్తున్నాం. మేము తప్పు చేస్తే విమర్శించండి; ఒప్పు చేస్తే హర్షించండి. అంతేగాని పూర్తిగా తెగనాడవద్దు.

ఫిలిమ్ పరిశ్రమకు ఏ ప్రభుత్వమూ ధనసహాయం చేయనక్కర్లేదు. ఒక్కమాట, సానుభూతి సూచకమైన ఒక్కమాట అంటే చాలు.

ఈపరిశ్రమ హామ్మంటే పోయేదికాదు. ప్రజలహృదయాల్లో పాతుకుపోయి వుంది. తిండి, గుడ్డ, యిల్లు తరవాత ప్రజలకి నాలుగో అవసరం వినోదం. అది మేము యిస్తున్నాం. ముఖ్యంగా బీదప్రజలకే ఫిలిములు కావాలి. డబ్బు బాగా వున్నవాళ్లు నాటకాలకో, మరే ప్రదర్శనలకో పోతారు. కాని బీదప్రజలకి అందుబాటులో వున్నది ఫిలిము ఒక్కటే. మూడణాలు పెడితే ఎవడైనా "అవ్వయ్యార్" చూడవచ్చు. మూడణాలతో ఏనుగులు, కోటలు, నాట్యాలు అన్నీ చూడవచ్చు. మూడణాలతో కైలాసం చూడవచ్చు. కాని ఆ ఫిలిమ్ తీయడానికి నాకు 30 లక్షలు పట్టింది. ఆ డబ్బు నాకు తిరిగి రావాలి. తిరిగి వస్తేనే నేను మళ్ళీ కొత్త చిత్రం తీయగలను. అందుకనే వినోదం పన్ను తగ్గించమని అడుగుతున్నాము."

వాసన్‌గారి ఉపన్యాసం ముగిసిన తరవాత సన్మానానికి సమాధానంగా మోటూరి సత్యనారాయణగారు మాట్లాడారు. ఫిలిమ్ పరిశ్రమను పూర్తిగా తెగనాడే వ్యక్తులు బహు కొద్దిమంది అనీ, వారి నిందలను వాసన్‌గారూ, ఇతరనిర్మాతలు ఇంతగా పాటించి బాధపడవలసిన అవసరం లేదనీ, ఫిలిములను ఎక్కువమంది ఆదరిస్తూనే వున్నారనీ ఆయన అన్నారు.

జి. టి. శాస్త్రిగారు మాట్లాడుతూ దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి కార్యవర్గంతో తాను ముఖాముఖి కొన్ని విషయాలు చర్చించాలనుకుంటున్నాననీ, త్వరలో కార్యవర్గం ఇందుకోసం తనతో సమావేశమైతే బావుంటుందనీ శాస్త్రిగారన్నారు.

"జనగణమన" ప్రార్థనతో సమావేశం ముగిసింది. ★

కీ. శే. డాక్టర్ వెంకటేశ్వర్లు

యోగీశ్వరీ పిక్చర్స్ అనే సంస్థను నెలకొల్పి "యోగబ్రహ్మం" అనే చిత్రం ప్రారంభించిన నిర్మాత, నటుడు, గాయకుడు డా॥ కప్పగంతుల వెంకటేశ్వర్లుగారు ఈ నెల 10 వ తేదీ రాత్రి మద్రాసులో కడుపునొప్పితో బాధపడుతూ పరమపదించారని తెలుపుటకు విచారిస్తున్నాము. వారి భౌతిక దేహాన్ని కడసారి దర్శించడానికి హెచ్. ఎమ్. రెడ్డి, లింగమూర్తి, జగ్గయ్య, కామెరా అన్నయ్య మున్నగు సినిమాప్రముఖులు వచ్చారు. డా॥ వెంకటేశ్వర్లుగారి స్వస్థలం గుంటకల్లు. వీరి వయస్సు 48 ఏళ్లు. భార్య, ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల వున్నారు. శాంతి, ప్రతిజ్ఞ, పెద్దమనుషులు, లక్ష్మి మున్నగు చిత్రాల్లో నటించారు. "యోగిబ్రహ్మం" అసంపూర్ణ చిత్రానికి ఇప్పటికి 4 పాటలు రికార్డు అయివున్నాయని తెలుస్తోంది. ★

ప్రశ్నలు — సమాధానాలు

సి. హెచ్. వి. వి. ప్రసాదరావు—వాల్తేరు.

నేటి పెక్కు హిందీ చిత్రాలకన్న, మన తెలుగు చిత్రాలే బావున్నాయని నా అభిప్రాయం. మీరేమంటారు?

—హిందీ చిత్రాలసంఖ్య ఎక్కువగనక చెడ్డచిత్రాలుకూడా ఎక్కువే వుంటాయి. అయినా ఇదివరకువలె కాక యిప్పుడిప్పుడు హిందీ చిత్రాల్లో ప్రయోజనం కల కథావస్తువుల నెన్నుకోవటం జలుగుతోంది. అదీగాక హిందీ చిత్రాలు టెక్నికల్ విశిష్టత కోసం, ప్రొడక్షన్ విలువలకోసం బాగా కృషిచేస్తాయి. అందుచేత తెలుగు చిత్రాలే మంచివని చెప్పడానికి వీలులేదు. ఈమధ్య వచ్చిన తెలుగు చిత్రాలు నిరుత్సాహ జనకంగా వున్నాయి.

*　　*　　*

డి. వి. ఆర్. రాజు—అమనాం.

మీరు మనస్ఫూర్తిగా ఏ చిత్రాన్నైనా మెచ్చుకున్నారా?

—నిజంగా బాగున్నదనిపించినచిత్రాన్ని మనస్ఫూర్తిగానే ప్రశంసించాము.

*　　*　　*

తుమ్మిడి భాస్కరరావు—వేములూరు.

జయంతీవారి "బంగారు భూమి" లో నటీ నటులు ఎవరు? డైరెక్టరు ఎవరు?

—అంజలీదేవి, టి. ఆర్. రామచంద్రన్, సహస్రనామం, మైనావతి మున్నగువారు. డైరెక్టరు కృష్ణస్వామి.

*　　*　　*

పుణ్యమూర్తుల కొండలరావు—పెనికేరు.

మన తెలుగు సినీ జగత్తులో 'కేరక్టరు' యాక్టర్లను తెలుపుతారా?

—తారలకు వయస్సు ముదురుతున్న కొద్దీ కారెక్టర్ యాక్టర్లవుతారని హాలీవుడ్‌లో ఒక ఛలోక్తి వున్నది. ఇక్కడా అంతే.

*　　*　　*

పూడిపెద్ది వెంకటలక్ష్మి—జంషెడ్‌పూర్.

"శోవాడీస్" చిత్రము కేవలము క్రైస్తవ మతప్రచారమునకని మా స్నేహితురాలూ, లేదు ఆనాటి మూఢ అధికార దురంతాల వల్ల ప్రజలు పడే బాధలు చూపి, హింసను అహింస జయించగలదని చాటిన చిత్రమని నేనూ వాదించుకుంటున్నాము. మీరు ఏది రైటని సమర్థిస్తారు?

—"శోవాడిస్" లో మీరు ఏ మహత్తరప్రయోజనం కనిపెట్టినా నిర్మాతలు మాత్రం మంచి సెటింగుల్నీ, ఎక్స్ట్రాలనీ, గ్లాడియేటర్లనీ టెక్నికలర్‌లో చూపించడానికే ఆచిత్రం తీసివుంటారని తోస్తుంది.

*　　*　　*

బి. ఎల్. నారాయణ—ఒంగోలు.

మీరు ఆంగ్లసాహిత్యమునకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి వాటినే సీరియల్ గా ప్రచురించెదరేమి? తెలుగు నవలలు ఎప్పుడూ ఒక సీరియల్ గా ప్రచురించి, రెండవది ఇతర సాహిత్యములనుండి గ్రహింపరాదా?

—తెలుగులో స్వయంగా నవలలు వ్రాసే వారి సంఖ్య చాల తక్కువ. ఎక్కువమంది రచయితలు కథానికలే వ్రాస్తున్నారు. స్వతంత్రంగా మంచి నవలలు వ్రాసి పంపితే తప్పకుండా ప్రచురిస్తాము. ఇదివరలో అలా కొన్ని ప్రచురించలేదా?

*　　*　　*

కె. రామకృష్ణ—మచిలీపటణము.

మీరు క్రిందటి సంచికలో "ఘంటసాల బలరామయ్యగారు అక్టోబర్ 29 వ తేది రాత్రి పరమపదించారు" అని ప్రచురించారు. ప్రభ వీక్లీలో 28 వ తేది రాత్రి అని ప్రచురింపబడింది. అయితే పై తేదీలలో ఆయన ఏ తేదీన పరమపదించినట్లు?

—కే. శే. బలరామయ్యగారు తెల్లవారితే అక్టోబరు 30 వ తేదీ అనగా ఆరాత్రి (29 వ తేదీ రాత్రి) 12 గంటలకు కాలధర్మం చెందారు. ★

అశ్వరాజ్ ప్రొడక్షన్సు వారి "అన్నదాత" చిత్రం ఈనెల 2 వ తేదీన రేవతీ స్టూడియోలో ప్రారంభింపబడింది. ప్రారంభోత్సవం పూర్ణా. పిక్చర్సు అధినేత జి. కె. మంగరాజుగారు జరిపారు. నిర్మాత కె. గోపాలరావు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. రచయితలు: మల్లాది వెంకట కృష్ణశర్మ, డా॥ గాలి బాలసుందరరావు. ఈ చిత్రం యిప్పటికి 2500 అడుగులకు పైగా తయారైంది. అంజలీదేవి, నాగేశ్వరరావు ప్రధాన పాత్రలు ధరిస్తున్నారు. ఎస్. వి. రంగారావుకూడా నటిస్తున్నారు.

*　　*　　*

కీ. శే. బలరామయ్యగారు ప్రారంభించిన చిత్రాన్ని వారి కుమారులు పూర్తి చేయ సంకల్పించారు. ఈ చిత్రంలో మూడు రీళ్లదాకా తయారై వున్నదట. అంజలీదేవి, ఎన్. టి. రామారావులతో కొన్ని రోజులు షూటింగు జరిగినది. ఈలోగా బలరామయ్యగారి మరణంవల్ల చిత్రం ఆగిపోయినది.

*　　*　　*

మహారాష్ట్ర దర్శకుడు దత్తా ధర్మాధికారి పదహారేళ్ల అంధబాలికజీవితం చిత్రంగా తీస్తున్నాడు. ఆ బాలిక పేరు మాయాగంగూలీ. తనపాత్ర తనే నటిస్తోంది. ధర్మాధికారి కుమారుడు ఆహ్లాద్ ఆబాలిక తమ్ముడుగా నటిస్తాడు. ప్లేబాక్ గాయకుడు తలత్ మహమూద్ ఒక సన్యాసి వేషం ధరిస్తాడట.

*　　*　　*

ధర్మాధికారి డైరెక్టుచేసిన "భాగ్యవాన్" అనే చిత్రం ఉత్తరదేశంలో విజయవంతం అయిందట. త్వరలో ఈ చిత్రం తమిళంలోకి డబ్ చేయబడుతుందట.

*　　*　　*

నవకేతన్ వారి "రాహీ-ఢోబన్" షూటింగ్ పూర్తయిందట. ఈ నెలాఖరుకు విడుదల కావచ్చునట. కామినీకౌశల్, అభి భట్టాచార్జి ప్రధాన పాత్రలు ధరించారు.

*　　*　　*

న్యూథియేటర్సువారి "దేవదాసు" చిత్రానికి కామెరామాన్‌గా పనిచేసి ఇప్పుడు పెద్ద డైరెక్టర్లలో ఒకడుగా పరిగణింపబడుతున్న బిమల్ రాయ్ "దేవదాసు" కథను ఇప్పటి టెక్నికల్ అభివృద్ధి సహాయంతో మళ్ళీ చిత్రం తీయాలని భావిస్తున్నాడట. దర్శకత్వంలో మాత్రం బారువా అనుసరించిన పద్ధతినే అనుసరించుతాడట. పూర్వం ఆ చిత్రనిర్మాణంలో పనిచేసినవ్యక్తులు బిమల్ రాయ్‌కు తిరిగి తోడ్పడవచ్చునట.

*　　*　　*

"దోబిఘాజమీన్" లో రైతుపాత్రధారి బల్‌రాజ్ సహానీ మళ్ళీ బిమల్ రాయ్ దర్శకత్వాన తయారుకానున్న ఒక చిత్రంలో నటిస్తాడట. ఇది శరత్ కథ ఆధారంగా గల "మహేష్" అనే చిత్రం.

*　　*　　*

గోదావరి వరదబాధితుల సహాయనిధికిగాను రాజ్ కపూర్ తీసిన "ఆగ్" చిత్రం లండనులో ప్రదర్శించబడింది. దీనికి సెంట్రల్ స్టూడెంట్స్ కమిటీవారు ఆధ్వర్యం వహించారు.

"దోబిఘాజమీన్" చిత్రాన్ని లండనులో ప్రదర్శించిన ఏషియన్ ఫిలిం సొసైటీవారు "పృథ్వీవల్లభ్" (సొహరాబ్ మోడీ), "మా" "పరిణీత" (బిమల్ రాయ్), "శకుంతల" "తీన్‌బత్తీచార్‌రస్తా" (శాంతారాం) చిత్రాలనుకూడా వరసగా ప్రదర్శిస్తారని తెలుస్తోంది.



"అన్నదాత" ప్రారంభోత్సవంలో అమ్మాజీ, కుటుంబరావు, చలం, నాగేశ్వరరావు, రంగారావు

"బాబ్లా"

అగ్రదూత్ దర్శకత్వాన తయారైన యీ బెంగాలీచిత్రం హిందీలో పునర్నిర్మించబడి యిటీవల మద్రాసులో విడుదలయింది. స్టార్ టాకీస్‌లో పత్రికా ప్రతినిధులకు ప్రివ్యూ యివ్వబడింది. ఈ చిత్రానికి సంగీతం ఎస్. డి బర్మన్; ఫొటోగ్రఫీ విభూతిలాహా. నటీనటులు శోభాసేన్, మంజూడే, మోలీనాదేవి, మాస్టర్ నీరెన్, ఫణీష్ బెనర్జీ, అసిత్ బరన్, పహారీసన్యాల్ మున్నగువారు.

బెంగాలీలు బాధలను చిత్రించడం స్పెషలైజ్ చేశారని ఇటీవల కె శ్రీనివాసన్ గారన్నారు. "బాబ్లా" చూస్తే ఈ ఆరోపణ అక్షరాలా నిజమనిపిస్తుంది. చిత్రంలో ముచ్చుకైనా హాస్యం 'రిలీఫ్' లేదు. ఉద్యోగం చేస్తున్న భర్త కారు ప్రమాదంలో మరణించగా, భార్య పున్న పిల్లకొడుకును పెంచడానికి పడిన కష్టాలూ, ఆకొడుకు తెలివితేటలూ, చదువులో శ్రద్ధ కలిగినవాడైనూడా తల్లి జబ్బు, పేదరికం

(53-వ పేజీ చూడండి)



అశ్వరాజ్ ప్రొడక్షన్సువారి "అన్నదాత" ప్రారంభోత్సవ సమయాన (3.11-53) తీసిన ఫోటో. దీనిలో డైరెక్టరు వేదాంతం రాఘవయ్య, రచయితలు మల్లాది కృష్ణశర్మ, డా॥ బాలసుందరరావు, అతిథిగా వచ్చిన కామెరామాన్ టి. ఎస్. రంగా, నిస్టిప్రబ్యూషరు జి. కె. మంగరాజు, సి. సీతారాం, కొత్తనటి అమ్మాజీ, కుటుంబరావు, చలం, నాగేశ్వరరావు, రంగారావు, ఛాయాదేవి, సురభి కమల, ఆర్టుడైరెక్టరు టి. వి. ఎస్. శర్మ, కామెరామాన్ సి. నాగేశ్వరరావు, అసిస్టెంట్లు ఇ. ఎస్. ఎన్. మూర్తి, రాజు, సౌండు రికార్డిస్టు శేషాద్రి మున్నగువారున్నారు.



ఎమ్. ఓ. ప్రొడక్షన్సువారి "బాల్లా"లో ఒక నృత్య సన్నివేశం.



"పెంపుడుకొడుకు'లో మేఘాల్ని చూసి నెమలిజంటలాగ సరదాపడుతున్న సావిత్రి, శ్రీరామమూర్తి.

(22-వ పేజీ తరువాయి)

ఇక్కడే గడిపిపోవాలని మరీమరీ చెప్తున్నాను. తప్పకరండి.

అన్నపూర్ణమ్మ.
వేలి ముద్ర."

రామా : అంతా ఆశ్చర్యంగా వుంది. మామగారేమో అట్లా వ్రాశారు. అత్తయ్యగారేమో ఇట్లా వ్రాస్తున్నారు!

శారద : (కళ్ళు ప్రకాశిస్తుంటాయి) వెళ్దామండి. అమ్మ అంతగా వ్రాస్తూంటేనూ! అన్నయ్యేమన్నా డబ్బుపంపించాడేమో!

రామా : నాకేమీ తోచటం లేదు. రాత్రికి ఆలోచిద్దాంలే. (నిష్క్రమిస్తాడు)

[తెర]

5

[అదే స్థలం. రాత్రి 8 గంటలు. చేతిలో పూలపొట్లంతో సహా-రామారావు ప్రవేశం. శారద, చేతిలో లాంతరుతో అతనికి ఎదురు పోతుంది.]

శారద: (చేతిలో పొట్లం అందుకుంటూ) ఏమండి, డబ్బిచ్చారా? ఏం తీర్మానించుకున్నారు?

రామా : (సంతోషంగా) ఇచ్చారు. అడ్వాన్సు 30 రూ॥ అడిగి తీసుకున్నాను. 6 నెలల్లో తీర్చేటట్టు. నాకో ఉపాయం తోస్తున్నది.

శారద : (ఎగిరి గంతేసినట్టు ఆదుర్దాగా) ఏమిటది?......రేపు బయల్దేరుదామా? ఎల్లుండా? చెప్పండి!

రామా : కొంచెం తమాయించుకో. చెబుతా. ముందు స్నానం చెయ్యాలి. ఆతర్వాత.

శారద : (గాభరాగా) అబ్బ చెప్పండి. చెప్పకపోతే నేను నీళ్ళు పెట్టను...

రామా : ఇప్పుడు చెప్పనంటే చెప్పను!

(రెండు నిమిషాలుపాటు రామారావు తెర వెనక్కి పోయి, తడి తువ్వాలు కట్టుకుని వస్తాడు. ఈలోగా, శారద విస్తరవేసి పీట వేసి వుంచుతుంది.)

శారద: (అన్నం వడ్డిస్తూ) ఏమండి చెప్పరు? చెప్పండీ?

రామా : (కులాసాగా) ఈనెల గ్రాసమంతా తెచ్చి పడెయ్యడం: మిగిలిన 30 రూ॥కి...

శారద : నాకో వాయిల్ చీరె, రవిక; మీకు ఓ పంచె, చొక్కా; దుప్పటి; అంతేనా?

రామా : కాదు...

శారద : ఇంకేమిటి?...

రామా : మీ నాన్నకి కళ్ళజోడు... కొంటాను.

శారద : (దిగ్భ్రమతో) సరే...అంతే... పాపం...కళ్ళజోడు లేకండా నాన్నకి కళ్ళు కనపడవు...

[తెర]

6

[సుబ్బయ్యగారిల్లు..తెల్లారితే పండగ.]

సుబ్బయ్య: ఏమే...

అన్నపూర్ణ: వస్తున్నాను.

సుబ్బయ్య: కళ్ళజోడు లేకపోవటం, ప్రతిదానికీ నిన్ను పిలవాల్సి వస్తోంది: ఎక్కడున్నా కానీ దొరికితేనా?

అన్నపూర్ణ: రేపు పండగ ఎట్లా వెళ్తుందో!

సుబ్బయ్య: పస్తు లేకండా వెళ్ళదు. పొంగలి లేకపోతే పీడాపాయిరి కాని, అంబలి అన్నా దొరుకుతుందా? అని నా ఏడుపు.

అన్నపూర్ణ: అబ్బాయికి రాశానండి... డబ్బు పంపమని. ఇంతవరకు...

సుబ్బయ్య: (దీర్ఘ నిశ్వాసం విడిచి.) నీ కొడుకు...డబ్బు పంపటం మనం తినటం ...ఈ జన్మకు లేదు.

అన్నపూర్ణ: ఏమో...రేపాక వేళవస్తే రాకూడదా? అది సరే కానిండి, వెంకటప్పయ్యగార్ని డబ్బు అడిగేరా, పొద్దున ఇటొచ్చినట్టున్నాడు?...

సుబ్బయ్యగారు: ఆ. అడిగాను. ఆయన పెదవి రవివనూ విరిచాడు. జీతంగూడా ఇప్పట్లో రాదు. వస్తేమాత్రం దేనికి సరిపోతుందంటావ్?

అన్నపూర్ణ: కళ్ళజోడు...

సుబ్బయ్య: అంతే. కళ్ళజోడు కే. మిగతా పొట్టతిప్పలకి ఎవర్ని అడుగుతావు? భగవంతుణ్ణి అడగాలి!

అన్నపూర్ణ: అల్లుడిగారికి రాస్తేనో?

సుబ్బయ్య: రాస్తావు! ఏమని? ఏం ప్రయోగం? ఇటు చూడు! ఆయన మాత్రం మనకన్నా ఏమంత మెరుగుగంటావు? అమ్మాయి సరిగ్గా మూడుపూట్లా తింటుందో లేదో!

అన్నపూర్ణ: కలో గంజో, గుట్టుచప్పుడుగా కాలం వెళ్ళబోస్తున్నారు వాళ్ళూ. అన్నట్టు...(ఏదో తల్చుకుని) వాళ్ళని రమ్మని రాశాను...రేపు.

సుబ్బయ్య: (కూలబడిపోయి) అయ్యో! నీ తెలివి మండా! ఏం చూసుకుని రాశావే? ఇంట్లో కుండలు డింకీలు కొడ్తుంటే వాళ్ళుకూడా ఎందుకే మనతోపాటు ఏడవడానికి...?

అన్న : (నిరాశగా) అబ్బాయి డబ్బు పంపిస్తాడనుకున్నానండీ. పండగకన్నా పంపడా అని...

సుబ్బయ్య: నా బొందా, నీ బొందానూ. వాళ్ళొస్తే ఇక నేను ఎట్లా...వాళ్లకి ఏం పెట్టను. తెల్లారితే పండగకదా. ఛీ ఛీ... మనిషి బతకటానికి ఎన్ని అవాంతరాలు కల్పిస్తున్నార్రా! మనం ఎవరికి ఏం ద్రోహం చేశామని ఈ శిక్ష!

అన్న : మీరు ఊరికే విసుక్కోకండి. ఎట్లా జరగాల్సింది అట్లా జరుగుతుంది!

సుబ్బయ్య : (విరక్తిగా) అంతకన్న నువ్వూ నేనూ శాంతిపొందే మార్గం వేరే ఏం వుందగనక! రోజల్లా తిండిలేకండా పిల్లలకు చదువు చెప్పాలి. వాళ్ళు నాదగ్గర- నీదగ్గర - ఏం నేర్చుకుంటారు? నేనేం నేర్పగలను వాళ్ళకి? ఏదో - దురదృష్టం కాకపోతే-చదువు ఇంత చవకగా వస్తుందా, ఇంక ఎక్కడైనా?

అన్న : నేను పోయి మహాలక్ష్మమ్మగార్నడిగి బియ్యం పట్టుకొస్తాను. ఆమె కాస్త మనమంటే జాలిపడుతుంది.

సుబ్బయ్య : జాలి కూడానా! ఇదొక

రకం ముష్టి అందూ! ఆమె నీకు బియ్యం ఇచ్చి - ఆమెలో ఆమె ఒక అడుగు గొప్ప దనంలో పెరుగుతుంది. అందరూ,!...

అన్న: మీ వేదాంతం నా కర్థంకాదు.

సుబ్బయ్య: ఆమాట కొస్తే, చాలామందికి అర్థంకాదు; అకలైనవాళ్ళకి ... బుద్దున్న వాళ్లకి-అవి ఎవరి వ్యాఖ్యానమూ అక్ఖర్లే కండానే అర్థమైవుంటాయి.

అన్న: నేను వాదించలేనండి మీతో..

సుబ్బయ్య: ఇందులో వాద నేముందే? అన్నీ ప్రశ్నలే కాని సమాధానాలు ఒక్కదానికీ లేవు. నువ్వు వెళ్ళి నీ తంటాలు నువ్వు పడు. పో.

అన్న: నే వొచ్చిందాకా ఎక్కడికీ వెళ్లబోకండి. ఎక్కడున్నా పడిపోతా రేమో...

సుబ్బయ్య: వెళ్లను...వెళ్లను...(నీరసంగా గోడకి జేరగిలబడి ఆలోచిస్తుంటాడు.)

[తెర]

7

[అదే చోటు. కాని మధ్య తెర అడ్డం. శారద, రామారావు ప్రవేశిస్తారు. తెల్లారి పోయింది. ఎనిమిది గంటలు.]

రామా: ఏమిటీ నిశ్శబ్దం! పండగపూట ముందు ముగ్గన్నా లేదు!

శారద: ఏమోనండి. నాకేమిటో దడెగా వుంది! పదండి పదండి.

రామా: ఉండు. నీ పెట్టె తీసి, కళ్ళజోడు చేతికి తీసుకో. వాళ్ళు అకస్మాత్తుగా సంతోషించాలి!...

శారద: అవునండి. (పెట్టె తెరిచి, కళ్లజోడు తీసుకుంటుంది. పెట్టె మూసి భర్త కిస్తుంది. తెర తొలిగించి లోపలికి వెళ్తారిద్దరు.)

(ఒకమూల కింద సుబ్బయ్యగారి శవం. తలకట్ట ప్రమిదదీపం. అన్నపూర్ణమ్మ కింద పడివుంటుంది. ఆమెకి స్పృహ వుందీ లేనిదీ తెలీదు.)

శారద: (క్షణంలో సంగతి ఊహించుకుని) అమ్మా...అమ్మా...ఎంత పని జరిగిందే. పెద్దగా ఏడుస్తుంది. శవం పక్కన వెళ్ళి పడ్తుంది విసురుగా.)

రామా: అత్తయ్యగారు......అత్తయ్యగారు!...

అన్నపూర్ణ:(మెల్లిగా కదిలి కళ్ళు తెరిచి) అమ్మా వొచ్చావా?...

అంతా అయిపోయిందే...అమ్మా...

శారద: నాన్నని - (వెక్కుతూ) సంతోష పెడదామని ... కళ్ళజోడు కొనుక్కొచ్చానే...(మాట్లాడలేక వెక్కి వెక్కి ఏడుస్తుంది)

రామారావు: ఏంజరిగిందండి అత్తయ్యగారు? (కళ్ళనీళ్ళు తుడుచుకుంటాడు)

అన్నపూర్ణమ్మ: ఏముంది నాయనా! రాత్రి దొడ్లోకిపోయినారల్లే వుంది. కళ్ళు కనపడవుగా? ఆ వొరల్లేని బావిలో పడిపోయినారు. మేం పొయ్యేవరకు - అంతా అయిపోయింది. ఆయన కష్టాలు తీర్చుకుని పోయినారు... నేను మిగిలివున్నాను.

రామారావు: విచారించకండి...(పోస్టుమెన్ కేక. రామారావువెళ్లి ఒక మనియార్డర్ ఫారం, డబ్బు తెస్తాడు. భార్యవంక తిరిగి) మీ అన్నయ్య - శర్మ డబ్బు పంపించాడు. మీ అమ్మను దస్కతు పెట్టమను. అన్నట్టు ఆయనకి టెలిగ్రాం ఇచ్చారా?

అన్న: నువ్వే కాస్త ఆపని చేసిరా నాయనా...

(పెద్దగా ఏడుప్తో తెరవాలుతుంది) ★

★ కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

కూడా వచ్చారు. ఆమెకు అయిదో నెల ప్రవేశిస్తోంది. కాని, యీ ఆశలన్నీ నిరాశలైనాయి. ఆరాత్రి నిద్రలో ఆమెకు ఏదో పీడకల, గర్భనిర్భేదకమైన కల వచ్చింది. కాని ఈసారి వచ్చిన ఈ పిండ ప్రమాదం ఆమెకు గండమే అయింది. ఆరాత్రినుంచీ యింటికి డాక్టర్లూ నర్సులూ వస్తూనేఉన్నారు. పోతూనే ఉన్నారు. కాని, మనిషి చాలా నీరసించింది. ప్రాణభీతి ఎక్కువైంది. ఆనాటిరాత్రి ఎవరో దొంగలువచ్చి ఆమె నగలకోసం ఆమెను గొంతుక పిసికి చంపుతున్నట్లుగా ఆమెకు ఘోరమైన కల వచ్చింది. ఆకల ఆఖరుకు ఆమెను గొంతు పిసికి చంపినట్లయింది. సిద్ధాంతుల మాట స్థిరాంకురమై దొంగలు చంపినట్లే అయింది. దొంగలు బ్రతకనివ్వర నేభయంతో ఆమెనగలన్నీ పెట్టెలలో పెట్టి దాచివేసింది. తన ప్రాణం యిక భద్రం అనుకున్నది. హాయిగా నిద్రపోవచ్చు ననుకున్నది.

కాని,

"కారణమైన కర్మములు
కాకదిగంబడ వన్నిగొందులం
దూరిన నెంతవారలకు; -"

తనకర్మ ఫలితంగా తనకున్న నగలప్రీతిచే, దొంగలభీతిచే ఆమెగతి ఆరీతి అయింది. దొంగలచేతిలో మరణం తప్పినదికాదు. నరసింహారావు ముఖాన రెండో పెళియోగం మూడు పంక్తులలో నాలుగు ముఖాలవాడు వ్రాసినందున సువర్ణాబాయి అయిదోతనానికి లోపం లేకుండా స్వైలోకానికి వెళ్లినదని అన్నది యీ లోకం. ★

'స్వతంత్ర' (ఇంగ్లీషు) వార్షిక సంచిక

ఇంగ్లీషు స్వతంత్ర వారపత్రిక వ్యవస్థాపకులు ఏటేటా దీపావళి రోజున ప్రత్యేక ఆకర్షణలతో వార్షిక సంచికను ప్రచురిస్తూ వుంటారు. ఈ దీపావళికి కూడా ఒక ప్రత్యేక సంచిక వెలువడింది. ప్రతి సంవత్సరంలాగే యీసారి కూడా దేవి ప్రసాద్ రాయ్ చౌదరిగారి చిత్రమే ముఖచిత్రంగా వుపయోగించారు.

కేంద్రమంత్రి టి. టి. కృష్ణమాచారి, సర్ సి. పి. రామస్వామి, కె. ఈశ్వర దత్, ఎస్. పార్థసారథి, మంజరీ ఎస్. ఈశ్వరన్, శాంతా రంగాచారిగార్లు, తదితర ప్రముఖులు వ్రాసిన వ్యాసాలు, ఎస్. రాజం, హెచ్. వి. రామగోపాల్, వి. నరసింహమూర్తిగార్లు వేసిన వర్ణచిత్రాలు యీ సంచికలోని ప్రత్యేక ఆకర్షణలు. ముద్రణ, వ్యాసాల ఏర్పాటు చక్కగా వున్నాయి. వెల రు. 1-8-0. ★

★ బాబ్లా ★

(53-వ పేజీ తరువాయి)

మొదలైన పరిస్థితులవల్ల చదువుకాని దేశ గ్రామ్మ జీవిక సంపాదించడం, అతని ప్రయత్నాలన్నీ విఫలమై, మందు కొనడానికి డబ్బులేక తల్లి చనిపోవడం, ఈ చిత్రంలో యితివృత్తం. ఆ బాలుడు తల్లిశవం కాలుతుంటే శ్మశానంలో కూర్చుని "నా తల్లి ఎందుకు చనిపోయింది?" అని ప్రశ్న వేస్తాడు. దానికి జవాబు రాదు. పేదవారి నికృష్టజీవితం చూపించడం యీ చిత్రం లక్ష్యం. సంభాషణలు విషవాత్మకంగా వున్నాయి. మొత్తం అయిదే పాటలున్నా చిత్రం కథకంటే దీర్ఘంగావున్నది. "రాత్ కే రాహీ థక్ మత్ జానా" అనేపాట చాలా బాగుంది. బాబ్లా (బాబు)గా మాస్టర్ నీరేన్ బాగా నటించాడు.

★ మనిషిలో మనిషి ★

(35-వ పేజీ తరువాయి)

మాడుతున్నారని మాత్రం నేను అనలేను” అని కోపావేశంగా హైడ్ అన్నాడు.

అట్టర్సను ఆమాటవిని, “ఏమండోయి! మీరు మాట్లాడేది సరసంగా మర్యాదగా మాత్రంలేదు” అన్నాడు.

ఆ రెండో మనిషి పండ్లికిలించి అడవిమనిషి లాగున బిగ్గరగా నవ్వాడు. మరుక్షణంలో అతి చలాకీగా, తాళం త్రిప్పి తలుపు తెరచి ఇంట్లోకి వెళ్లి అదృశ్యుడైనాడు.

హైడ్ నిష్క్రమించిన తర్వాత అట్టర్సన్ నివ్వెర పోయినిల్చున్నాడు. అటుపిమ్మట వీధి ఎగువకు మెల్లిగా అడుగులువేస్తూ, మధ్యమధ్య రెండేసి అడుగుల కొకసారి ఆగి, ఏదో ఆలోచిస్తూ తికమక పడ్తున్న రీతిగా తన నొసలును చేతితో పట్టుకొనడం ప్రారంభించాడు. అతడప్పుడు మథిస్తున్న విషయం సామాన్యధోరణిలో పరిష్కార మయ్యేదికాదు. హైడ్ ముఖం పాలిపోయినట్లుంది. మర్రిగుజ్జు వాడల్లేఉన్నాడు. అతనికి జన్మతః ఏర్పడిన అంగవైకల్యం లేకుండానే మనిషియందు వికృత స్వరూపం కన్పిస్తోంది. చిరునవ్వు నవ్వినా వెక్కిరించినట్లుగా వెగటుగా ఉంటుంది. లాయరుతో మాట్లాడినంత సేపూ, పిరికిగుండెవాడు పైకి దబాయించినట్లుగా, ఖూనీచేసినవాని ధోరణిగా, ఆదరా బాదరాగా, కంగారైన కంఠస్వరంతో అతను మాట్లాడినాడు. ఇవన్నీ అతని తరహాలో పొడులక్షణాలే--ఇన్ని అవకతవకలు అతనిలో కన్పించినప్పటికీ, అతని యెడల ఇంతకాలంనుంచీ అట్టర్సనుకు అమితమైన అసహ్యం భయం ఎందుకు కలిగినవో ఆ మూలకారణం అతనికి బోధపడలేదు. “ఇతనిలో ఇంకా నాకు అర్థంకాని గొడవ ఏదోఉంది. ఇదేదో చిద్విలాసంగాఉంది. ఇతనిపిలో చూస్తే మానవత్వం కన్పించదు. కొండగుహలలో ఉండే అడివి గొడవమనిషి లాగున ఉన్నాడు. ఏదైనా మాయరూప కామరూప విశేష మాయిది? ఏదైనా భూతం అతనిలో ప్రవేశించి యీ విధంగా వికృతరూపంలోకి అతనిని మార్చివేసిందా? ఇదే యితని విషయంలో నిజమని నాకుతోస్తోంది. మిత్రమా! హెన్రీ జెకిల్ మహాశయా! సైతాను శిఖాముద్ర ఎవరిముఖంమీదనైనా తాండవమాడుతూ ఉన్నట్లయితే, అది నామిత్రుడవైననీముఖంమీదనే అని నాకు స్పష్టంగా కన్పిస్తోంది” అని అట్టర్సను తనలో తాను మథనపడ్తూ అనుకొన్నాడు.

ఆ సందుమొన దాటి తిరిగితే, ఒక చౌకుఉంది. అక్కడ పురాతనములైన రమ్యములైన భవనములు చాలాఉన్నాయి. ఆ భవనములు చాలా పెద్ద హోదాబాపతువి అగుటవల్ల చాలాభాగం మరమ్మతు లేక శిథిలం అయిపోయినాయి. ఆ మేడలలోని మిద్దెలలోని భాగాలు రకరకాలవారికి అద్దెలకిచ్చారు. మ్యాపులు ప్లానులువ్రాసేవాళ్లకూ, శిల్పులకూ, పేచీకోరు లాయర్లకూ, దగా వ్యాపారాల ఏజెంట్లకూ అద్దెలకిచ్చారు. వీధిమూలనుంచి లెక్కిస్తే రెండో యిల్లు పూర్తిగా ఒకరి ఆక్రమణలో ఉంది. ఈ యింటి సింహద్వారం శ్రీమంతులయిల్లు అన్నట్లుగా ఉంటుంది. బయటఉన్న దీపాల వెల్తురుతప్ప మరేవిధమైన కాంతి ఆ గుమ్మంలో ప్రకాశించడంలేదు. అట్టర్సను అక్కడ ఆగి తలుపుతట్టినాడు. మంచి ముస్తాబులోఉన్న వయోవృద్ధుడైన ఒక నవుకరు వచ్చి తలుపు తెరచెను.

“డాక్టరు జెకిల్ యింట్లోఉన్నారా, పూల్!” అని లాయరు ప్రశ్నించాడు.

“అట్టర్సన్‌గారూ! చూచి చెప్తాను ఉండండి” అని పూల్ అన్నాడు. విశాలమైన హాలులోకి అట్టర్సనుగారిని తీసికొని వెళ్ళాడు. ఈ హాలు ఎత్తు తక్కువదైనప్పటికీ, సుఖంగానేఉంది. నేలచప్టామీద నిగనిగలాడే రాళ్లు పరచబడిఉన్నాయి. హాలులో వెచ్చగా ఉండేటందుకు నెగడు ఒకటి ఉంది. ఆ హాలులో చంద్రపుచెక్కతో చేయబడిన కుర్చీ వగైరా మేజా సామాన్లు అమర్చబడిఉన్నాయి. “బాబూ! మీరిక్కడ యీ నెగడుప్రక్కను కాసేపు కూర్చుంటారా? లేకపోతే భోజనశాలలోకి దారిచూపించమంటారా?” అని పూల్ ప్రశ్నించాడు.

“ఎందుకులే-ఇక్కడ యీహాలులోనే కూర్చుంటాను” అని లాయరు బదులుచెప్పాడు. అక్కడే కుర్చీని లాగుకొని నెగడుకు సమీపంగా ఆనుకొని హాయిగా కూర్చున్నాడు. ఇతడు కూర్చున్న యీ హాలు అంటే డాక్టరుగారికి మక్కువ ఎక్కువ-లండను నగరం అంతటిలోను యీ హాలులో ఉన్నంతహాయి

ఏ హాలులోనూ లేదని అట్టర్సనుగారుకూడా అనేక పర్యాయములు అన్నారు: కాని, నేటిరాత్రి అతని ఒళ్లు కంపిస్తోంది. హైడ్‌యొక్క ముఖము చూచినప్పటినుంచీ ఆ ముఖబింబం అతని మనస్సును మథన పెడ్తూనేఉంది. జీవితం అంటే అతనికొక వింత వెగటు అసహ్యం ప్రారంభమైంది. అతని మనస్సు యీవిధంగా ఆ దోళనపడ్తూఉన్న సమయంలో హాలులోని మేజా సామానులమీద సెగడులోని మంటల దీప్తి ప్రకాశిస్తోంది. నీడయొకటి తరాబీమీద కదలుతూఉంటే అతని మనస్సుకూడా కలవరపడింది. ఇంతలో పూల్ ప్రవేశించాడుగాని అట్టర్సను తన కలవరపాటుకు తానే కంగారుపడ్డాడు. డాక్టరు జెకెలుగారు యింట్లో లేర నిన్నీ ఎక్కడికో బయటకు వెళ్ళి యున్నారననీ పూల్ అన్నాడు.

"శల్యశోధనమందిరద్వారంగుండా హైడ్ లోపలికి ప్రవేశించాడు. నేను చూశాను పూల్! డాక్టరు జెకిల్ యింట్లో లేనిసమయంలో అది ధర్మమేనా?" అని అట్టర్సను అన్నాడు.

"అందులో అక్రమం ఏమీలేదండీ అట్టర్సనుగారూ! హైడ్‌గారివద్ద మరొకతాళంచెవి ఉంది" అని ఆ సేవకుడు సమాధానమిచ్చాడు.

"అయితే, ఆ యువకునియందు మీ యజమానికి అమితమైన నమ్మకమున్నట్లుంది"అని ఆయన ఏదో ఊహాధోరణిగా అన్నాడు.

"అవునండి బాబూ! ఆయనకు చాలా నమ్మకం ఉంది - హైడ్‌గారి మాటప్రకారం మేము నడుచుకోవాలని మాకు ఉత్తరువులు జారీచేశారు" అని పూల్ అన్నాడు.

"హైడ్‌తో నా కెప్పుడూ సమావేశభాగ్యం లభించలేదనుకుంటాను" అని అట్టర్సను అన్నాడు.

"లేదుబాబూ లేదు—ఆయన ఎప్పుడూ యిక్కడ భోజనం చెయ్యరు. ఆయన అసలు యీ యింట్లో యీ వైపుభాగంలోకి రానేరారు! ఆయన ఎప్పుడూ పరిశోధనామందిరంగుండానే వెడ్తారు" అని బట్లరు పూల్ జవాబిచ్చాడు.

"సరే మంచిది - వెళ్ళివస్తా పూల్! నమస్తే."

"నమస్తే! అట్టర్సన్"

లాయరు యింటిదోవపట్టి నడకసాగించాడు. కాని, ఆలోచనలమీద ఆలోచనలతో తల బరువెక్కి తనలో తాను యిలా అనుకొంటూ నడుస్తున్నాడు— "పాపం! హెన్రీ జెకిల్ ఏదో పెద్దగోతిలో పడ్డాడు. చిన్నప్పుడుకూడా చాలా విచ్చలవిడిగా ప్రవర్తించిన మనిషి—అదంతా చాలాకాలంక్రిందటి మాట— అయితేనేం? భగవంతుని చిద్విలాసానికి హద్దుమేర లంటూఉండవు. ఆ! అసలుసంగతి అదేఅయిఉంటుంది. అతని తాలూకు పాపిష్ఠి సాంగత్యదోషం ఏదో యీ విధంగా అతనిని పట్టుకొని పీడిస్తోంది. అతను బయట పెట్టుటకు వీలులేని పాపకర్మఫలితం ఏదో అతనికొక వ్రణంలాగున తగులుకున్నది—ఏనాడో ఏండ్లక్రిందట అతడు చేసిన అపచారం ఏదో, మనస్సుకు మళ్ళీ జ్ఞాపకంరాకపోయినా, దాని ప్రాయశ్చిత్తం యిప్పుడు అతను అనుభవిస్తున్నాడు" అని తనలోతాను అనుకుంటూ అట్టర్సను నడుస్తున్నాడు. మధ్యమధ్య కొంతసేపు తన పూర్వప్రవర్తననుకూడా ఆత్మపరిశీలన చేసుకుంటూ, ఎక్కడెక్కడి మారుమూల విషయాలనూ మననం చేయడం ప్రారంభించాడు. ఏదైనా ఒక పాత అపచార దోష పిశాచము తన కంటుకొని యున్నదేమో నని తనకుతానే శోధించి చూచుకున్నాడు. అతని గత జీవితప్రవర్తనం నిష్కల్మషంగానే ఉంది.నిజంగా వారి పూర్వచరిత్రలో అపచారదోషాలు అనుమానించ గలిగినవాళ్లు ఎవ్వరూ ఉండరు. అయినప్పటికీ, తన జీవితంలో తనకు కన్పించిన అనేక దుష్కర్మలకు తానే మనస్సులో క్రుంగిపోయినాడు. కాని, తాను కొన్ని పాడుపనులను సంకల్పించి విరమించిన విషయం తలచుకొని తనలో తానే సంకోచిస్తూ సంతోషించాడు—ఇంతలో తాను యోచిస్తున్న అసలు విషయానికి తిరిగివచ్చాడు—ఒక ఆశావకాశం హఠాత్తుగా అతనికి స్ఫురించినట్లయింది. "హైడ్ సంగతి' ఏమిటో కొంత తరచిచూచినట్లయితే, అతని మర్మం ఏదో కొంత తప్పక బయటపడుతుంది—అతని చూపులను బట్టి కొన్ని కృత్రిమ తంత్రాలు ఉండి ఉంటాయి— జెకిల్ ప్రవర్తనలో ఎటువంటి ఎంతటి మహోపచారములు కన్పించినప్పటికీ, యీ హైడ్ యొక్క క్రూరతత్వాంతర్గత రహస్య విశేషములతో పోల్చిచూచినప్పుడు జెకిల్ ప్రవర్తన పట్టపగటి సూర్యకాంతివలె నిర్మలంగా కన్పిస్తుంది—ఇప్పుడు నడుస్తూఉన్న వ్యవ

(25 వ పేజీ తరువాయి)

"నా పేరు తెలుసుకోడాని కేముంది? అడిగితే చెప్పనా! నా పేరు పీర్ గ్రింగైర్"

"ఇంతకంటె మంచి పేరు తెలుసు నాకు"

"నీది రాతిగుండె" అన్నాడు కవి. "అయినా సరే నువ్వు నాకు కోపం తెప్పించలేవు. నన్ను బాగా అర్థం చేసుకున్నప్పుడు ప్రేమించగలుగుతావేమో. నన్ను గురించి అంతా దాపరికం లేకుండా చెప్పావు. మరి నన్ను గురించికూడా దాపరికం లేకుండా చెప్తాను విను.—

"నా పేరు పీర్ గ్రింగైర్ అని చెప్పాను. నా తండ్రి ఈ దేశంలోనే ఒక నగరంలో అధికారిగా ఉండేవాడు. బర్గండియన్లు దాడి చేసినప్పుడు నా తండ్రిని ఉరి తీశారు. పారిస్ ముట్టడిలో మా అమ్మని చంపేశారు. అది ఇరవైఏళ్లకిందట. అంటే ఆ కేళ్లకే ఆధారం లేనివాణ్ణయాను. పారిస్ నగరవీధులే అప్పుడు నాకు ఆశ్రయమైనాయి. అప్పుడు పదేళ్లు ఎలా గడిపానో నాకే తెలియదు. ఏ పళ్లఅమ్మే అమ్మనో అడిగి ఒకపండు తీసుకు తినేవాణ్ణి. ఏ దుకాణదారో నా మొహాన్ని ఇంత పాతరొట్టె గిరవాటు వేసేవాడు. రాత్రివేళ పోలీసులదారి కడ్డంగా పడిపోయినట్లు నటించేవాణ్ని. వాళ్లు నన్ను ఖైదులో పెట్టి తాళం వేసేవాళ్లు. అక్కడ రాత్రి పడుకునేందుకు పీచో గడ్డో దొరికేది. ఇంత దీనంగా బ్రతికినా పొడుగ్గా ఎదిగాను. చలికాలంలో ఎండతప్ప ఒళ్ళు వెచ్చబరుచుకోడానికి మరో ఆధారం లేదు. పదహారేళ్ళకి ఏదో వృత్తి నేర్చుకుని జీవనాధారం ఏర్పరచుకోవాలని తోచింది. అన్నివృత్తులూ ప్రయత్నం చేశాను. సిపాయినైనాను, కాని నా సాహసం చాలలేదు. క్రైస్తవ భిక్షుకుడనైనాను; కాని అంత పవిత్రుణ్ని కాలేకపోయాను. చివరికి వడ్రంగం నేర్చుకోవాలని చూశాను; కాని నా బలం చాలలేదు. ఉపాధ్యాయవృత్తి అవలంబించాలనుకున్నాను; కాని నాకు చదవనైనా రాదు. కొంతకాలానికి బోధపడింది; నాలో ఏలోపముందో, ఏవృత్తికీ పనికిరాలేకపోయినాను. అందువల్ల చిట్టచివరికి కవినైనాను. కవివృత్తి చాలా చిత్రమైనది. బికారిఅయినవాడు తేలిగ్గా ఈవృత్తి అవలంబించవచ్చు. దొంగతనం కంటె ఇది కొంతపరువైనదే. నా స్నేహితులు చాలామంది దొంగతనానికి దిగడం మంచిదని చెప్తున్నారనుకో. ఒకరోజున నా అదృష్టవశంవల్ల నాటర్ డామ్ చర్చికి మతాధికారిఅయిన డామ్‌క్లాడ్ ఫ్రాలో పరిచయ భాగ్యం లభించింది. ఆయనకు నాపట్ల అవ్యాజమైన అనురాగం కలిగింది. ఈ రోజున నేను చదువుకుని పండితుడనైనానంటే అది ఆయన ప్రసాదమే. గ్రంథాలు చదివాను, శాస్త్రాలు పఠించాను, కవిత్వం నేర్చాను. ఇవాళ ఉదయం న్యాయసభాభవనంలో ప్రదర్శించబడిన నాటకం నేను రచించిందేన. ఆ నాటకానికి జనం లెక్కలేనంత మంది వచ్చారు. భవనం పట్టలేదు. ఆ మధ్య కనపడిన తోకచుక్కని గురించి ఆరువందల పేజీల గ్రంథం ఒకటి వ్రాశాను. తూర్పుచౌకులో ఒక ఫిరంగి ఉంది చూశావా? ఎల్లా పేలుతుందో చూడాలని ఒకసారి కాల్చారు—అప్పుడు ఇరవైనలుగురు చచ్చిపోయారు. ఆ ఫిరంగి నిర్మాణంలో నా చేతకూడా కొంత ఉంది. నేనూ అంత తీసిపోయినవాణ్ని కాను. నాకూ కొన్ని గారడీలు తంత్రాలు చేతనౌను. పారిస్ బిషప్‌ని ఎలా అనుకరించాలో, ఇంకా పెద్దపెద్దవాళ్ళ నెలా వెక్కిరించాలో నీ మేకకి నేర్పగలను. నా నాటకాలు ప్రదర్శిస్తే నాకూ బోలెడు ధనం లభిస్తుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, నేను నీ కనుసన్నల్లో మెలగడానికి సిద్ధంగా ఉన్నానని తెలియపరుస్తున్నాను. నా విజ్ఞానం నా పాండిత్యం పూరిగా నీకోసం వినియోగపరుస్తాను. నువ్వు ఎలా కోరుకుంటావో అల్లా నీతో ఉండడానికి సిద్ధంగా ఉన్నాను.—భార్యాభర్తలుగానైనా సరే, అన్నచెల్లెళ్ళలాగైనా సరే—సిద్ధమే."

గ్రింగైర్ ఆగాడు. తన ఉపన్యాసం ఆమెపైన ఎలా పనిచేసిందో అని పరిశీలించాడు. ఆమె దృష్టులు నేలపై నిగిడ్చి ఉన్నాయి.

"ఫీబస్" అంది జిప్సీ—తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు. "ఫీబస్ అంటే అర్థం ఏమిటి?"

తన ఉపన్యాసానికీ, ఫీబస్ అనే మాటకీ ఏమి సంబంధమో తెలియక కొంతసేపు కవి తబ్బిబ్బైనాడు. అయితే తన పాండిత్యం చూపుకోడానికి అవకాశం దొరికినందుకు సంతోషించాడు.

"అది లాటిన్ మాట. దాని అర్థం సూర్యుడు" అని చెప్పాడు.

"సూర్యుడా!" అంది జిప్సీ.

"అవును. పురాణంలో ఒక దేవుడు. మంచి విలుకాడు."

"ఒక దేవుడు!" అని గొణిగింది జిప్సీ. ఆమాటలో పరధ్యాన స్పష్టంగా కనపడింది.

ఈసమయంలో ఆమె చేతికున్న గాజులలో ఒకటి వదులై నేలపై పడింది. గ్రింగైర్ వెంటనే వొంగి అందుకోబోయాడు. అతను లేచి చూసేసరికి జిప్సీ లేదు, మేక లేదు. తలుపులకు గొళ్లెం పడిన చప్పుడుమాత్రం వినపడింది.

"పోనీలే! పెళ్ళిపోతేపోయింది. పడుకోడానికి పడక దొరికింది." అనుకున్నాడు తత్త్వవేత్త. గదిఅంతా ఒకసారి తిరిగి పరిశీలించాడు. కాని ఎక్కడా పడక అనేది కనపడలేదు. ఒకమూల ఒక పెద్ద కర్రపెట్టె మాత్రం కనపడింది. పైమూతపై బొడిపెలు ఉన్నాయి. దానిపైన మెల్లిగా నడుము వాల్చాడు. అంపశయ్యపైన పడుకున్నట్లుంది. అయినా విశ్రాంతి కోసం అల్లాడుతున్న కవి అలాగే సర్దుకుని పడుకున్నాడు. పడుకుని తనలో ఇలా అనుకున్నాడు:


"ఇందుకు చింతించి ప్రయోజనం లేదు. అయినా ఇది పెళ్లి జరిగిన మొదటిరాత్రి అనుకోడానికే వింతగా ఉంది."


(ఇంకా వుంది)

★ మనిషిలో మనిషి ★

హారం ఎల్లకాలం సాగనేరదు. హెన్రీ జెకిల్ మందం దగ్గరకు దొంగవలె యీ దుర్మార్గుడు చాటుమాటుగా చేరుతూ ఉండడం ఏమిటో తల్చుకుంటే నాకు గుండె స్తంభించినట్లవుతోంది. పాపం! హెన్రీ జెకిల్ వ్రాసిన వీలునామా. సంగతియున్నా అందులోని అంశములున్నా యీ హైడ్‌కు తెలిసినట్లయితే, ఆస్తికి అంతటికీ తానే ఉత్తరాధికారియై త్వరగా భుక్తపరచుకోవలెననే ఆతురత అతనిలో అమితమైపోతుంది—ఏమైనాసరే, జెకిల్ గనుక నాకు అవకాశమిస్తే, యీ విషయంలో నేను పట్టుదలగా కల్పించుకోవాలి. జెకిల్ గనుక నాకు అవకాశమిస్తే—"అని అట్టర్సను తనలో తాను తర్కించుకుంటూ నడిచాడు. ఎందుచేతనంటే, ఆ వీలునామాలోని పరుష వాక్యాలు అతని కండ్లముందర అద్దంలో కన్పించినట్లుగా కన్పించాయి. (ఇంకావుంది)

Edited. Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
పుట్టుకతోనె సోమరిపోతూ దీర్ఘసూత్రుడూ మిన్నకుండెను.
తమ దురవస్థను పరిపూర్ణంగా ఆలోచించిన దీర్ఘదర్శియూ తానొంటరిగా బయలుదేరెను. బహుదూరమునగల కొలను చేరెను. కలకాలము సుఖమనుభవించెను.
దీర్ఘదర్శి చనిన వెనుక- నొక వేకువ జాముననే- బెస్తలచటు వలలు పన్ని- చేపలన్ని పట్టుకొనిరి.- ఆ యిద్దరు మిత్రులును- పట్టుబడిరి బెస్తలకు.
పట్టుబడిన చేపలను- ఎండబెట్ట తలచి వారు- తాడు తీసి గుచ్చుచుండ- ప్రాప్తకాలజ్ఞుడు- ఏమేమో యోచించెను.
మెలమెల్లగ ముందు పోయి- గుచ్చబడిన చేపలలో- చోటుచేసి తానుకూడ- నోటిలోను తాడు పట్టి- చచ్చినట్లు పడియుండెను.
ఆపద గడిచే మార్గం తోచక ఏమిసేయుదును, ఏందుబోదునని దీర్ఘసూత్రుడు చింతింపదొడగెను. భయముతో గంతులు వేయసాగెను.
ఎగిరి ఎగిరి పడు యీ మీనమును బెస్తలు పట్టి చంపివేసిరి.
చేపలు పట్టుట ముగిసినదీ- చీకటి దిక్కుల నలమినదీ- పట్టిన చేపల నన్నిటినీ- నీటిలొ ముంచి కడగవలెననీ- బెస్తలు తాటిని ఏటిలొ ముంచిరి.
ప్రాప్తకాలజ్ఞుడు తాటిని విడిచి నీటను మునిగి పారిపోయెను.
"హితవాక్యములను విననివారికి ఎప్పటికైనా ముప్పు తప్పదు. ప్రాప్తకాలజ్ఞుని వలెనే యుక్తిపరులు కాకున్ననూ ఆపద అన్నది తప్పదు సుండీ!"
అని ఆతడు చెప్పుచుండ- చిత్రవర్ణు రాజ్యానికి- గూఢచారిగా వెళ్ళిన- ధవళాంగుడు తిరిగి వచ్చి- హిరణ్యగర్భుని సన్నిధిని- వినమ్రుడై నిలచాడు.



డిస్ట్రిబ్యూటరు:

ఆంధ్ర, సీడెడ్ :— నవయుగ ఫిలిమ్స్, విజయవాడ.

మైసూరు :— విజయా టాకీ, బెంగుళూరు - 2.

నైజాం :— ప్రీమియర్ ఫిలిమ్స్, సికింద్రాబాద్.

ప్రసాద్ ఆర్టు పిక్చర్సు, మద్రాస్ - 17.